28 . 11. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శుక్రవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 178 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## యువత వల్లే స్టార్టప్ విప్లవం

- ప్రపంచానికే ఆదర్శం మన యువత
- దేశంలో 1.5 లక్షల స్టార్టప్‌ల ఏర్పాటు
- మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్
- ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు

**న్యూఢిల్లీ,నవంబర్ 27( వెలుతురు):**
భారత యువత, ముఖ్యంగా జెన్–జెడ్ (Gen Z) తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని ఆయన అన్నారు. గురువారం భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్



## సిగాచీ ఫార్మా పేలుడు ఘటన చిన్నదా?

54 మంది చనిపోయిన ఘటన చిన్నదేమీ కాదు

పోలీసులపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం

నిందితులను గుర్తించకపోవడంపై తీవ్ర అసంతృప్తి

డిసెంబర్ 9కి వాయిదా వేసిన ధర్మాసనం

# చైనా, జపాన్‌ల స్థాయి అభివృద్ధే టార్గెట్



- ప్రపంచంతోనే పోటీపడేలా స్కిల్డ్ యూత్
- కొత్త రంగాల్లో, కొంగొత్త మార్గాల అన్వేషణ
- తెలంగాణ రైజింగ్ 2047 సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- తెలంగాణ అభివృద్ధిని పతిబింబించేలా తెలంగాణ రైజింగ్–2047 పాలసీ డాక్యుమెంట్
- మూడు రీజియన్లుగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి
- పాలసీ డాక్యుమెంట్ పై అధికారుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**హైదరాబాద్,నవంబర్ 27( వెలుతురు):**
తెలంగాణ అభివృద్ధిని ప్రతిబింబించేలా తెలంగాణ రైజింగ్–2047 పాలసీ డాక్యుమెంట్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. 2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీ డాక్యుమెంట్ లో కనిపించాలన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి , పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ , రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ .. గా మూడు రీజియన్లను విభజించుకోవాలని



## కేసీఆర్ ఓఎస్‌డీని విచారించిన సిట్

ఫోన్ ట్యాపింగ్ కేసుపై విచారణ

రెండు గంటల పాటు కొనసాగిన విచారణ

**హైదరాబాద్,నవంబర్27( వెలుతురు):**
తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు మళ్లీ వేగం పుంజుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా ప్రత్యేక దర్యాప్తు




## బతుకమ్మకుంట వ్యవహారం

హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

డిసెంబర్ 5లోపు కోర్టు ఎదుట హాజరుకు ఆదేశం

## రాజకీయాల్లో గెలుపోటములు సహజం

మళ్లీ గెలుస్తాం...కెసిఆర్‌ను సిఎంను చేస్తాం

అసలు యుద్ధం 2028లో ఉంటుంది

తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్,నవంబర్ 27(వెలుతురు):**
రాజకీయాల్లో గెలుపోటములు సహజమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ గెలుస్తాం..అధికారంలోకి వస్తామని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ఎపిలో కల్వకుర్తిలో ఎన్టీఆర్ కూడా ఓడిపోయారని ఆయన గుర్తుచేశారు. అసలు యుద్ధం 2028లో ఉంటుందని



## కుంభకోణానికి ఆస్కారమే లేదు

ఇండస్ట్రియల్ పాలసీప దుష్ప్రచారం

పొల్యూషన్ ఫ్రీగా చేయడమే లక్ష్యం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,నవంబర్27( వెలుతురు):**
ఇండస్ట్రియల్ పాలసీ పై కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర

# మొదలైన పంచాయతీ ఎన్నికల సందడి..

నోటిఫికేషన్ విడుదల.. నామినేషన్లు షురూ!

మూడు విడతల్లో జరగనున్న ఎన్నికలు

**హైదరాబాద్,నవంబర్27( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాజకీయ సందడి మొదలైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తొలి విడత ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎన్నికలు మూడు విడతల్లో జరగనున్నాయి. తొలి విడత పోలింగ్ డిసెంబర్ 11న, రెండో విడత డిసెంబర్ 14న, మూడో విడత డిసెంబర్ 17న జరిగేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ పంచాయతీ ఎన్నికలు 12,760 గ్రామ పంచాయతీలు, 1,13,534 వార్డులకు జరుగుతాయి. నోటిఫికేషన్ విడుదల కావడంతో పలు చోట్ల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.తొలి దశ నామినేషన్లు వేస్తున్నారు అభ్యర్థులు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 10:30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి అవకాశం కల్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 555 పంచాయతీలు, 4952 వార్డు స్థానాలకు మొదటి విడత ఎన్నికలు జరుగుతున్నాయి. గురువారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ




కొనసాగుతోంది. వరంగల్ 91 పంచాయతీలు, 800ల వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. హనుమకొండ జిల్లా 69 పంచాయతీలు , 658 వార్డు స్థానాలు, మహబూబాబాద్ జిల్లా 155 పంచాయతీలు, 1338 వార్డు స్థానాలు, జనగామ జిల్లా 110 పంచాయతీలు,1024 వార్డు స్థానాలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా 82 పంచాయతీలు, 712 వార్డు స్థానాలు, ములుగు జిల్లా 48 పంచాయతీలు, 420 వార్డు స్థానాలకు గానూ ఎన్నికలు జరుగుతున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభమయ్యాయి. మొదటి విడతలో 630 గ్రామ పంచాయతీలు, 5,598 వార్డులకు నామినేషన్స్ స్వీకరిస్తున్నారు. నల్గొండ జిల్లాలో నల్గొండ, చండూరు రెవెన్యూ

# ఆర్ అండ్ బి లో కుల వివక్ష

మంత్రి సామజిక వర్గానికి చెందిన వారికే పదోన్నతులు, ప్రమోషన్లు, ఏక్టెన్షన్లు

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 27:**
రోడ్డు భావనాల శాఖలో తీవ్రమైన కుల వివక్ష నడుస్తోంది.మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తన సామాజిక వర్గానికి చెందిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు జోరుగా చర్చ సాగుతోంది.ఇటీవలి కాలంలో నేషనల్ సీఈగా రిటర్డ్ అధికారి ధర్మ రెడ్డిని నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరో ప్రాజెక్టు హ్యాంలో రిటైర్డ్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డిని నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇద్దరు రిటైర్డ్ అధికారులు ఒకే సామజిక వర్గానికి చెందిన వారు కావడంతో మిగత అర్హత కలిగిన ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకేకిస్తున్నారు. మంత్రి తన సామజిక వర్గానికి పెద్ద పీట వేస్తూ మిగతా ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు భవనాల శాఖ మంత్రిగా అడ్మినిస్ట్రేషన్ పై ద్రుష్టి పెట్టకుండా కేవలం కుల రాజకీయలు చేయడం పట్ల శాఖ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. అనుకున్న స్థాయిలో సిబ్బంది లేరు. కొత్త రిక్రూట్మెంట్ లేదు. నిధులు



లేవు. హెడ్ ఆఫీస్ మెంటనెన్స్ సరిగా లేక మహిళ ఉద్యోగులు విధులకు రావాలంటే భయపడుతున్నారు.గత కొద్దీ నెలలుగా ఆర్ అండ్ బి కార్యాలయంలో పరిశుద్ధం సరిగా లేదు.బాత్ రూమ్ లు శుభ్రంగా లేక భరించలేని దుర్వాసన వస్తున్నాయి.కంట్రాక్టర్లకు సమయానికి డబ్బులు రాకపోవడంతో ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం మానేశారు. దింతో పరిశుద్ద కార్మికులు ఎర్రమంజిల్ రావడం లేదు.వాసన భరించలేక ఈఎన్సి బయట కూర్చుని ఫైళ్ల మీద సంతకాలు పెట్టె పరిస్థితి ఏర్పడింది. సీనియర్ మంత్రి అయ్యి ఉండి ఉద్యోగులు , ప్రజల సమస్యల మీద ద్రుష్టి పెట్టకుండ సమయం దొరికినప్పుడల్లా ఆయనకు ఆయనే సీనియర్ మంత్రిని అని చెప్పుకోవడం తప్ప డిపార్ట్మెంట్ కు చేసింది ఎం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కింది స్థాయి జేఈలను కదిలిస్తే తమ మంత్రి పై ఒంటి కాలిపై లేస్తున్నారట.రిటైర్డ్ ఉద్యోగులకు ఏక్టేన్షన్ లు ఇవ్వడం కాకుండ ముందు శాఖ మీద ద్రుష్టి పెట్టాలంటున్నారు ఉద్యోగులు. మంత్రి సామజిక వర్గం అయితే చాలు క్షణాల్లో పనులు , పదవులు వచ్చేస్తున్నాయన్న అపవాదు నుండి బయటపడలంటున్నారు ఉద్యోగులు.ఇక ఆర్ అండ్ బి అడ్మిన్ బాధ్యతలు అర్హత కలిగిన వారికీ ఇవ్వకుండా జయ భారతికి ఇవ్వడం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.స్టేట్ రోడ్డు ఈఎన్సీ బాధ్యతలకే పరిమితం చేసిన మోహన్ నాయక్ లాంటి సీనియర్లకు అడ్మిన్ బాధ్యతలు ఇస్తే డిపార్ట్మెంట్ మరింత బాగుపడుతుంది అంటున్నారు. పంచాయితి రాజ్ ఈఎన్సీ గా జోగా రెడ్డి , ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఎన్సీ గా కృపాకర్ రెడ్డి , జీహెచ్ ఎంసీ పబ్లిక్ హెల్త్ ఈఎన్సీగా ఇలా కీలకమైన చాల శాఖల్లో మంత్రి సామాజిక వర్గానికే పెద్ద పీట వేస్తున్నారు.

# క్యాపిటల్ గెయిన్స్ మరో 2 ఏళ్లు పొడిగించాలి

- జధానికి భూములు ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు
- కావాలని రాజధానికి వ్యతిరేకంగా పోస్టులు
- అమరావతి 29 గ్రామాల పరిధి సరిపోదు
- దేవతల రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతా
- అమరావతి రైతులతో భేటీలో సీఎం చంద్రబాబు

**అమరావతి,నవంబర్27( వెలుతురు):**
కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శు క్రవారం అమరావతి పర్యటన ఉన్నందున క్యాపిటల్ గెయిన్స్ మరో 2 ఏళ్లు పొడిగించేలా కేంద్రాన్ని కోరాలని రైతులు సీఎం చంద్రబాబును కోరారు. రైతుల సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించారు. రాజధాని అమరావతి రైతులతో సచివాలయం 5వ బ్లాక్ కాన్ఫెరెన్స్ హాల్?లో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సమావేశానికి 80 మంది రైతులు హాజరు అయ్యారు. రైతుల సమస్యలపై కేంద్ర మంత్రి పెమ్మసాని, మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్?లతో ప్రభుత్వం ఇప్పటికే త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఈ త్రిసభ్య కమిటీ 3 సార్లు భేటీ అయ్యింది. అయితే ఇప్పుడు ఈ రైతుల సమావేశంలో సమస్యల పరిష్కారంపై మరింత స్పష్టత వచ్చింది. రైతులకు ప్లాట్లు కేటాయింపు, జరీబు భూములు, ఎసైన్డ్ భూములకు సంబంధించి సమావేశంలో చర్చ జరిగింది. ఇంకా పరిష్కరించదగ్గ సమస్యలన్నింటినీ త్రిసభ్య కమిటీ పరిష్కరిస్తుందని




తెలిపారు. హైదరాబాద్ తరహాలో అమరావతి అభివృద్ధి చెందాలంటే 29 గ్రామాల పరిధి సరిపోదని సీఎం చంద్రబాబు అన్నారు. అదే జరిగితే ఓ మున్సిపాలిటీగా మాత్రమే అమరావతి ఉంటుందని అన్నారు.

# సిగాచీ ఫార్మా పేలుడు ఘటన చిన్నదా?

హైదరాబాద్,నవంబర్27( వెలుతురు):

సిగాచీ ఫార్మా పరిశ్రమలో 54 మంది కార్మికుల ప్రాణాలను బలిగొన్న పేలుడు ఘటనలో పోలీసు దర్యాప్తు తీరును తెలంగాణ హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఇంత పెద్ద దుర్ఘటన జరిగి నెలలు గడుస్తున్నా దర్యాప్తు పూర్తి కాకపోవడంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది సాధారణ ప్రమాదం కాదని, ఇంతటి ఘోరంపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని చెప్పడం దారుణమని వ్యాఖ్యానించింది. ఈ ఘటనపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పోలీసుల వైఖరిపై ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. "ఇప్పటికే 237 మంది సాక్షులను విచారించినా పురోగతి ఏది? పేలుడుకు బాధ్యులైన వారిని ఇప్పటివరకు ఎందుకు గుర్తించలేదు?" అని నిలదీసింది. ఇంతటి తీవ్రమైన ఘటనకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయకపోగా, కేవలం డీఎస్పీ స్థాయి అధికారితో దర్యాప్తు చేయించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు దర్యాప్తు పురోగతిపై పూర్తిస్థాయి నివేదికను వెంటనే సమర్పించాలని అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణకు దర్యాప్తు అధికారి తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేసింది. దర్యాప్తులో పారదర్శకత లోపించరాదని, వేగంగా పూర్తి చేసి బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలని సూచించింది. అనంతరం, తదుపరి విచారణను డిసెంబర్ 9కి వాయిదా వేసింది.

# బతుకమ్మకుంట వ్యవహారం

హైదరాబాద్,నవంబర్ 27( వెలుతురు):

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంట వివాదంలో డిసెంబర్ 5వ తేదీ లోపు కోర్టు ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని ఏవీ రంగనాథ్‌ను ఆదేశించింది. లేకుంటే నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తామని హైకోర్టు హెచ్చరించింది. బతుకమ్మకుంట వ్యవహారంలో హైకోర్టుకు ఏవీ రంగనాథ్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఆయనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంటలోని ప్రైవేట్ స్థలంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి మార్పులు చేర్పులు చేయవద్దంటూ ఈ ఏడాది జూన్12వ తేదీన కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘిం చారంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి చర్యలు తీసుకో వద్దంటూ ఆయన సూచించింది. అంతేకాకుండా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలంటూ రంగనాథ్‌ను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. కానీ కోర్టుకు హైడ్రా కమిషనర్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలావుంటే ఇప్పటికే ఇక్కడ సుందరీకరణ పనులు సాగాయి. పూర్వవైభవం తీసుకుని వచ్చారు. ఇటీవల సిఎం రేవంత్ తదితరులు కలిసి ప్రారంభించారు.

# కుంభకోణానికి ఆస్కారమే లేదు

ఆగ్రహం వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని పొల్యూషన్ ఫ్రీగా చేయడమే తమ ప్రభుత్వ పాలసీ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈ పాలసీలో కుంభకోణానికి ఆస్కారమే లేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం తెచ్చింది పారదర్శకమైన పాలసీ అని చెప్పుకొచ్చారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు . బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తాము తెచ్చిన ఇండస్ట్రియల్ పాలసీ అర్థం కాలేదని తెలిపారు. ప్రతిపక్షాల నేతలు కావాలనే తమ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు ఇండస్ట్రీలను ఓఆర్ఆర్ బయటకు పంపాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. ఈ పాలసీ తమ ప్రభుత్వం కొత్తగా తెచ్చినది కాదని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వంలో కూడా ఈ పాలసీపై చర్చ జరిగిందని గుర్తుచేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదని... పాలసీ మార్చేది లేదని చెప్పుకొచ్చారు. ఇండస్ట్రియల్ పాలసీ రూపకల్పనలో తాను భాగమై ఉన్నానని వివరించారు. కొత్త ఇండస్ట్రియల్ పాలసీతో తెలంగాణ రాష్ట్రానికి అదనపు ఆదాయం వస్తుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా ప్రతిపక్షాల నేతలకు వ్యతిరేకించాలనే ఉద్దేశ్యం తప్పా ఏం లేదని విమర్శించారు. అయితే, నల్గొండ డీసీసీ నియామకంపై స్పందించడానికి నిరాకరించారు. పార్టీ ఇంటర్నల్ విషయాలను బయట మాట్లాడనని తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. తమ ప్రభుత్వంలో విద్యుత్ శాఖలో ఎలాంటి కుంభకోణం జరగలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్రాజెక్టు పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గత ప్రభుత్వం ఇండియా బుల్ అనే కంపెనీ దగ్గర ఉపయోగంలో లేని ఎక్విప్‌మెంట్ ఎందుకు కొన్నదని ప్రశ్నించారు. భద్రాద్రి ప్రాజెక్టులో అవుట్ డేటెడ్ టెక్నాలజీ వాడాల్సిన అవసరం ఏముంది..? అని నిలదీశారు. భద్రాద్రి ప్రాజెక్టు అనవసరంగా తెలంగాణ ప్రజలపై రుద్దిన ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు చేశారు.

# యువత వల్లే స్టార్టప్ విప్లవం

'విక్రమ్-%×%'ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్-జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని ఆయన గుర్తుచేశారు. దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైనప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని కొనియాడారు. గత దశాబ్ద కాలంలో దేశంలో స్టార్టప్ విప్లవం వచ్చిందని, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని మోదీ నొక్కిచెప్పారు. దేశంలో 1.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి కూడా పుట్టుకొస్తున్నాయని వివరించారు. ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ వంటి రంగాలతో పాటు ఇప్పుడు డీప్-టెక్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల వైపు కూడా యువత అడుగులు వేస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

# కేసీఆర్ ఓఎస్‌డీని విచారించిన సిట్

బృందం (సిట్) గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత సహాయకుడిగా (ఓఎస్‌డీ)



పనిచేసిన రాజశేఖర్ రెడ్డిని ప్రశ్నించింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ విచారణలో అధికారులు కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నూతన పోలీస్ కమిషనర్‌గా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన రాజశేఖర్ రెడ్డిని సిట్ విచారణకు పిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారవేత్తలు, మీడియా ప్రతినిధుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. ఈ కేసులో ఇప్పటికే పలువురు పోలీసు అధికారులను సస్పెండ్ చేయగా, కీలక నిందితుడిగా ఉన్న మాజీ అధికారి రాధాకిషన్ రావును అరెస్టు చేశారు. 'బీఆర్ఎస్ సుప్రీం' ఆదేశాల మేరకే తాము పనిచేశామని రాధాకిషన్ రావు తన రిమాండ్ రిపోర్టులో పేర్కొనడం సంచలనం రేపింది. ఈ క్రమంలోనే కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన రాజశేఖర్ రెడ్డిని విచారించడం ద్వారా మరిన్ని వివరాలు రాబట్టాలని సిట్ భావిస్తోంది. రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన సమాచారం ఆధారంగా ఈ కేసులో మరికొందరు కీలక వ్యక్తులను కూడా సిట్ విచారణకు పిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ దర్యాప్తు ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు దారితీస్తాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# చైనా, జపాన్‌ల స్థాయి అభివృద్ధే టార్గెట్

సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండదు అని చాటి చెప్పేలా తెలంగాణ రైసింగ్ పాలసీ డాక్యుమెంట్ ఉండాలన్నారు. వాస్తవిక దృక్పథం కనిపించేలా డిజైన్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, యువతకు మెరుగైన ఉపాధి లక్ష్యంగ తెలంగాణ ప్రభుత్వం విజన్ 2047కు సిద్ధమౌతోంది. అందరికీ సమాన అవకాశాలు, సమీకృత అభివృద్దే టార్గెట్ గా రానున్న 22 ఏండ్లకు ఈ భవిష్యత్ కార్యాచరణ ఉండబోతోంది. ఫ్యూచర్ సిటీతో రాష్ట్ర భవిష్యత్ ను కొత్త పుంతలు తొక్కించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సిద్ధమౌతోంది. అందుకే డిసెంబర్ 8,9న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ను నిర్వహించబోతోంది. దీనిపై ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, అజారుద్దీన్, సీతక్క ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణలో ఉన్నఅపారమైన పెట్టుబడుల అవకాశాలను ప్రపంచ పెట్టుబడిదారుల ముందు ఉంచటంతో పాటు, ఇక్కడ ఇన్వెస్ట్ చేయటం వల్ల కలిగే ప్రయోజనాలను ఈ రెండు రోజుల్లో షో కేస్ చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. అందుకే ఈవెంట్ ను కూడా భవిష్యత్ ఫోర్త్ సిటీలో ప్రభుత్వం ప్లాన్ చేసింది. విభిన్న రంగాల్లో పారిశ్రామిక అభివృద్ధికి గల అవకాశాలను వివరించటం, వివిధ రూపాల్లో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను ప్రకటించనుంది. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ రైజింగ్ విజన్ 2047 దార్శనిక భవిష్యత్ పత్రం, రాష్ట్ర భవిష్యత్తుకు సమగ్ర మార్గరూపం. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంతో ఈ డాక్యుమెంట్ తయారుచేశారు. సమాన వృద్ధి, మహిళా సాధికారత, యువశక్తి, స్థిరమైన అభివృద్ధి ం ఈ మూడు ప్రధాన రంగాలపై రాష్ట్ర అభివృద్ధి వ్యూహాన్ని ప్రభుత్వం ప్లాన్ చేసింది . తెలంగాణను భారతదేశంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దడం ఈ విజన్ డాక్యుమెంట్ లక్ష్యం. చిన్న రాష్ట్రమైనా ఇక్కడ ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి తెలియజేయాలని ప్రజా ప్రభుత్వం సంకల్పించింది. అభివృద్ధిలో పక్క రాష్ట్రాలతో కాదు చైనా, జపాన్ లతోనే పోటీ పడే లక్ష్యాలతో ముందుకుపోతోంది. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు , స్టార్టప్, లు, టూరిజం, ఎగుమతులు వంటి రంగాలు రానున్న రెండు దశాబ్దాల్లో ఆర్థిక వృద్ధికి కీలకరంగాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, సులభ అనుమతులు (, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు ) రాష్ట్రాన్ని పెట్టుబడిదారుల మొదటి గమ్యస్థానంగా నిలబెట్టనున్నాయి. ఈ బలాలే పునాదిగా మరింత పెట్టుబడులను ఆకర్షించే విధంగా విజన్ డాక్యుమెంట్ ఉండబోతోంది. హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ తెలంగాణను మూడు జోన్లుగా అభివృద్ధి సమతుల్యత సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేసేందుకు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేలా వ్యవసాయ కార్యాచరణ కూడా విజన్ డాక్యుమెంట్ లో భాగమౌతోంది. రాష్ట్ర అభివృద్ధిలో మహిళా సాధికారత కూడా అత్యంత ప్రధానమైన అంశంగా ప్రభుత్వం భావిస్తోంది. అందుకే కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. డెవలప్ మెంట్ ఎకానమీలో కాలుష్యం వల్ల కలిగే నష్టాలపై కూడా ఈ విజన్ డాక్యుమెంట్ ఫోకస్ చేస్తోంది. అందుకే నెట్-జీరో తెలంగాణను అవిష్కరించనుంది. బ్లూ , గ్రీన్ హైదరాబాద్ లక్ష్యంగా తెలంగాణ 2047 డాక్యుమెంట్ లో మూసీ పునరుజ్జీవం, దీనిలో భాగంగా 2959 చెరువులు, పార్కులు, అటవీ ప్రాంతాలను వాటి పూర్వ స్థితికి తీసుకురావటం లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన రోడ్లు, సౌర విద్యుత్ వెలుగులతో విలేజ్ 2.0 లక్ష్యంతో పనిచేయనుంది. ఇక మరో లక్ష్యంగా ఆధునిక రవాణ మౌలిక సదుపాయాల కల్పనను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు తరహాలో తెలంగాణకు మణిహారంలా రీజనల్ రింగ్ రోడ్డును ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. హై-స్పీడ్ మొబిలిటీ కారిడార్లను నిర్మించనుంది. రీజనల్ రింగ్ రైల్, 4 ఇండస్ట్రియల్ కారిడార్లు, 11 రేడియల్ రోడ్లను నిర్మించనుంది. వరంగల్, నిజామాబాద్, అదిలాబాద్, పెద్దపల్లి, కొత్తగూడెంలో కొత్త విమానాశ్రయాలను ఏర్పాటుచేయబోతోంది. హైదరాబాద్ నుంచి బందరు పోర్టు వరకు అత్యాధునిక హైవేను నిర్మించి సీపోర్టుకు అనుసంధానం చేయబోతోంది. గ్లోబల్ వర్క్ ఫోర్స్ తో పోటీపడేలా ప్రతీ యేడాది రెండు లక్షల తెలంగాణ యువతకు, లక్షమంది నిపుణులకు విదేశీ ఉపాధికి అవసరమైన నైపుణ్య అభివృద్ధి టార్గెట్ గా ప్రణాళికలు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాలుగా స్పోర్ట్స్ విలేజీల నిర్మిస్తారు. మానసిక ఆరోగ్యం, యోగా, ధ్యానం, క్రీడలు, సాంస్కృతిక అవగాహనతో సమతుల్య యువత అభివృద్ధి కోసం హోలిస్టిక్ వెల్ నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించటమే లక్ష్యంగా టూరిజం ప్రాంతాల అభివృద్ధి, నైట్ ఎకానమీ సిటీగా హైదరాబాద్ ఇమేజ్ ను క్రియేట్ చేయటం, బతుకమ్మ, బోనాలు, డెక్కన్ క్రాఫ్ట్స్ గ్లోబల్ పండుగలతో బ్రాండ్ తెలంగాణను విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పించారు. ప్రపంచ సినిమా రంగాన్ని ఆకర్షిస్తూ యానిమేషన్, గేమింగ్, ఫిలిం-టెక్ పరిశ్రమలకు తెలంగాణ కొత్త గమ్యంగా రూపొందే లక్ష్యంతో పనిచేస్తారు. రాష్ట్రంలోని ప్రతీ గ్రామంతో పాటు గ్లోబల్ సిటీ హైదరాబాద్ దాకా సమాన అవకాశాలు, స్థిరమైన అభివృద్ధి అనే లక్ష్యంతో ఈ విజన్ డాక్యుమెంట్ -2047 మార్గదర్శకంగా ఉండబోతోంది.

# మొదలైన పంచాయతీ ఎన్నికల సందడి..

డివిజన్లలోని 318 గ్రామ పంచాయతీలు, 2,870 వార్డులకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, తుంగతుర్తి రెవెన్యూ డివిజన్లలోని 159 గ్రామ పంచాయతీలు, 1,442 వార్డులకు నామినేషన్లు జరుగుతోంది. యాదాద్రి - భువనగిరి జిల్లాలో భువనగిరి రెవెన్యూ డివిజన్‌లోని 153 గ్రామ పంచాయతీలు, 1,286 వార్డులకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈరోజు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్స్ స్వీకరిస్తున్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో... తొలి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం మొదలైంది. ఆదిలాబాద్ జిల్లాలో 166, మంచిర్యాల జిల్లాలో 90, నిర్మల్ జిల్లాలో 136, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 114 సర్పంచ్, వార్డు స్థానాలకు తొలివిడత ఎన్నికలు జరుగుతోంది. అయితే, హైకోర్టు ఆదేశాల కారణంగా ములుగు, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లోని 32 పంచాయతీలకు ఎన్నికలు జరగవు. తొలి విడతకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలవ్వడంతో.. ఈ దశలో 189 మండలాల్లో 4,236 గ్రామ పంచాయతీలకు, 37,440 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలతో పాటు ఉపసర్పంచ్ ఎన్నిక కూడా అదే రోజు పూర్తి చేయాలని ఎస్ఈసీ కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. తొలి విడతకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. రోజూ ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. తొలి విడత నామినేషన్ల సమర్పణకు చివరి తేదీ నవంబర్ 29. ఆ తర్వాత నవంబర్ 30న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 3 వరకు అవకాశం ఉంది. డిసెంబర్ 11న పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. ఈ ఎన్నికల కోసం గ్రామాల్లో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాలను ప్రదర్శిస్తారు. బ్యాలెట్ పేపర్లతో ఓటింగ్ జరుగుతుంది. నోటా (నాన్ ఆఫ్ ది అబౌవ్) ఆప్షన్ కూడా ఉంటుంది.పోలింగ్ పూర్తయిన అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమై, పూర్తయిన వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. ఉప సర్పంచ్ ఎన్నిక కూడా అదే రోజు లేదా తదుపరి రోజు పూర్తి అవుతుంది. మొత్తం 31 జిల్లాల్లో 545 మండలాల్లో ఈ ఎన్నికలు జరుగుతాయి. ఓటర్ల సంఖ్య 1.66 కోట్లు, వీరిలో మహిళలు 85.12 లక్షలు, పురుషులు 81.42 లక్షలు ఉన్నారు. రిజర్వేషన్ల పట్ల వివాదాలు ఉన్నప్పటికీ, బీసీలకు 17.08 శాతం (2,176 పంచాయతీలు) కేటాయించారు. దీనిపై బీసీ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.ఈ ఎన్నికలు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు కీలకం. గత 20 నెలలుగా ప్రత్యేక అధికారులు పరిపాలన చేస్తున్నారు. ఇప్పుడు కొత్త నాయకులు ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఎస్ఈసీ ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ (9240021456) ఉంది. మొబైల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. ఈ ఎన్నికలతో గ్రామాల్లో మార్పు రావాలని ఆశిస్తున్నారు. మొత్తం ప్రక్రియ డిసెంబర్ 17తో ముగుస్తుంది. ఓటర్లు తమ హక్కును వాడుకోవాలని ఎస్ఈసీ పిలుపునిచ్చింది.

## క్యాపిటల్ గెయిన్స్ మరో 2 ఏళ్లు పొడిగించాలి

అమరావతి పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే తాను తీసుకునే నిర్ణయాలకు రైతుల నుంచి కూడా మద్దతు కావాలని సీఎం చంద్రబాబు కోరారు.రాజధానికి భూములు ఇచ్చిన రైతులుగా మీపై అభిమానం, కృతజ్ఞత ఉన్నాయని తెలిపారు. రాజధానికి వ్యతిరేకంగా కొందరు కావాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని రైతులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అసత్య పోస్టులను కట్టడి చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. అమరావతి ఉద్యమంలో భాగంగా అనేక జేఏసీలు వచ్చాయని, ఇప్పుడు రైతులంతా కలిసి అమరావతి డెవలప్?మెంట్ అసోసియేషన్ పేరుతో ఒక సంస్థ ఏర్పాటు చేసుకోవాలని సీఎం రాజధాని రైతులకు సూచించారు. అమరావతి రైతుల అభివృద్ధికి, భవిష్యత్తుకు తాను పూర్తి కమిట్?మెంట్?తో ఉన్నానని అన్నారు.మీకు న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం వెల్లడించారు. రైతులు కూడా తనకు పూర్తిగా సహకరించాలని కోరారు. రైతులు, జేఏసీ నేతలు సీఎం దృష్టికి పలు అంశాలను తీసుకువెళ్లారు. బిల్డింగ్?కి ఫ్లోర్ పర్సంటేజ్ ఎస్?ఎఫ్?ఐ పెంచాలని రైతులు కోరారు. విజయవాడ, గుంటూరు కంటే అమరావతిలో తక్కువ ఉందని రైతులు సీఎం దృష్టికి తెచ్చారు. కరకట్ట బలోపేతం చేయాలని రైతులు చెప్పగా అది ప్రభుత్వం బాధ్యత అని సీఎం స్పష్టం చేశారు. బ్యాంకు లోన్ల కోసం వెళ్తే 30 సంవత్సరాల డాక్యుమెంట్?లు అడుగుతున్నారని రైతులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. గత ఐదేళ్లలో రాజధాని రైతులు సుదీర్ఘ పోరాటం చేశారు. వారికి ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి" అని పురపాలక, సీఆర్డీఏ శాఖలను ఆదేశించారు. రైతుల ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకు త్వరలోనే వారితో సమావేశం కావాలని పురపాలక శాఖ మంత్రి నారాయణకు, ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వం కోసం త్యాగాలు చేసిన రైతులకు అదే స్థాయిలో సహకారం అందించడం మన బాధ్యత అని అన్నారు. ఇంకా ఏమైనా అపరిష్కృత అంశాలు మిగిలి ఉంటే, వాటిని కేబినెట్ సమావేశం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.అలాగే, అమరావతిలో నిలిచిపోయిన నిర్మాణాలను వేగంగా పూర్తిచేసేందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. నిర్మాణాల వేగం, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అంతిమంగా అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పి. నారాయణతో పాటు సీఆర్డీఏ, పురపాలక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో గెలుపోటములు సహజం

తెలిపారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజల సమక్షంలో బయట పెడుదామని పిలుపు నిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు జరిగాయి. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బానిసత్వం లేని ఒకే ఒక్క పార్టీ గులాబీ పార్టీ అని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 8 లక్షల ఎకరాలకు కేసీఆర్ సాగునీరు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. లక్ష్మీదేవిపల్లి 660 మీటర్ల ఎత్తు ఉంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం, పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులను కేసీఆర్ చేపట్టారని అన్నారు. గొలుసుకట్టు రిజర్వాయర్లను 90 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. ఒక పంపును కూడా కేసీఆర్ ప్రారంభించారని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టడం తప్ప రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. కరెంట్ కష్టాలతో ఎంతమంది చనిపోయారో మీకంతా తెలుసని కేటీఆర్ గుర్తుచేశారు. వైఎస్ హయాంలో ఉచిత కరెంట్ ఇచ్చినా.. ఆరు గంటలే ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో దొంగలు కొట్టే సమయంలో కరెంటు ఇచ్చేవారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు రాలేదని రేవంత్ రెడ్డే చెప్పాడని అన్నారు. కేసీఆర్ హయాంలో మిషన్ భగీరథ, సాగునీరు తెచ్చుకున్నామని తెలిపారు. రైతుకు పెట్టుబడి రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. మన పార్టీ నాయకుల అనైక్యతతోనే ఓడిపోయామని కేటీఆర్ అన్నారు. మనం చేసిన పనులు సరిగ్గా చెప్పుకోలేదని తెలిపారు. సోషల్‌మీడియాలో చెప్పిన అబద్దాలను ప్రజలు నమ్మారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93వేల కోట్ల ఖర్చు అయ్యిందని.. కానీ రాహుల్ గాంధీ వచ్చి రూ.లక్ష కోట్ల కుంభకోణం అంటే ప్రజలు నమ్మారని అన్నారు. ప్రజలు ఆరు గ్యారంటీల గారడిలో పడి మోసపోయారని తెలిపారు. కల్వకుర్తిలో ఆస్పత్రి లేదని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి మాట్లాడుతున్నాడని.. 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ బాధ్యుడా అని నిలదీశారు. 420 హామీలను కాంగ్రెస్ నాయకులు తుంగలో తొక్కారని కేటీఆర్ విమర్శించారు. ఇప్పుడు ఏం చేశావని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీస్తే ఫ్రీ బస్సు అంటున్నాడని తెలిపారు. మహిళలకు ఫ్రీ అంటూ పురుషులకు డబుల్ రేట్లు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టేసరికి కేసీఆర్ గుర్తుకొచ్చిండు అని కేటీఆర్ అన్నారు. ఏ ఊళ్లో అయినా పది మంది గుమిగూడితే.. తొందరగా కేసీఆర్‌ను తెచ్చుకోవాలని అనుకుంటున్నారని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వ్యాఖ్యానించారు.

## ప్రశాంతంగా పంచాయితీ ఎన్నికల నిర్వహణ

**పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం**

**- పోలీస్ అధికారులతో డిజిపి వీడియో కాన్ఫరెన్స్**

హైదరాబాద్,నవంబర్27( వెలుతురు):

రాష్ట్రంలో జరగబోయే పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిల పోలీస్ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ కమిషనరేట్ మినహా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు మొదలుకొని స్టేషన్ హౌస్ ఆఫీసర్ల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పంచాయతీ ఎన్నికలు సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికలను నిస్పాక్షికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని,ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి భద్రతల అదనపు డీజీపీ మహేష్ ఎం భగవత్, మల్టీ జోన్ 2 అడిషనల్ డీజీపీ డీఎస్ చౌహాన్, మల్టి జోన్- 1 ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఏఐజీ రమణ కుమార్, లీగల్ అడ్వయిజర్ ఇ రాములు, తదితరులు పాల్గొన్నారు.

జనరల్ వార్తలు
వెలుతురు

## 2010కి ముందు ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

- ఎమ్మెల్సీ మల్క కొమరయ్య



**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 27:**
2010కి ముందు నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన టెట్ అర్హత విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎమ్మెల్సీ శ్రీ మల్క కొమరయ్య కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ కు లేఖ రాసి విజ్ఞప్తి చేశారు... 2010కి ముందు నియమితులైన టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఉండగా, ఇటీవల సుప్రీం కోర్టు తీర్పుతో మినహాయింపు లేకుండా పోయిందని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఆందోళనను వ్యక్తంచేశారు. శ్రీ మల్క కొమరయ్య లేఖలో ప్రస్థావించిన మరికొన్ని కీలక అంశాలు 2009లో అమలులోకి వచ్చిన పిల్లల ఉచిత , నిర్బంధ విద్యా హక్కు చట్టం స్పష్టంగా 31-03-2010 తర్వాత నియమితులైన ఉపాధ్యాయులకు మాత్రమే టెట్ అర్హతను తప్పనిసరి చేసింది. 2010కి ముందు నియమితులైన వారికి ఈ నిబంధన వర్తించదని ఆ చట్టంలో ఉందని గుర్తు చేశారు.. అయినప్పటికీ, వివిధ కోర్టు తీర్పులు, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు కూడా టెట్ అర్హత పరీక్షను తప్పనిసరి చేయడంతో రాష్ట్రంలో ఉన్న వేలాది మంది అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నారు అని స్పష్టం చేశారు. . దశాబ్దాలుగా సేవలందిస్తున్న టీచర్స్ పై ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానాన్ని తిరోగమన చట్ట ప్రక్రియ (Retrospective Effect) ద్వారా అమలు చేయడం సహజ న్యాయ సిద్ధాంతాలకు (Principles of Natural Justice) పూర్తిగా విరుద్ధం అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. . ఉపాధ్యాయుల గౌరవం, సేవా భద్రత, మానసిక ఆరోగ్యం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారిని %బజు% బంధనం నుంచి పూర్తిగా మినహాయించాలని శ్రీ మల్క కొమరయ్య కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ని ఆ లేఖలో కోరారు.

## ఎస్సీ,ఎస్టీలకు మాదిరి దివ్యాంగులకు రక్షణ

- కఠిన చట్టాలు అవసరమన్న సుప్రీం ధర్మాసనం



**న్యూఢిల్లీ,నవంబర్ 27( వెలుతురు):**
దివ్యాంగులకు కూడా రక్షణ కవచం ఉండాలని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. వారినికించపరిచే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ఎస్సీ/ఎస్టీ చట్టం లాంటి కఠినమైన చట్టాలు అవసరమని సుప్రీం కోర్టుపేర్కొంది. ఈ దిశగా ఆలోచన చేయాలని కేంద్రానికి సూచించింది. యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాలకు సంబంధించి పిటిషన్ల విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. కండరాల క్షీణత సమస్యపై అవగాహన కల్పిస్తూ బాధితులతో కలిసి ఓ ప్రదర్శన నిర్వహించాలని ఈ సందర్భంగా సమయ్ రైనాకు సుప్రీం కోర్టు సూచించింది. ఓ ఆన్‌లైన్ షోలో వెన్నెముక కండరాల క్షీణతతో బాధపడుతున్న ఓ చిన్నారికి అవసరమైన ఔషధాల గురించి ప్రస్తావిస్తూ వారిని కించపరిచే విధంగా సమయ్ రైనా మాట్లాడాడు. ఈ షోలో పాల్గొన్న వారిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ అరుదైన వ్యాధిపై పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం.. ఆ షోలో పాల్గొన్న వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు సమయ్ రైనా క్షమాపణలు చెప్పాడు.రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాలకు సంబంధించిన పిటిషన్లను సుప్రీం కోర్టు నేడు విచారించింది. బాధితుల తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్.. కమెడియన్ వ్యాఖ్యలు చిన్నారులను కించపరిచేలా ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వారు ఎంతో ప్రతిభావంతులని, ఇలాంటి వ్యాఖ్యలు క్రౌడ్ ఫండింగ్‌కు ఇబ్బందిగా మారుతాయన్నారు. వీటితో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఏకీభవించింది. దివ్యాంగులపై ఎవరైనా కించపరిచే వ్యాఖ్యలు చేస్తే.. ఎస్సీ/ఎస్టీ చట్టం మాదిరిగా కఠిన చట్టాన్ని తీసుకువచ్చే విషయంపై ఎందుకు ఆలోచించరని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీం ధర్మాసనం అడిగింది. దివ్యాంగులకు రక్షణ కల్పించేందుకు కఠిన చట్టాలు తీసుకువచ్చే విషయంపై ఆలోచించాలని సూచించింది. వారికి కావాల్సింది గౌరవ, మర్యాదలని.. వారి విజయాలను చాటిచెప్పేందుకు మీ వేదికను (ఆన్‌లైన్ షో) ఉపయోగించాలని యూట్యూబర్‌లకు సూచించింది. ఈ షోలకు దివ్యాంగులను కూడా ఆహ్వానించి, వాటితో వచ్చే నిధులను బాధితుల చికిత్సకు అందజేయాలని ఆదేశించింది.

## కవితను ఎందుకు పంపించారో చెప్పండి

- కెటిఆర్ తీరుపై మండిపడ్డ కడియం

**జనగామ,నవంబర్27( వెలుతురు):**
కేటీఆర్ వ్యవహార శైలి నచ్చకపోవడంతోనే సొంత చెల్లెలు కవిత పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. పార్టీలో అంతర్గత కలహాలతోనే ఆమెను కావాలనే బయటకు పంపారని అన్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదన్నారు. నీతులు వల్లించే నేతలు ఈ విషయంలో సమాధానం చెప్పాలన్నారు. కేసీఆర్ తర్వాత భారత రాష్ట్ర సమితి పార్టీ ముక్కలు చెక్కలవుతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో కడియం మాట్లాడారు. హరీశ్‌రావు సైతం పార్టీ నుంచి బయటకు వెళ్లే సమయం కోసం ఎదురుచూస్తున్నట్లు వివరించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్రంపై ఒత్తిడి తేకుండా.. కేసులు కేటీఆర్ భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ఉన్న మేరకు ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేస్తుంటే కెటిఆర్ తదితరులు కావాలనే యాగీ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## 'రాజ్యాంగ దినోత్సవం' సందర్భంగా హైదరాబాద్‌లో సీబీసీ నిర్వహించిన ప్రదర్శనను సందర్శించిన భారత అదనపు సొలిసిటర్ జనరల్ బి. నరసింహ శర్మ








**హైదరాబాద్ వెలుతురు 27 నవంబర్ 2025:**
రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా హైదరాబాద్‌లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీలు గురువారం నిర్వహించిన 'ఫోటో ఎగ్జిబిషన్'ను తెలంగాణ హైకోర్టు- భారత అదనపు సొలిసిటర్ జనరల్ శ్రీ బి. నరసింహ శర్మ సందర్శించారు. సీబీసీ, పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి పాటిల్‌తో కలిసి రాజ్యాంగ దినోత్సవం, వందేమాతరం150 సమాచార ప్యానెళ్లను శ్రీ నరసింహ శర్మ ఆసక్తిగా తిలకించారు. అనంతరం కేశవ్ మెమోరియల్ న్యాయ కళాశాల (కేఎంఎల్) విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, భారత ప్రాచీన రాజధర్మ సూత్రాలే పునాదిగా ఉన్న మన రాజ్యాంగం అత్యున్నత ధర్మమని వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని ప్రవేశికను అర్థం చేసుకోవాలని, జాతీయ సమగ్రతను కాపాడాలని, రాజ్యాంగ నిర్మాతలు అందించిన ఫలాలను గుర్తుంచుకోవాలని ఆయన విద్యార్థులను కోరారు. విధులతో పాటే హక్కులు లభిస్తాయని గుర్తు చేస్తూ... రాజ్యాంగ విలువలను సామాన్య ప్రజలకు చేరవేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యార్థులతో మాటామంతీలో భాగంగా చట్టం, రాజ్యాంగ సంబంధిత అంశాలపై విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు అదనపు సొలిసిటర్ జనరల్ సమాధానమిచ్చారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శన బుధవారం ప్రారంభమవగా... ఈ నెల 30 వరకు అందుబాటులో ఉంటుంది.

# అబద్దాలకు అంబాసిడర్ కెటిఆర్

- అబద్దపు ప్రచారాలతో ప్రజలు ఏమార్చే రకం
- బిసి రిజర్వేషన్లపై చేస్తున్న వ్యాఖ్యలు సత్యదూరం
- కెటిఆర్ వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టిన మంత్రి సీతక్క



**హైదరాబాద్,నవంబర్ 27( వెలుతురు):**
స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 17 శాతానికి తగ్గించిందన్న బిఆర్ఎస్ నేత కేటీఆర్ వ్యాఖ్యలను మంత్రి సీతక్క తిప్పికొట్టారు. అబద్ధపు ప్రచారాలతో ప్రజలను ఏమార్చలేరని గట్టిగా జవాబు ఇచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అబద్దాలకు అంబాసిడర్‌గా మారి కేటీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని బీసీలు విశ్వసించరని తెలిపారు. కేటీఆర్ ప్రచారం చేస్తున్నట్లుగా బీసీల రిజర్వేషన్లు ఎక్కడా తగ్గలేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించి గొంతు కోసిందే బీఆర్ఎస్ అని ఆరోపించారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని.. కానీ 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించి తద్వారా బీసీల గొంతు కోసింది బీఆర్ఎస్ అంటూ విరుచుకుపడ్డారు. ఇప్పుడు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. గత స్థానిక ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు చేశారని.. కానీ ఆ విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందన్నారు. సర్పంచుల రిజర్వేషన్ల ఖరారుకు రాష్ట్రం యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. అందుకోసం ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కూడా చెప్పిందని సుప్రీం తీర్పును మంత్రి గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి, దాని సిఫార్సు మేరకు మండలం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్ల నిర్ణయం జరిగిందన్నారు. ఆయా మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభాను బట్టి సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయని తెలిపారు. అందుకే కొన్ని మండలాల్లో రిజర్వేషన్లు పెరిగినట్లుగా, మరికొన్ని మండలాల్లో తగ్గినట్లుగా పైకి కనిపిస్తున్నా, స్టేట్ యూనిట్‌గా చూస్తే ఎక్కడా రిజర్వేషన్లు తగ్గలేదని వెల్లడించారు. ఏ మండలంలో కూడా రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండరాదని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. రిజర్వేషన్ల ఖరారులో సుప్రీంకోర్టు తీర్పులను అమలు చేశామని వివరించారు. సుప్రీం తీర్పును అపహాస్యం చేసినట్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కుల గణన చేపట్టి పక్కాగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని తెలిపారు. కుల గణనలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం, బీసీ రిజర్వేషన్లపై సన్నాయి నొక్కులు నొక్కుతోందని వ్యాఖ్యలు చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామని... అందుకోసం అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. అసెంబ్లీలో తీర్మానం చేశామని.. జంతర్ మంతర్‌లో స్వయంగా సీఎం నేతృత్వంలో ధర్నా చేపట్టామని మంత్రి అన్నారు. బీసీ రిజర్వేషన్లపై పెంపు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా, కాంగ్రెస్‌ను విమర్శిస్తూ బీజేపీ బీ టీంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ అమలు చేస్తోందన్నారు. బీసీలకు 42 శాతం సీట్లు బీఆర్ఎస్ ఇస్తుందా లేదా చెప్పాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

## బిఆర్ఎస్, బిజెపిలు బిసి ద్రోహులు

- మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,నవంబర్27( వెలుతురు):**
బీసీ రిజర్వేషన్ అంశంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీసీల కోసం పోరాడేది తాము మాత్రమేనని, ఇతర పార్టీలు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం మొసలి కన్నీళ్లు కారుస్తున్నాయని తీవ్ర విమర్శలు చేశారు.. బీఆర్ఎస్, బీజేపీ, బలహీనవర్గాల ద్రోహులు అని మండిపడ్డారు.. గతంలో ఇతర రాష్ట్రాల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ, ఈ పరిమితిని అధిగమించేందుకు ప్రభుత్వం సేకరించిన డాటా, నివేదికల ఆధారంగా కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపిస్తున్నామని తెలిపారు. అసలు బిసి కోటాపై కోర్టులో ఇంప్లీడ్ ఎందుకు కాలేదు? అని పొన్నం ప్రశ్నించారు.. సిగ్గులేకుండా బయట విమర్శలు చేసే బీఆర్ఎస్ నాయకులు కోర్టులో మాత్రం లేరు అని మంత్రి ఆరోపించారు. కోర్టులో రిజర్వేషన్ నిలిపేస్తే బీఆర్ఎస్ నేతలు నవ్వుకుంటున్నారని విమర్శించారు. అటు.. బీసీ రిజర్వేషన్ల అమలులో అడ్డంకులు తొలగించేందుకు కేంద్రం సహకరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉన్న నిధులు ఇప్పించేందుకు బీజేపీ నేతలు ప్రయత్నం చేయడం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు 42? రిజర్వేషన్లతోనే జరపాలన్న ఆలోచన ఉందని తెలిపారు పొన్నం.. ఇక బీసీ సర్వేలో పాల్గొనని పార్టీలకు మాట్లాడే నైతిక హక్కు లేదని పొన్నం తీవ్రంగా హెచ్చరించారు. కేంద్రంలో మా ప్రభుత్వం ఉంటే గంటల్లో బీసీ రిజర్వేషన్ అమలు అయ్యేదన్న ఆయన.. మేము కోర్టులో చేస్తున్న పని మీకూ తెలుసు. తెలిసీ మాపై ఆరోపణలు చేయొద్దు. సలహాలు ఇవ్వండి.. తీసుకుంటాం.. కానీ, రాజకీయ పార్టీల ఒత్తిడికి లోనవ్వొద్దు అని సచించారు.. బీజేపీ?బీఆర్ఎస్ బీసీ ద్రోహులు అని మండిపడ్డారు పొన్నం.. బలహీన వర్గాల పట్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అన్యాయం చేశాయని తీవ్రంగా మండిపడ్డారు. రాజ్యాంగం ఏం చెబుతుందో తెలియకపోతే తెలుసుకోవాలి. గిరిజన ప్రాంతాల్లో వారికి హక్కుగా రిజర్వేషన్ ఇవ్వాలి.. బీసీ సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదం అని వ్యాఖ్యానించారు.

## నల్లచెరువులో ఆక్రమణలను మేం తొలగించలేదు

- తొలగింపులపై క్లారిటీ ఇచ్చిన హైడ్రా

**హైదరాబాద్,నవంబర్27( వెలుతురు):**
కూకట్‌పల్లి నల్లచెరువు వద్ద బుధవారం తాము ఎలాంటి ఆక్రమణలను తొలగించలేదని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హైడ్రా) స్పష్టం చేసింది. చెరువు భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, పేదల గుడిసెలంటూ తప్పుడు ప్రచారం చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించింది. హైడ్రా అధికారుల కథనం ప్రకారం... చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలోకి వచ్చే సర్వే నంబర్ 176లో చెత్త సేకరించేవారు, స్క్రాప్ వ్యాపారులు తాత్కాలిక షెడ్లు వేసుకున్నారు. చెరువు ప్రాంతాన్ని ఖాళీ చేయాలని వారిని కోరగా, రెండు మూడు రోజుల క్రితమే వారు స్వచ్ఛందంగా తమ షెడ్లను తొలగించుకుని వెళ్లిపోయారు. అయితే, ఈ స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్న కొందరు కబ్జాదారులు.. సర్వే నంబర్ 180 పేరుతో ఇప్పుడు కొత్త వివాదాన్ని తెరపైకి తెచ్చారు. గతంలో ఇక్కడ ఉన్నవారి నుంచి అద్దెలు వసూలు చేసిన వారే, ఇప్పుడు వారిని అడ్డం పెట్టుకుని భూమిని కొట్టేయాలని చూస్తున్నారని హైడ్రా ఆరోపించింది. ఈ వ్యవహారంపై కొందరు హైకోర్టును కూడా ఆశ్రయించి, సర్వే నంబర్ 180 కింద తమకు నష్టపరిహారం కావాలని కోరారు. అయితే, తాము ఖాళీ చేయిస్తున్నది సర్వే నంబర్ 176 అని, చెరువులో చెత్త వేయడం వల్ల నీరు కలుషితమవుతోందని హైడ్రా కోర్టుకు వివరించింది. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. సర్వే నంబర్లను సరిచూసి, నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలని సూచించినట్లు అధికారులు తెలిపారు. అసలైన నివాసితులు వెళ్లిపోయిన తర్వాత, కబ్జాదారులు చేస్తున్న చివరి ప్రయత్నమే ఈ గందరగోళమని హైడ్రా స్పష్టం చేసింది.

## గ్లోబల్ సమ్మిట్‌పై సిఎం రేవంత్ సమీక్ష

- పాలసీ డాక్యుమెంట్‌పై భేటీలో చర్చ



**హైదరాబాద్,నవంబర్27( వెలుతురు):**
తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025పై రోజూ వరుస సమీక్షలు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి గురువారం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రోజుకో అంశంపై చర్చిస్తున్నారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌పై ఈ భేటీలో చర్చించారు. పాలసీ డాక్యుమెంట్‌పై సీఎం రేవంత్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా.. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్ ఉండాలని సూచించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేలా స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీలో ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ పాలసీ, భవిష్యత్ ప్రణాళికలు వివరించేలా పాలసీ డాక్యుమెంట్ ఉండాలని అధికారులకు సూచించారు. కాగా డిసెంబర్ 8,9 తేదీల్లో ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించనున్నట్లు సీఎం రేవంత్ ఇప్పటికే వెల్లడించారు. కేంద్ర మంత్రులతో పాటు సమ్మిట్‌కు ఆహ్వానించాల్సిన దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖుల జాబితా ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు.

# సంపాదకీయం.. రైతులను దెబ్బతీస్తున్న తుఫాన్లు !

మరో తుఫాన్ ద్విత్వాహ్ దూసుకుని వస్తోంది. అంది ఎంతటి బీభత్సం సృష్టిస్తుందో అన్న బెంగపట్టుకుంది. తుఫాన్లు వచ్చినప్పుడల్లా రైతన్నలు వణుకుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏ ఒక్క రైతుకు సక్రమంగా నష్టపరిహారం అందడం లేదు. అందుకే తుఫాన్లు వస్తున్నాయంటే రైతులకు కన్నీరు రావడంతో పాటు, కంటిమీద కునుకు లేకుండా పోతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఊకదంపుడు ఉపన్యాసాలతో రైతులను ముంచేస్తున్నారు. అటు కేంద్రం ఆలస్యంగా సర్వే బృదాలను పంపడం, వారు లెక్కలు వేసి పంపే అరకొర సాయం ఎప్పుడో రైతుల ఖాతాల్లోకి పడుతుందో తెలియని దుస్థితి ఉంది. అందుకే ఇప్పుడు పంటలను త్వరగా అమ్ముకునే దుస్థితిలో ఉన్నారు. తుఫాన్ రానుందన్న హెచ్చరికలతో ధాన్యం నూర్పి అమ్మకాలు సాగిస్తున్నారు.తీరప్రాంతం ప్రకృతి విపత్తులకు శాశ్వత కేంద్రంగా మారింది. రైతులు, వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులతో పాటు వివిధ వృత్తులపై ఆధారపడే లక్షలాది మంది ప్రతి ఏటా ఏదో రకంగా నష్టపోతూనే ఉన్నారు. భౌగోళిక పరిస్థితుల కారణంగా సహజ విపత్తుల కడలిలో మనుగడ సాగించక తప్పని స్థితి దాపురించింది. ప్రతి ఏడాది రాష్ట్రంపై తుపాన్లు విరుచుకుపడుతున్నాయి. ఈ ఏడాది విరుచుకుపడిన మొంథా తుపాను కూడా తీరని నష్టాన్నే మిగిల్చింది. ఇప్పటికీ అనేకమందికి సరైన పరిహారం అందడం లేదు. ప్రభుత్వాలు ప్రకటించే సాయం అరకొరగా ఉంటున్నాయి. ఇటీవల నష్ట తీవ్రతను అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందానికి రైతులు ఇదే విషయాన్ని వివరించారు. తుపాన్ల కారణంగా రాష్ట్రం తరచూ ప్రభావితమౌతోందని, ముందస్తు హెచ్చరికలు



చేస్తున్నా, నష్టాన్ని నివారించలేకపోతున్నామంటూ కేంద్ర బృందానికి సిఎం చంద్రబాబు కూడా చెప్పారు. పెరిగిన సాంకేతికత కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించినప్పటికీ, పంట నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని అదుపు చేయడం సాధ్యం కావడం లేదు. పైగా వాతావరణ మార్పుల కారణంగా విపత్తుల తీరు కూడా మారింది. ఊహించని చోట, ఊహించని విధంగా గంటల తరబడి కుండపోతగా వర్షం కురవడం, వాగులు, వంకలు పొంగి అనూహ్య వరదలు చోటు చేసుకోవడం, విపరీతమైన వేగంతో గాలి వీచడం వంటి వైపరీత్యాలు సాధారణంగా మారుతున్నాయి. దీంతో నష్టం భారీగా పెరుగుతోంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. నిజానికి మొంథా తుపాన్ ప్రభావం చాలా తీవ్రంగా ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలోని 443 మండలాల్లోని 3,109 గ్రామాలు తుపాను బారినపడ్డాయి. దాదాపు 10 లక్షల మంది ప్రజలు తుపాను కారణంగా తీవ్రంగా ప్రభావితమయ్యారు. 1.11 లక్షల మంది నిరాశ్రయులైనారు. 1.61 లక్షల హెక్టార్లలో పంటలు నీట మునిగి, 3.27 లక్షల మంది రైతులు నష్టపోయారు. ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టమూ ఉంది. అయితే, ప్రభుత్వం రూపొందించిన ఈ లెక్కల మీద కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో 6,384 కోట్ల రూపాయల నష్టం సంభవించినట్లు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు రూపొందించిన నివేదికలో వ్యవసాయం, మత్స్యకార, చేనేత, పశుసంవర్ధక రంగాలతో పాటు విద్యుత్, రహదారులు, ఇళ్లు, విద్యా సంస్థలు తీవ్రంగా దెబ్బ తిన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. తక్షణ సాయంగా 2,622 కోట్ల రూపాయలు విడుదల చేయాలని, తీరప్రాంతంలో సముద్ర కోత నివారణ పనుల కోసం ఉప్పాడకు రూ.323 కోట్లు, విశాఖ సమీప ప్రాంతాలకు రూ.203 కోట్లు, శ్రీకాకుళం ప్రాంతానికి రూ.98 కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది. పంటల బీమా లేకపోవడంతో నష్టాన్ని ఉద్దేశపూర్వకంగానే తగ్గించి చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్యూమరేషన్ సమయంలో తమను విస్మరిస్తున్నారంటూ కౌలు రైతులు అనేకచోట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటే నష్ట తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉంది. గతంతో పోలిస్తే నష్టం అంచనా కోసం కేంద్ర బృంద త్వరగా పర్యటించి, అంచనాలు వేసినా అవి డబ్బురూపంలోకి వచ్చేది ఎప్పుడో చెప్పలేం. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగానే స్పందించిది. అయితే, ఇదొక్కటే చాలదు. కేంద్ర బృందం పర్యటించినంత మాత్రాన నిధులు ఇచ్చినట్లు కాదు. కష్టకాలంలో రాష్ట్రాన్ని ఆదుకోవాలన్న చిత్తశుద్ధి కేంద్రానికి ఉండాలి. విపత్తుల సమయంలో నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించే వ్యవస్థ రావాలి. అత్యవసర సాయం కింద ఎంతో, కొంత నిధులు వెంటనే ఇచ్చేలా ఏర్పాటు చేయాలి. ఈ నేపథ్యంలో విపత్తు అంచనాలు లెక్కకట్టేందుకు వచ్చే కేంద్ర బృందం పర్యటన తరువాతైనా కేంద్రం ఉదారంగా స్పందించాలి. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన తక్షణ సాయాన్ని వెంటనే విడుదల చేయడంతో పాటు, పూర్తిస్థాయి పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా విడుదల చేయగలగాలి. హుద్‌హుద్ తుపాన్ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యాన్ని రాష్ట్ర ప్రజలు మరచిపోలేదు. అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చూసుకోవాలి. అదే సమయంలో రైతులు, కౌలురైతులతో పాటు నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే! ఆ మేరకు అవసరమైతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సిద్ధపడాలి. అలాగే ఇందుకోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకుని రావాలి. ప్రత్యేక నిధి ఉంటే తుపాన్ల సమయంలో నష్టపోయిన రైతులకు, ప్రజలను తోణం అదుకునే వీలుంటుంది.

# బీసీల జనాభా 56% హక్కులు 6% కూడా లేవు
# 78సం: గా జాతీయ, ప్రాంతీయ పార్టీలు, మాయాజాలం?



మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్ సత్తా పార్టీ
మాజీ అధ్యక్షులు .
9550844433

భారత రాజకీయ వ్యవస్థలో అతి పెద్ద వర్గం ఎవరు? అనడిగితే క్షణం ఆలస్యం లేకుండా చెప్పాల్సిన సమాధానం – బీసీలు. జనాభాలో 56 శాతం ఉన్నప్పటికీ హక్కుల్లో ఆరు శాతం కూడా రానివ్వని రాజకీయ జాలంలో బీసీలు చిక్కుకున్నది ఏ రోజునో ఎవరికి గుర్తు లేదు. స్వాతంత్రం వచ్చిన 1947 నుంచీ 2025 వరకూ 78 సంవత్సరాలుగా దేశం ఎన్నో మార్పులు చూసింది, ఎన్నో ప్రభుత్వాలు మారాయి, లక్షల కోట్ల రూపాయల బడ్జెట్లు ప్రవహించాయి, శాసనాలు వచ్చాయి, రాజ్యాంగ సవరణలు జరిగాయి, కానీ బీసీ వర్గం మాత్రమే అన్యాయం అనే శబ్దానికి ప్రతీకగా మారిపోయింది. జనాభా పరంగా అతి పెద్ద వర్గమై ఉండటం రాజకీయ పార్టీలకు ఒక వరమైతే, వారి హక్కులు ఇవ్వకపోవడం అదే పార్టీలకు ఒక విధానంగా మారిపోయింది. బీసీల పరిస్థితి గంగలో ఆచమనం చేసినట్టు, గొప్ప మాటలతో ఆశలు చూపిస్తూ, కానీ అసలు హక్కుల వద్దకు రానీయకుండా, ఓట్లను మాత్రం కట్టిపడేసేలా చేస్తున్న అత్యంత వ్యవస్థీకృత రాజకీయ మాయాజాలానికి నిదర్శనం.

దేశంలో ప్రతి ఐదుగురిలో ముగ్గురు బీసీలు. వారు వ్యవసాయంలో పనిచేస్తారు, శిల్పకళల్లో పనిచేస్తారు, వృత్తుల్లో పనిచేస్తారు, పట్టణాల కార్మిక శక్తిలో పనిచేస్తారు. దేశంలోని ఉత్పత్తి వ్యవస్థలో వీరే వెన్నెముక. అయినా దేశ పాలనలో వీరి స్థానమేంటి? శూన్యం. ఈ శూన్యం సాదాసీదా సంఖ్య కాదు, ఇది రాజకీయ మరియు సామాజికంగా సద్దుమణిగించిన వర్గం యొక్క చరిత్ర. ఎవరైనా బీసీ నాయకుడు ఎదిగితే అది అతని వ్యక్తిగత పోరాటం, భగవద్గీతలో చెప్పిన స్వధర్మ యుద్ధం వంటిదే తప్ప, వర్గం మొత్తం ఎదిగిన కథ కాదు. ఎందుకంటే రాజకీయం ఈ వర్గాన్ని ఎప్పుడూ వ్యక్తుల వరకు పరిమితం చేసింది, వర్గం వరకు ఎప్పుడూ వెళ్లనీయలేదు. కారణం ఒకటే 56 శాతం వర్గం ఒక్కటైతే దేశ రాజకీయ సమీకరణం మొత్తం తలకిందులవుతుంది.

జనగణన విషయంలోనే బీసీలపై ఎంత ఘోరమైన మోసం జరిగిందో భారత చరిత్రలో పెద్ద అధ్యాయమే. 1931లో చివరిసారిగా కులగణన జరిగి, 1941లో యుద్ధ కారణంగా జరగక, ఆ తర్వాత స్వతంత్ర భారత్ ఒక శతాబ్దం జరిగిన దాకా కులగణన చేయించకుండా అడ్డుపడింది. ఎవరు అడ్డుపడ్డారు? రాజ్యాంగాన్ని కాపాడతామనే మాటలు చెప్పే జాతీయ పార్టీలు, వర్గ అభివృద్ధే తమ సిద్ధాంతమని చెప్పే ప్రాంతీయ పార్టీలు. ఎందుకు అడ్డుపడ్డారు? ఎందుకంటే నిజమైన సంఖ్య బయట పడితే, అంటే బీసీలు నిజంగా 56 శాతమని అధికారిక గణాంకం వెలువడితే వెంటనే రాజకీయ సమానత్వం కోరి ఒక మహా ఉద్యమం వస్తుంది, ఇది పార్టీలు భరించలేవు. అందుకే బీసీల అసలు బలం గుప్తంగానే ఉంచారు. పార్లమెంట్‌లో బీసీల ప్రాతినిధ్యం ఇప్పటికీ 6–7 శాతం చుట్టూ తిరుగడం ఈ దేశ ప్రజాస్వామ్యానికి ఎంత పెద్ద అపహాస్యమో చెప్పడానికి మాటలు చాలవు. స్వభావంలో బీసీలను అన్ని పార్టీలూ వోటు బ్యాంక్‌గా చూసినప్పటికీ, అధికార పథానికి మాత్రం వీరిని దగ్గరకు రానీయలేదు. ప్రధానమంత్రి పదవి, ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి, హోం మంత్రి, విదేశాంగ మంత్రి, రక్షణ మంత్రి వంటి కీలక పదవుల్లో బీసీలు అరుదైన అతిథులు. ఇది యదృచ్ఛికం కాదు,ఇది నిర్మిత వ్యవస్థ. SC/ST లకు రాజకీయ రిజర్వేషన్లు ఇచ్చారు, ఎందుకంటే వారిని ప్రాతినిధ్యం కల్పించకపోతే రాజ్యాంగమే ప్రశ్నార్థకమవుతుంది. కానీ బీసీలకు మాత్రం రాజకీయ రిజర్వేషన్ గురించి ఎప్పుడూ మాట్లాడలేదు. ఎందుకు? ఎందుకంటే బీసీలకు రాజకీయ రిజర్వేషన్ ఇచ్చిన రోజు దేశ రాజకీయ భూకంపం తప్పదని ప్రతి పార్టీకి తెలుసు. 56 శాతం వర్గానికి సీట్లలో 50 శాతం కూడా వస్తే ఇక పార్టీలు, నాయకులు, పొలిటికల్ ఇంజినీరింగ్ అన్నీ మారిపోతాయి.

జాతీయ పార్టీలు తమ తమ విధానాలతో బీసీలను మాయచేశాయి. కాంగ్రెస్ స్వాతంత్రం నుంచి 1990 వరకు బీసీ అంశాన్ని పక్కన పెట్టింది. మండల్ కమిషన్‌ను ఏర్పాటు చేసి కూడా దాని సిఫార్సులను అమలు చేయలేక సిగ్గు పడిపోయారు. అది అమలు అయినది కూడా కాంగ్రెస్ వల్ల కాదు, రాజకీయ ఒత్తిడితో, ఓటు సమీకరణాలతో. బీజేపీ 2014 తర్వాత బీసీలను పెద్ద వర్గంగా సంకలనం చేసుకున్నా, బీసీలకు రాజ్యాంగ హక్కులు ఇవ్వడంలో, రాజకీయ రిజర్వేషన్ విషయంలో, కులగణన విషయంలో అడుగులు వేయలేదు. బీసీలు పార్టీకి ముఖ్యమైన వర్గం, కానీ నిర్ణయ ప్రక్రియలో ప్రభావం చూపే వర్గం కావడం మాత్రం అనుమతించలేదు. ఇది మరో రూపంలోని మాయాజాలం. ప్రాంతీయ పార్టీల ఆట అయితే మరింత సుతిమెత్తగా, మరింత చురుకుగా సాగింది. ప్రతి రాష్ట్రంలో బీసీ అనే నినాదం పెద్దగా వినిపిస్తుంది. టిక్కెట్లు ఇస్తామని, కుర్చీలు ఇస్తామని, కమిషన్లు వేస్తామని పెద్ద ప్రచారం. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలు సాధారణంగా మూడో, నాలుగో వరుసలో ఉంటారు. ముఖ్యమంత్రి పదవి బీసీకి దక్కడం భారతదేశంలో ఓ అరుదైన సూర్యగ్రహణంలా మారిపోయింది. రాష్ట్రాల్లో కేబినెట్ శాఖల్లో ముఖ్య పదవులు సాధారణంగా ప్రాధాన్యత గల వర్గాలకు మాత్రమే. బీసీలకు లభించేది తక్కువ ప్రాధాన్యత గల శాఖలు, అదీ రాజకీయ అవసరాల కోసం మాత్రమే. ఒకసారి ఎన్నికల వరకు కావలసినట్లుగా బీసీలను పెద్ద ఎత్తున వాడుకుంటారుబీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీసీల సమస్యలు, వారి అభివృద్ధి, వారి విద్య, వారి ఉద్యోగాలు అన్నీ పార్టీలు మరచిపోతాయి.

ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది? ఎందుకంటే బీసీలను చీల్చి, చిన్న చిన్న కులాలుగా విభజించి, ఒకరినొకరు పోటీ పడేలా చేసేశారు. ఒక పెద్ద వర్గం ఒక్కటైతే రాజకీయంగా ప్రమాదకరం కాబట్టి, సుమారు 300




పైగా ఉన్న బీసీ కులాలను పార్టీలు తమ తమ ప్రయోజనాల కోసం వేరు వేరు దిశల్లో తోసుకుంటూ, ఒక పెద్ద సమూహం జన్మనేనె నిరోధించాయి. బీసీ వర్గం తమ హక్కుల కోసం గళమెత్తే అవకాశం రాకుండా చేసే చతురమైన రాజకీయం ఇది. ఒక కులానికి టికెట్, మరో కులానికి బోర్డు చైర్మన్ షిప్, ఇంకో కులానికి కార్పొరేషన్, మిగతా కులాలను ఆశలో ఉంచుతూ వేటు వేశారు. ఆర్థికంగా కూడా బీసీల బలం ఆధునిక భారతదేశంలో తగ్గించబడింది. వృత్తులు క్రమంగా నశించాయి, గ్రామీణ వృత్తుల ఆధారిత సంపద లయబద్ధంగా కోల్పోయింది, పట్టణాల్లో అవకాశాలు ఉన్నప్పటికీ కార్పొరేట్ మోడల్‌లో బీసీలకు తగిన ప్రాధాన్యం రాలేదు. UPSC, గ్రూప్ పరీక్షల్లో బీసీల శాతం ఇప్పటికీ దేశ జనాభాకు పోలిస్తే చాలా తక్కువ. ఉన్నత విద్యలో బీసీల శాతం 15 – 18 శాతం మధ్యే ఉండటం, ప్రత్యేకించి టెక్నికల్ కోర్సుల్లో శాతం మరింత తగ్గిపోవడం వర్గాన్ని అభివృద్ధికి దూరంగా నెట్టేసింది. టాలెంట్ ఉన్నా అవకాశాలు లేకుండా వ్యవస్థ బీసీల ఎదుగుదలను అడ్డుకుంది, కానీ ఓట్లు మాత్రం వారి చేతిలో ఉండటం పార్టీలకు అత్యంత లాభదాయకమైన వ్యూహం. ఇదంతా 78 ఏళ్లుగా ఎందుకు మారలేదు? ఎందుకంటే బీసీలను ఒక్కటిగా నిలబెట్టే ఉద్యమాన్ని రాజకీయ పార్టీలు ఎప్పుడూ భరించలేకపోయాయి. బీసీ అని ఒక గొప్ప నినాదం ఉన్నా, అది సాధారణంగా ఎన్నికల కాలంలో మాత్రమే వినిపిస్తుంది. ఉద్యమం మొదలయ్యే దశలోనే దాన్ని పార్టీల్లో లాగేసి, నాయకులకు పదవులు ఇచ్చి, ఉద్యమాన్ని మౌనంగా మార్చే రాజకీయ కళలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామి. బీసీ హక్కుల కోసం నిజమైన పోరాటం ప్రారంభమైన ప్రతీసారీ ఆ ఉద్యమానికి ఒక పార్టీలో చోటు దొరికింది కానీ వర్గానికి మాత్రం ఫలితాలు రాలేదు. బీసీ కార్పొరేషన్‌లు పెట్టి, చిన్న రుణాలు ఇచ్చి, కొన్ని స్కాలర్‌షిప్‌లు ఇచ్చి, సామాజిక న్యాయం జరిగిపోయిందని పార్టీలు ప్రచారం చేస్తాయి. కానీ వాస్తవం మాత్రం మరియొకటి – బీసీలను యథాతథ ఆర్థిక స్థితిలో ఉంచడం, వర్గం బలపడకుండా చూడడం. బీసీ వర్గాల ప్రశ్న ఏమిటంటే – ఈ 56 శాతం వర్గం ఎందుకు ఇంకా మనుగడ కోసం, హక్కుల కోసం పోరాడాల్సి వస్తోంది? సమాధానం సులభం,ఏ వర్గం ఉన్నత పాఠాలు చదవాలి, ఉన్నత ఉద్యోగాల్లోకి వెళ్లాలి, ఆర్థికంగా స్వయం సమృద్ధిగా మారాలి అనేది అభివృద్ధి యొక్క సహజ మార్గం. కానీ బీసీల విషయంలో ఈ సహజ మార్గం 50 సంవత్సరాల పాటు నెమ్మదించబడింది. ఈ వర్గం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందితే ఎన్నికల గణితం పూర్తిగా మారిపోతుంది. బీసీలు పూర్తి స్వతంత్రంగా ఆలోచించడం, పార్టీలు వారి ఓట్లపై ఆధారపడకుండా ఉండడం, బీసీల నుంచి బలమైన జాతీయ నాయకత్వం ఉద్భవించడం – ఇవన్నీ రాజకీయ పార్టీలు కనీసం కోరుకోవు.

అయినా, బీసీలలో ఒక అవగాహన పెరుగుతోంది. దేశమంతా కులగణన ఉద్యమం ఎందుకు జోరుగా నడుస్తోంది? ఎందుకంటే 56 శాతం వర్గం ఇప్పటివరకు ఎక్కడ నెట్టివేయబడిందో ఒక క్షణం గుర్తించుకుంది. భవిష్యత్తు బీసీల చేతుల్లోనే ఉంది. వారు ఒక్కటైతే దేశ రాజకీయ భవిష్యత్తు రూపం మారిపోతుంది. చెక్కుచెదరని సంఖ్య, చెరిగిపోని శక్తి, అణచివేయలేని సామర్థ్యం బీసీలలో ఉంది. ఇకపైనా బీసీలకు నినాదాల కంటే హక్కులు కావాలి. మాటల కంటే అవకాశాలు కావాలి. కార్పొరేషన్ రుణాల కంటే రాజ్యాంగ హక్కులు కావాలి. బీసీలు ఈ దేశానికి వెన్నెముక అయితే, దేశ పాలనలో కూడా వెన్నెముకలా ఉండాలి. 56 శాతం వర్గానికి 6 శాతం హక్కులు సరిపోవు,సమానత్వానికి, ప్రజాస్వామ్యానికి, న్యాయానికి ఇది అవమానం. ఈ అన్యాయాన్ని సరిదిద్దబోయే శక్తి పార్టీలలో లేదు, ఆ శక్తి బీసీలలోనే ఉంది. వారు తమ శక్తిని గుర్తించాలి, తమ హక్కులను స్వయంగా డిమాండ్ చేయాలి, తమను మాయచేసే రాజకీయ భాష్యాలను చీల్చిపారేయాలి. 78 ఏళ్ల మాయాజాలానికి ముగింపు పలకాలంటే బీసీల చేతుల్లో ఉన్న ఓటు శక్తి చైతన్యవంతమవాలి. "మాకు హక్కులు ఇవ్వాలి" అన్న స్వరం ఒక రాష్ట్రంలో కాదు, దేశమంతటా ఒకటిగా వినిపించాలి. అప్పుడే బీసీల 56 శాతం సంఖ్య కేవలం ఓటు సంఖ్య కాదు, రాజకీయ, సామాజిక ఆర్థిక, సమానత్వానికి బలమైన ఆజ్ఞగా మారుతుంది. ఇక దేశం బీసీలను ఓటుగా కాదు, పాలనా భాగస్వాములుగా గుర్తించాల్సిన కాలం వచ్చింది అనేది నగ్నసత్యం.

# 23 నెలల అభివృద్ధి మా బలం

**- పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులు కరువు**

**- పీసీసీ నాయకులు డా" సగరపు**



**హైదరాబాద్ వెలుతురు నవంబరు 27:** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 23 నెలల్లో చేప ట్టిన అభివృద్ధి పనులే పంచాయతీ ఎన్నికల్లో తమకు అంతులేని బలాన్ని ఇస్తాయని పీసీసీనాయకులు డా" సగరపు ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ప్రజలకు ఇచ్చిన హామీలలే కాకుండా ఇవ్వని హామీలను కూడా పూర్తిచేసి వారి మనసు లను గెలుచుకున్నామన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితమే బీఆర్ఎస్ పార్టీ బలహీనతకు స్పష్టమైన నిదర్శనమని వ్యాఖ్యానించారు. పంచా యతీ ఎన్నికల్లో నామినేషన్లు వేయడానికి కూడా బీఆర్ఎస్కు అభ్యర్థులు దొరకని పరిస్థితి ఏర్పడిం దని విమర్శించారు. మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయ ఢంకా మోగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ లో ప్రజలు ఇచ్చిన తీర్పును జీర్ణించుకోలేకపోతున్న బీఆర్ఎస్ నాయకులు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తు న్నారని ప్రసాద్ విమర్శించారు.

# జనరల్ స్థానాల్లో పోటీ చేద్దాం

**- అగ్ర కులాలను ఓడిద్దాం**

**- తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ పిలుపు**



**బషీర్ బాగ్ వెలుతురు 27 నవంబర్ :** అగ్ర కులాలను ఓడిద్దామని తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్తో కలసి చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్ మాట్లాడారు. కామారెడ్డిలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కర్ణాటక బీసీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య తో చెప్పించి, మేనిఫెస్టోలో పెట్టించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై హై కోర్ట్ లో కేసు పెండింగ్ ఉండగానే జీవో 46 తీసుకవచ్చి సర్పంచు ఎన్నికలకు పోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ బీసీ ప్రజా ప్రతినిధులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిడ్డ అయిన నల్గొండ డీసీసీ కైలాష్ ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అవమానకరంగా మాట్లాడిన తీరు చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు ఎలాంటి ప్రాధాన్యత ఇస్తుందో తెలుస్తుందన్నారు. ఫ్రంట్ కన్వీనర్ వెంకన్న గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి బీసీల గొంతు కోశారని, జనరల్ స్థానాల్లో బీసీలను నిలబెట్టి గెలిపించుకుంటామని ఆయన అన్నారు. కాంగ్రెస్, బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు ఏకమై బీసీలపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. 60 శాతం జనాభా ఉన్న బీసీలకు 17శాతం కేటాయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. 11 , 14 ,17 తేదీల్లో జరిగే సర్పంచ్ ఎన్నికలకు బీసీలను చైతన్యపరిచి ఒకే వేదికపై తీసుకువచ్చి జనరల్ స్థానాలలో నిలబెట్టి గెలిపించుకుంటామని ఆయన అన్నారు. ఓ బీసీ మేలుకో నీ గ్రామాన్ని ఏలుకో అని అయిలి వెంకన్న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ నేతలు అంబాల నారాయణ, విజయ్ కుమార్, దుర్గయ్య, రాజ్, నాగ భూషణం, బోయ గోపి, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ బిసి సంక్షేమ సంఘం నాయకులు బషీర్ బాగ్ లో రోడ్ పై అర్ధ నగ్న ప్రదర్శన



**బషీర్ బాగ్ వెలుతురు 26 నవంబర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్ ల విషయం పై మాట తప్పడం సిగ్గుచేటు అని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పిలుపుమేరకు బషీర్బాగ్ బాబు జగ్జీవన్ రావు విగ్రహం వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. పార్టీ పరంగా రిజర్వేషన్ల ను కల్పించి బీసీలను రేవంత్ రెడ్డి మోసం చేసిన నేపథ్యంలో బీసీ సంఘం నీల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఈ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రభుత్వాన్ని గద్ద దించే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. బిసిలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసింది అని మండిపడుతున్నారు.42 శాతం చట్టబద్దత పరంగా రిజర్వేషన్ లు కల్పిస్తామని చెప్పి ఇప్పుడు మోసం చేస్తుంది.రిజర్వేషన్ ఒక్కటే కాకుండా అనేక దొంగ హామీలు ఇచ్చి బిసి లపై ప్రేమ ఉన్నట్టు నటిస్తుంది..బిసి లు ఎవరు చూస్తూ ఊరుకోరు.ఇగ ఇప్పటి నుండి వాడివేడిగా బిసి ఉద్యమాన్ని ఉధృతం చేసి ప్రభుత్వం దిగే వరకు పోరాడతాం. ఖబడ్దార్ రేవంత్ రెడ్డి ఇగ కాసుకో బిసి సత్తా ఏంటో తెలుసుకునే సమయం ఆసన్నమైంది.ఒక మండలంలో 30 గ్రామాలు ఉంటే కనీసం బీసీలకు రెండు సర్పంచ్ పదవులు వచ్చేలాగా కూడా లేవని, వెంటనే ఎలక్షన్లను జరుపకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో నీలం వెంకటేష్ రాజకుమార్ భీమరాజ్ రాజేందర్ అంజి రాందేవ్ రాజు నేత సతీష్ తదితరులు పాల్గొన్నారు

## కిష్టాపురం గ్రామ సర్పంచ్ గా నామినేషన్ వేసిన సురిగి నరసింహ గౌడ్



**మునుగోడు వెలుతురు నవంబర్ 27:** గురువారం రోజున కిష్టాపురం గ్రామానికి చెందిన మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్ సర్పంచి అభ్యర్థిగా నామినేషన్ పత్రం రిటర్నింగ్ అధికారికి సమర్పించినారు, ఈ కార్యక్రమంలో పెద్దలు కుంట్ల భీమారెడ్డి, ఎంజాల మధు, జాజుల శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు డోకా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

## - ఎంపీ ఆర్ కృష్ణయ్య



**హైదరాబాద్ వెలుతురు నవంబరు 27:** బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని వాగ్దానాలు చేసి జీవో తీసి ఎవరికి చెప్పా చేయకుండా 23 శాతంకు తగ్గించి అమలు చేసేటప్పుడు 17 శాతంకు తగ్గించడం అన్యాయమని బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం డోకా చేసిందని ఎంపీ ఆర్ కృష్ణయ్య ఆరోపించారు. దీనిని నిరసిస్తూ తెలంగాణా బీసీ జాక్ ఆధ్వర్యంలో నేడు నిజాం కాలేజి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు వందలాది మందితో భారీ ర్యాలీ నిర్వాయించారు. ఈ కార్యక్రమానికి రాజ్ కుమార్ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ మోడీ రాందేవ్, రాష్ట్ర బి.సి యువజన సంఘం అధ్యక్షులు అంజి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాక్ చైర్మన్, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థ రిజర్వేషన్లు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఊరువాడ ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ ఇంటింటా ప్రచారం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డెక్లరేషన్ చేశారు. పంచాయతీ రాజ్ సంస్థలలో బీసీలకు 42 శాత రిజర్వేషన్లు కల్పిస్తామని, కోట్ల కరపత్రాల ఎన్నికల మేనిఫెస్టో లో ముద్రించారు. ఇంటింటికి ప్రచారం చేశారు. ఎన్నికల ముందు ప్రతి ఎన్నికల సభలో వాగ్దానం చేశారు. ఎన్నికల తర్వాత ప్రతి సభలో వాగ్దానం పునరుద్ఘాటన చేశారు తీరా దగ్గరకు రాగానే కసాయి వాడిలా మోసం చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల తర్వాత అసెంబ్లీలో చట్టం చేశారు. మంత్రివర్గంలో రెండు సార్లు తీర్మానం చేశారు. జనాభా లెక్కలు తీశారు. ఆఖరకు 42 శాతం కల్పిస్తూ రాజ్యాంగ బద్ధంగా జీవో నెంబర్ 9 జారీ చేశారు. బీహార్ ఎన్నికలు ముగియగానే చడి చప్పుడు కాకుండా రిజర్వేషన్లను 42 శాతం నుంచి 22 శాతం తగ్గిస్తూ మరో జీవో నెంబర్ 46 జారీ చేశారు. అమలు చేయడంలో 17 శాతం తగ్గించి తీవ్ర అవకతవకలు పాల్పడ్డారు.జీవో 46 కారణంగా సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాల కేటాయింపులో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. పలు జిల్లాల్లో, అనేక మండలాల్లో, గ్రామాల్లో బీసీలకు ఒక్క సర్పంచ్ లేదా వార్డు సభ్యుని సీటు కూడా కేటాయించ లేదని దాదాపు 1200 సర్పంచ్ పదవులు దక్కకుండా పోయాయి. లెక్కలతో సహా అధికారికంగా వివరించారు. బీసీలకు ఇంతకన్నా పెద్ద మోసం మరొకటి లేదని ఆయన విమర్శించారు. మొదటి నుంచి బి.సి రిజర్వేషన్లు కల్పించే విషయంలో కాంగ్రెస్ తీరు-తెన్నులు అనుమానాస్పదంగా ఉన్నవి. అసెంబ్లీ తీర్మానం చేసిన తర్వాత అఖిలపక్షాన్ని ప్రధాన మంత్రిని కలవడానికి తీసుకు వెళ్ళలేదు. లోక్ సభలో ఇండియా కూటమికి 236 మంది ఎంపీలు ఉన్నారు. గత పార్లమెంటు సమావేశాలు బీహార్ ఓటర్ల విషయంలో నెల రోజులు పార్లమెంట్ బహిష్కరించారు. కానీ బీసీల విషయంలో ఒక్కరోజు కూడా ప్రస్తావించలేదు. బహిష్కరించలేదు కనీసం మాట్లాడలేదు. అంతే కాదు రిజర్వేషన్ల కేసు హై కోర్ట్ లో నడుస్తుంది. తీర్పు రాకముందే ఎన్నికలకు ఎలా వెళతారు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటే మోసం అనేది ప్రజలకు తేట తెల్లమయిందన మరోమారు నిరూపించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక రెండేళ్ల డ్రామా నడిపి, ఇప్పుడు ఇవ్వలేమని చేతులు ఎత్తివేయడం సిగ్గుచేటన్నారు. భారీ ప్రదర్శనలో జాతీయ బి.సి సంక్షేమ సంఘం కో ఆర్డినేటర్ ర్యాగ అరుణ్ కుమార్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య, రాష్ట్ర సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు భూమన్న యాదవ్, తెలంగాణా బి.సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, అనంతయ్య, పగిళ్ళ సతీష్, అంజి గౌడ్, నిఖిల్, బాలస్వామి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో బీసీల ధర్మ యుద్ధభేరి పోస్టర్ ను ఆవిష్కరించిన జాజుల శ్రీనివాస్ గౌడ్



**బషీర్ బాగ్ వెలుతురు 27 నవంబర్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా నవంబర్ 30న బిసిల ధర్మ యుద్ధ భేరిని ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద తలపెట్టినట్లు తెలంగాణ బిసి జాక్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో బిసిల ధర్మ యుద్ధ భేరి కు సంబందించిన వాల్ పోస్టర్ ను జాజుల ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు ఇచ్చిన మాటను అమలు చేయకుండా , ఎన్నికలకు వెళ్లాడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి , ఇప్పుడు మోసం చేస్తూ 46 జీవోను తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసిల రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ మొదటి ముద్దాయి అయితే , బిజెపి రెండవ ముద్దాయి అని ధ్వజమెత్తారు. ఈ రెండు పార్టీలు తలుచుకుంటే ఒక్క రోజులోనే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేసే అవకాశం ఉండేదన్నారు. నవంబర్ 30న బిసిలు విద్రోహ దినంగా పటిస్తామని జాజుల తెలిపారు. 2019 స్థానిక ఎన్నికల్లో బిసిలకు 22 శాతం రిజర్వేషన్లు అమలు అయ్యాయని , కానీ 46 జీవో కారణంగా బిసిలకు 17 శాతం మాత్రమే రిజర్వేషన్లు దక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా గ్రామాలలో ధన ప్రభావంతో అగ్రకులాల అత్యధిక స్థానాల్లో గెలిచే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో రెడ్ల రాజ్యం నడుస్తుందని , బీసీలను రాజకీయంగా భూస్థాపితం చేయాలనే కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. 30 మండలాల్లో బిసిలకు ఒక్క శాతం కూడా రిజర్వేషన్లు దక్కడం లేదన్నారు. ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకొని , రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖుని చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన గెజిట్ శాస్త్రీయంగా లేదని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పార్టీ పరంగా బిసిలకు 60 శాతం సీట్లు ఇస్తామని లీకులు ఇస్తున్నారని , బిసిల పట్ల చిత్తశుద్ధి నిరూపించుకోవలంటే ముఖ్యమంత్రితో ఇదే విషయాన్ని ప్రకటన చేయించాలన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో అఖిలపక్షాన్ని తీసుకొని , ప్రధానిని కలవాలని జాజుల డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ల బిల్లు కోసం ఇండియా కూటమిలోని 243 మంది ఎంపీలు పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేయాలని కోరారు. బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కుర్మా, బీసీ కుల సంఘాల చైర్మన్ ఉప్పర శేఖర్ సగర, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్,పెరిక సురేష్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, వేముల రామకృష్ణ, తారాకేశ్వరి, సమతా యాదవ్ గౌతమి, శ్రీనివాస్ గౌడ్, గూడూరు భాస్కర్, వరికుప్పల మధు, వెంకటేష్ గౌడ్, లక్ష్మీనారాయణ, సుజాత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు

# డిసిసి పదవుల్లో సామాజిక న్యాయం కల్పించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

**రాష్ట్ర ముఖ్యమంత్రి కి యావత్ ఎస్సీ ఎస్టీ బీసీ కుల సంఘాల తరఫున కృతజ్ఞత తెలుపుతున్న నరసింహా నాయక్**



హైదరాబాద్ వెలుతురు నవంబర్ 27: డిసిసి పదవుల్లో సామాజిక న్యాయం కల్పించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి యావత్ ఎస్సీ ఎస్టీ బీసీ కుల సంఘాల తరఫున కృతజ్ఞత తెలుపుతున్నాను మీ నరసింహా నాయక్ ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు స్థానిక సంస్థల ఎన్నికల సమన్యాయం కూడా పాటించాలని అదేవిధంగా బహుజనులకు పెద్ద పీఠం వేయాలని మరియు కుల సంఘాల వారిగా వాళ్లకు అభివృద్ధికి తోడ్పడాలని ముఖ్యమంత్రి గారిని కోరడం జరిగింది అలాగే మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించి నేను బహుజన వర్గాన్ని అన్ని విధాలుగా సమన్యాయం చేస్తున్నానని నిరూపించుకోవాలని కోరడం జరిగింది

# వజ్రష్ యాదవ్ తో కలిసి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తాం

**- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం...**



**కూకట్ పల్లి నవంబర్ 27 వెలుతురు:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు గా నూతనంగా నియమితులైన తోటకూర వజ్రష్ యాదవ్ ని వారి నివాసంలో గురువారం పీసీసీ సభ్యులు, టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమవుతుందని పార్టీ కార్యకలాపాలు ప్రజలకు మరింత చేరువవుతాయని విశ్వసిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలని అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్న అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి పేద కుటుంబానికి చేరేలా పార్టీ ప్రతిష్ఠమైన ప్రజా వ్యూహాలతో ముందకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, కెపిహెచ్బి డివిజన్ తమ్మినేని ప్రవీణ్ కుమార్, బోయిన్ పల్లి డివిజన్ అధ్యక్షులు మహేష్ యాదవ్, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, బోయిన్ పల్లి డివిజన్ మహిళా అధ్యక్షురాలు విజయ లక్ష్మీ, ఫతేనగర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, కూకట్ పల్లి డివిజన్ మహిళా అధ్యక్షురాలు కృష్ణ వేణి, నల్ల పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, ఐఎన్ టియూసి నాయకులు నరసింహ యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ అరుణ్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకన్న, తూము కొండల్, జిబిన్, పవన్, అంజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నల్గొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా ఒక బీసీ బిడ్డ పున్న కైలాష్ నేతను ప్రకటిస్తే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యతిరేకించడం సరికాదు

**- పున్న కైలాష్ కు బీసీ సమాజమంతా అండగా ఉంటుంది.**

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 27:** సామాజిక న్యాయం పాటించి కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం విద్యావంతుడు,యువకుడైన బీసీ బిడ్డ పున్న కైలాష్ నేతను నల్గొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తే అతనిని వ్యతిరేకిస్తూ కైలాష్ ను తొలగించాలని ముఖ్యమంత్రికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లేఖ రాయడం సరికాదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఒక ప్రకటనలో ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.ఎప్పుడో మూడు సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనను దృష్టిలో పెట్టుకొని ఈ విధంగా చేయడంలో అంతర్యమేమిటని అన్నారు. బీసీలు డిసిసి అధ్యక్షుడుగా పనికిరారా అని మేము ప్రశ్నిస్తున్నాం.ఇన్ని సంవత్సరాలు ఐదు సార్లు ఎంఎల్ఏగా ఒక సారి ఎంపీగా మిమ్మల్ని జిల్లాలో ఉన్న బీసీలు ఆదరించడం వల్లే మీరు ఉన్నత పదవులు పొందారని ఒక బీసీ బిడ్డ డిసిసి అధ్యక్షుడు అయితే ఓర్వలేక పోవడం సరికాదని పున్న కైలాష్ కు బీసీ సమాజమంతా అండగా ఉంటుందని లింగం గౌడ్ అన్నారు.

# పున్న కైలాష్ నేత నియామకాన్ని వ్యతిరేకించడం సరైన పద్ధతి కాదు

**- బూడిద మల్లికార్జున్ యాదవ్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు**



**నల్లగొండ జిల్లా వెలుతురు నవంబర్ 27:** నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గా ఎన్నికైన బడుగు బలహీన వర్గాలకు చెందిన పున్న కైలాష్ నేత గారి నియామకానికి వ్యతిరేకంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యమంత్రి కి రాసిన లేఖ అంశం పై బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూడిద మల్లికార్జున్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఉప ఎన్నికల్లో జరిగిన సంఘటనను ఆధారంగా తీసుకొని కైలాష్ గారి నియామకాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నం చేయడం మంచి పద్ధతి కాదని ఆయన అన్నారు. వెంకట్ రెడ్డి గతంలో ఐదు సార్లు ఎమ్మెల్యే గా ఒకసారి పార్లమెంట్ సభ్యుడు గా గెలిపించిన బీసీ సమాజం ఇచ్చిన అండను మరచి ఇప్పుడు ఒక బీసీ బిడ్డ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయితే జీర్ణించుకోలేక వ్యతిరేకించడం ప్రజాస్వామ్య స్ఫూర్తి విరుద్ధం అని విమర్శించారు. సామాజిక న్యాయం పరిరక్షణ లో భాగంగా కాంగ్రెస్ అధినాయకత్వం తీసుకునే నిర్ణయాన్ని గౌరవించాలని, బీసీలు డీసీసీ అధ్యక్షుడు పదవిని నిర్వహించే సామర్థ్యం లేనట్టుగా చూపే ప్రయత్నాలు పద్దతి మానుకోవాలని మల్లికార్జున్ యాదవ్ హెచ్చరించాడు. పున్న కైలాష్ నేత కు బీసీ సమాజం అండ ఉంటదని ఆయనపై వస్తున్న అభ్యంతరాలకు రాజకీయ నేపథ్యం స్పష్టంగా కనిపిస్తోంది అని అన్నారు.

# రాహుల్ సిప్లిగంజ్ వివాహ మహోత్సవంలో పాల్గొన్న జహీరాబాద్ బీజేపీ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్



**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 27:** ప్రముఖ గాయకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత రాహుల్ సిప్లిగంజ్ వివాహ మహోత్సవం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు వివిధ రంగాల ప్రముఖులు, సినీ వ్యక్తిత్వాలు, రాజకీయ నాయకులు భారీగా హాజరయ్యారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బీజేపీ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్ ఈ వివాహ మహోత్సవానికి ప్రత్యేకంగా చేరుకొని నూతన వధూవరులను కలిసి ఆశీర్వదించారు. రాహుల్ సిప్లిగంజ్ ప్రపంచవ్యాప్తంగా తెలుగు సంగీతాన్ని నిలబెట్టిన ప్రతిభాశాలి అని, ఆయన జీవితంలో ఈ కొత్త అధ్యాయం మరింత విజయాలు తీసుకురావాలని పూల సంతోష్ ఆకాంక్షించారు. వివాహానికి హాజరైన అతిథులకు వధూవరుల కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. వేడుకలో కళాకారులు, సినీ ప్రముఖులు, రాజకీయ నేతలు పాల్గొని రాహుల్ దాంపత్య జీవితానికి ఆశీస్సులు అందించారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నియమాలు పాటించాలి

**- కోహిర్ ఎస్ఐ నరేష్ సూచన...**




**జహీరాబాద్ వెలుతురు, నవంబర్ 27:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహిర్ మండల సబ్‌ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నరేష్, గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎన్నికల నియమనిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రూ. 50,000 కంటే అధికంగా నగదు లేదా విలువైన వస్తువులు వెంట తీసుకెళితే సంబంధిత ధ్రువపత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని చెప్పారు. పత్రాలు లేని నగదు, వస్తువులు పోలీసులు తనిఖీల సమయంలో జప్తు చేస్తారని, సరైన పత్రాలు చూపించిన తర్వాత మాత్రమే తిరిగి అందజేస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యాఖ్యలపై, కార్యకలాపాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

# అంబేడ్కర్ స్ఫూర్తితో యువతకు అవగాహన

**- న్యాయవాది మొహీద్ పటేల్**




**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 27 :** సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్లో 76వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బాబా ఫంక్షన్ హాల్లో జరిగిన సభలో ఎంఐఎం అధ్యక్షుడు న్యాయవాది మొహీద్ పటేల్ పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ దేశ ప్రజలకు సమాన హక్కులు, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం వంటి విలువలను అందించిన గొప్ప మహోన్నత వ్యక్తి అని ఆయన కొనియాడారు. అంబేద్కర్ సేవలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రతి గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేసి, యువతలో రాజ్యాంగ విలువలపై అవగాహన పెంచాలని ఆయన పిలుపునిచ్చారు.

# సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు తగ్గించడాన్ని నిరసిస్తూ ఈనెల 30న చలో హైదరాబాద్

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్**



**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 27:** గ్రామపంచాయతీ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను నిట్ట నిలువున తగ్గించి బీసీ లను రాజకీయ సమాధి చేయాలని కాంగ్రెస్ బిజెపి పార్టీలు కుట్రలు చేస్తున్నాయని, వారి కుట్రల ఫలితమే 60 శాతం ఉన్న బీసీలకు 17 శాతం రిజర్వేషన్లు దక్కయని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు.నేడు పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ఎదురుగా ఈ నెల 30వ తేదీన హైద్రాబాద్ లో జరిగే బీసీల రాజకీయ యుద్ధభేరి సభ కు సంబంధించిన గోడపత్రికలను ను బీసీ జేఏసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన 42% రిజర్వేషన్లు దేవుడెరుగు గానీ, కనీసం గతంలో 2019లో జరిగిన సర్పంచ్ ఎన్నికల కంటే ఇప్పుడు జరిగే సర్పంచ్ ఎన్నికలలో నిట్ట నిలువునా తగ్గించడం చాలా అన్యాయం అన్నారు రాష్ట్ర ప్రభుత్వం రోస్టర్ విధానం పేరుతో బీసీలను తడి గుడ్డతో గొంతు కోసిందని, 42% అమలు చేసి ఉంటే 5300 సర్పంచ్ స్థానాలు బీసీలకు దక్కేవని, 17% బీసీ రిజర్వేషన్లు అమలు చేయడం మూలంగా కేవలం 2176 సర్పంచ్ స్థానాలు మాత్రమే బీసీలకు కేటాయించారని, మూడు వేల కు పైగా బీసీలు సర్పంచ్ స్థానాల కు గండి కొట్టారని, బీసీలకు రావాల్సిన రిజర్వు స్థానాలను జనరల్ స్థానాలకు కేటాయించి తెలంగాణ రాష్ట్రంలో రెడ్ల రాజ్యాన్ని గ్రామస్థాయి నుండి తీసుకురావాలని కుట్రలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.రాష్ట్రంలో 30 మండలాలలో ఒక్క గ్రామపంచాయతీ బీసీకి రిజర్వు కాలేదని, 80 మండలాలలో ఒకటి రెండు మాత్రమే రిజర్వ్ అయ్యాయని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 471 గ్రామపంచాయతీలకు ఒక్క గ్రామ పంచాయతీ కూడా బీసీలకు రిజర్వ్ చేయలేద న్నారు, రాష్ట్రవ్యాప్తంగా ఏడు జిల్లాల్లో 10 శాతం లోపు బీసీ రిజర్వేషన్లు, పది జిల్లాల్లో 20 శాతం లోపు రిజర్వేషన్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులు ఇష్టానుసారంగా ఎలాంటి శాస్త్రీయమైన ఆధారాలు లేకుండా బీసీ రిజర్వేషన్లు కేటాయించి బీసీలను పచ్చి మోసం చేశారని ఆయన ఆరోపించారు.ఎన్నికల షెడ్యూల్ తో సంబంధం లేకుండా బీసీ జేఏసీ ఉద్యమాన్ని గల్లీ నుండి ఢిల్లీ వరకు తీవ్రతరం చేస్తామని అందులో భాగంగానే ఈ నెల 30వ తేదీన చలో హైదరాబాద్ పేరుతో ఇంద్ర పార్క్ వద్ద బీసీల రాజకీయ యుద్ధభేరి సభను నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో,బీసీ జేఏసీ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, %ూ × వీ × వీ% జిల్లా సహాయ కార్యదర్శి సయ్యద్ ఫరూక్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు గాధాగోని మహేష్ గౌడ్, బీసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి బంటు కవిత సైదులు, వడ్డెరసంగం నాయకులు వద్దిరాజు రాజుకుమార్, బీసీ విద్యార్థి నాయకులు సురేష్ యాదవ్, ఎస్ పి నాయుడు,నాగరాజు కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు "షేర్ ద విజన్" చేయూత

**- 200 మంది బాధితులకు రూ. 8 లక్షల విలువైన నిత్యావసర సరుకులు అందజేత**











**సైదాబాద్ (హైదరాబాద్) వెలుతురు నవంబర్ 27:** సొంతంగా కదలలేని మెదలలేని దయనీయ స్థితిలో ఉన్న కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు దాతల చేయూత అవసరమని సేవా సంస్థ అధ్యక్షుడు నారాయణరావు అన్నారు. షేర్ ద విజన్ సంస్థ ఆధ్వర్యంలో 200 మంది కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు రూ. 8 లక్షలు విలువైన బియ్యం నిత్యవసర సరుకులను ఆయన చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. సైదాబాద్ లోని వినాయక నగర్ కమ్యూనిటీ హాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నారాయణ రావు మాట్లాడుతూ, మానవత్వంతో స్పందించే మనసున్న తన మిత్ర బృందంతో కలిసి షేర్ ద విజన్ సంస్థను ప్రారంభించి కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనాథ విద్యార్థులు చదువు కొనసాగించేందుకు, వృద్ధాశ్రమాలకు, మానసిక దివ్యాంగులకు, నిరాశ్రయులైన నిరుపేదలకు జీవనానికి అవసరమైన నిత్యవసర సరుకులను, దుప్పట్లను, వస్త్రాలను పంపిణీ చేస్తున్నామని వివరించారు. జన్యు సంబంధమైన సమస్యతో కండరాల క్షీణత వ్యాధికి గురైన వారు ఒకరి సహకారం లేనిదే కాలు సైతం కదిలించలేని, సొంతంగా చేతితో ఆహారం తినలేని దయనీయమైన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాధికి చికిత్స లేకపోవడం, వ్యాధిని నిరోధించే బలమైన పోషకాహారం కొనుగోలు చేసే శక్తి పేదలకు లేకపోవడం బాధాకరమన్నారు. ఈ కుటుంబాలను ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని కోరారు. తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ బాధితుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ, బాధితులకు నెలకు రూ:15,000 పింఛను పించను మంజూరు చేయాలని, కేర్ టేకర్ లను నియమించాలని, తమకు సానుభూతి కాదు, సహకారం కావాలని ప్రభుత్వాన్ని కోరారు. షేర్ ద విజన్ సంస్థ కోశాధికారి పాల్ సద్గుణ రావు, ఐఎస్ సదన్ పోలీస్ ఎస్ఐ పృథ్వీరాజ్, యాకత్ పుర ప్రాంత భాజపా నాయకుడు వీరేందర్ యాదవ్, మస్కులర్ డిస్ట్రోఫీ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కత్తుల బాలకృష్ణ ప్రధాన కరవికుమార్ రవికుమార్, వినోద్ కుమార్ సతీష్ చంద్ర శివకుమార్ రమేష్ యాదవ్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్, హరీష్‌రావుపై కడియం శ్రీహరి వ్యాఖ్యలు అనుచితం

**- మతి భ్రమించి మాట్లాడుతున్న కడియం శ్రీహరి...**

**- పార్టీ నమ్మకాన్ని ద్రోహం చేసిన వ్యక్తికి విమర్శించే హక్కు లేదు...**

**- బిఆర్ఎస్ నియోజవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బండి మోహన్, బిఆర్ఎస్వీ జహీరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ రాకేష్...**



**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 27:** మాజీ మంత్రులు కే.టీ.ఆర్ మరియు హరీష్ రావు ల గురించి తప్పుడు కూతలు కూస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి నోరు అదుపులో పెట్టుకోవాలని బి.ఆర్.ఎస్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్యులు బండి మోహన్ మరియు బి.ఆర్.ఎస్ పార్టీ విద్యార్థి విభాగం జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి రాకేష్ గార్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బండి మోహన్ మరియు రాకేష్ మాట్లాడుతూ సూర్యుని పై ఉమ్మేసి తమాషాలు చూసే కడియం తల్లి పాలు తాగి రొమ్ము గుద్దే చందంగా వ్యవహరిస్తూ నమ్మిన ప్రజలను మరియు నమ్మిన బి.ఆర్.ఎస్ పార్టీని మోసం చేసి తన స్వంత కాంట్రాక్టుల కోసం మరియు స్వంత స్వలాభం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరి కూతురిని పార్లమెంటు సభ్యురాలిగా చేసి బి.ఆర్.ఎస్ పార్టీని మోసం చేసి పార్టీ పై బురద చల్లే ప్రయత్నం మానుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి డాక్టర్ రాజన్న కు కాదని బి.ఆర్.ఎస్ పార్టీ టిక్కెట్టును నీకు ఇచి గెలిపించినందుకు బి.ఆర్.ఎస్ పార్టీ కి ద్రోహం చేసినా నీకు మా పార్టీ అధ్యక్షులు కే.టి.ఆర్ మరియు హరీష్ అన్న గురించి మాట్లాడే అర్హత నీకు లేదు అని అన్నారు. కేవలం నీ కూతురి రాజకీయ ప్రస్థానం మరియు నీ స్వలాభం మరియు కాసుల కక్కుర్తి కోసం బి.ఆర్.ఎస్ పార్టీ పై నీ ఇష్టానుసారంగా పై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కే.టీ.ఆర్ మరియు హరీష్ రావు ల గురించి మాట్లాడే ముందు నీది నువ్వే ఆత్మ విమర్శ చేసుకోవాలని మా పార్టీ బి.ఆర్.ఎస్ లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోబోమని అదే విధంగా మూడు ముక్కలు చేయాలి అనే అనుకుంటే రానున్న రోజుల్లో మూడు పువ్వులు ఆరు కాయల్లా గా మా పార్టీ వికసిస్తుంది అని ధీమా వ్యక్తం చేసారు. నివు కాంగ్రెస్ బ్రోకర్ గా మారి తొత్తుగా వ్యవహరిస్తే తెలంగాణ ప్రజలు నమ్మి పరిస్థితి లో లేరు అని అన్నారు. కడియం గారు మీలాగా పదవి కోసమో ధనం కోసమో మారే వ్యక్తి మా హరీష్ అన్న మరియు మా కే టీ ఆర్ అన్న కాదు అని అన్నారు. నీకు మరియు నీ కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు జరగబోయే సర్పంచి ఎలక్షన్ లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఆరు గ్యారెంటీ లతో మోసం చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని మీకు ఓటు తో తగిన బుద్ధి చెప్తారు అని న్నారు.ఈ కార్యక్రమంలో లో వివిధ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలపై కట్టుదిట్టమైన నిఘా...అక్రమ రవాణాకు తావులేదు

**- ఫ్రీ అండ్ ఫైర్ ఎన్నికల నిర్వహనే లక్ష్యంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు**

**- అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టును కట్టుదిట్టంగా నిర్వహించాలి..**

**- జిల్లా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్...**




**జహీరాబాద్ వెలుతురు, నవంబర్ 27:** గ్రామపంచాయతీ ఎన్నికలను పూర్తిగా ఫ్రీ అండ్ ఫెయిర్‌గా నిర్వహించేందుకు జిల్లాలో ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణా, రాజకీయాలకు సంబంధించిన డబ్బు%-%మద్యం%-%ఇతర సామగ్రి ఎక్కడా ప్రవేశించకుండా ఎఫ్ఎస్ టీ, ఎస్ఎస్ టీ బృందాలతో సమన్వయం చేస్తూ అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులను కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు పరచాలని, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎస్‌హెచ్‌ఓలు ప్రత్యక్షంగా సందర్శించి స్థానిక పరిస్థితులను సమీక్షించాలని ఆదేశించారు. గత ఎన్నికల్లో అల్లర్లు సృష్టించిన వారిని, హిస్టరీషీటర్లను ముందస్తుగా బౌండ్‌ఓవర్ చేయాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరంలో మార్కింగ్ ఏర్పాటు చేసి తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ జరపాలని ఎస్పీ ఆదేశించారు. సామాజిక మాధ్యమాల్లో వివాదాస్పద వ్యాఖ్యలు, అభ్యంతరకర పోస్టులు, ఫార్వార్డ్స్ ద్వారా ఎన్నికల వాతావరణాన్ని దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల్లో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బంది ఎలాంటి రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని స్పష్టం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ రఘునందన్ రావు, డీఎస్పీ సత్యయ్య గౌడ్, ఎఆర్ డీఎస్పీ నరేందర్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్బీ ఇన్స్పెక్టర్ కిరణ్, ఎలెక్షన్ సెల్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ రెడ్డి, సదా నాగరాజు, ఎలెక్షన్ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాబురావు సేవలు చిరస్మరణీం

- ఆయన కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటాం.
- మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి భద్రారెడ్డి



**ఎన్ ఎఫ్ సీ నగర్ వెలుతురు నవంబర్ 27:**
బిఆర్ఎస్ నాయకులు ఎన్ ఎఫ్ సీ నగర్ నివాసి జి. బాబురావు సేవలు చిరస్మరణీయమని మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ చామకూర చామకూర భద్రారెడ్డి అన్నారు. ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మరణించిన జి. బాబురావు సంతాప సభ గురువారం %చీఖీజ% నగర్ లో జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భద్రారెడ్డి మాట్లాడారు. ప్రజా సమస్య పరిష్కారంతోపాటు బిఆర్ఎస్ లో క్రియాశీలకంగా పనిచేసిన బాబురావు ఆకస్మిక మృతి తమను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. బాబురావు కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని... వారి పిల్లలకు తమ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. బాబురావు పిల్లల ఉన్నత విద్య కోసం అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. అంతకుముందు భద్రారెడ్డి బాబురావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ కౌన్సిలర్ వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, నర్సింగరావు గోపాల్ రెడ్డి, బిక్షపతి గౌడ్, లింగస్వామి, చంద్రశేఖర్, జంపాల రమేష్, సీనియర్ జర్నలిస్ట్ పిట్టల శ్రీశైలం మాజీ ఎంపీటీసీ మేకల నర్సింగ్ రావు తో పాటు బాబురావు సోదరుడు మల్లేశం, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి సాధ్యం

- దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు ఉక్కుల అశోక్



**ఆదిభట్ల వెలుతురు నవంబర్ 27:**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల మున్సిపాలిటీ చింతపల్లి గూడలోఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకుసిసి రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించారు.ఈసంద ర్భంగాదళిత చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడు తూ సమగ్ర అభివృద్ధి స్థానిక ఎమ్మె ల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తోనే సాధ్య మవుతుందని సబ్బండ వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వ సారథ్యంలో ఎమ్మెల్యే అహర్నిశలు కృషి చేస్తు న్నారని కొనియాడారు ఈసందర్భంగా నిర్వహించిన పూజకార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు జోగు శేఖర్ కొంద్రు రాములు జోగు బాలయ్య జోగు నర్సింహ జోగు యాదయ్య జోగు జంగయ్య జోగు మహేందర్ జోగు భాస్కర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తపస్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వడ్ల రాజేందర్ మరియు రాపోలు ప్రవీణ్ కుమార్ లు ఏకగ్రీవంగా ఎన్నిక



**ఇబ్రహీంపట్నం వెలుతురు నవంబర్ 27:**
ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నంత పాఠశాలలో నిర్వహించిన తపస్ మండల సమావేశంలో మండల శా ఖనూతన అధ్యక్ష ప్రధాన కార్యద ర్శులుగా వడ్ల రాజేందర్ మరియు రాపోలు ప్రవీణ్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజాలరి రమేశ మాట్లాడుతూ ఉపాధ్యాయుల విద్యారంగ సమస్యల పరిష్కారానికి తపస్ కృషి చేస్తుందని అదేవిధంగా టి ఈ టి సమస్యను ఎన్ సి టి ఈ అధికారుల దృష్టికి మరియు తెలంగాణ ఎంపీల ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి సార్ తపస్ మండల గౌరవ అధ్యక్షులు కావలి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు ఉదారి నర్సింహా మండల కోశాధికారి యం రాము సార్ వీడియో కన్వీనర్ పి మహేష్ ఉపాధ్యక్షులు యం శైలజ జి శైలజ మహిళా కన్వీనర్లు సంజీవ రాణి, పి.నందిత. జయశ్రీ, స్వప్న రాంమోహన్ మరియు తదితరులు పాల్గొన్నారు

## మరో గ్రామం ఏకగ్రీవం

- ఆదిలాబాద్ జిల్లా తేజాపూర్ ఏకగ్రీవానికి అంగీకారం

**ఆదిలాబాద్,నవంబర్27( వెలుతురు):**
తెలంగాణ పల్లెల్లో ప్రజాస్వామ్య ఎన్నికల సందడి మొదలైంది. గ్రామ పంచాయతీ ఎన్నికల పక్రియ అధికారికంగా ప్రారంభం కావడంతో రాష్ట్రం మొత్తం ఎన్నికల వాతావరణం లోకి ప్రవేశించింది. దీనితో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ పక్రియ ప్రారంభమయ్యింది. నామినేషన్ రోజు మరో సర్పంచ్ ఏకగ్రీవమయ్యారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని తేజపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తేజపూర్ గ్రామపంచాయతీకి పరిధిలోని సాలెగుడా, డోబ్బిగూడ , తేజపూర్ గ్రామ పటేల్‌ల ఆధ్వర్యంలో సమావేశమై స్వచ్ఛందంగా ఎన్నికలు నిర్వహించకుండా కోవా రాజేశ్వర్‌ను సర్పంచ్‌గా మరో 8 మంది వార్డు సభ్యులను ఎన్నుకున్నారు.మరోవైపు.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజునే తొలి ఏకగ్రీవ ఎన్నిక నమోదు అయింది. రుద్రంగి మండలంలోని రూపులా తండాలో సర్పంచ్ పదవికి జవహర్ లాల్ నాయక్‌ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో అక్కడ ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఎన్నికల పక్రియ ప్రారంభమైన వెంటనే ఏకగ్రీవ నిర్ణయానికి గ్రామ పెద్దలు, యువత, మహిళలు కలిసి మద్దతు తెలపడంతో పోటీ అవసరమే లేకుండా పోయింది. జవహర్ లాల్ నాయక్ ఏకగ్రీవంగా ఎంపికైన వెంటనే తండా అంతటా టపాసులు కాల్చి వేడుకలు జరుపుకున్నారు.

# బి.సి లను నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీ జీవో 46 ద్వారా నయవంచన

- 42 శాతం రిజర్వేషన్ లతో కొత్త నాటకం స్థానిక ఎన్నికల్లో ఓట్ల లబ్ది కోసమే చీరలు పంపిణీ
- బిఅర్ఎస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షులు చీరాల రమేష్



**మంచాల వెలుతురు నవంబర్ 27:**
మంచాల మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు చీరాల రమేష్ మాట్లాడుతూ బిసి లకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో నాట కమాడి బి.సి లను నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీనీ స్థానిక ఎన్నికల్లో బొంద పెట్టడం ఖాయం అని బి.అర్.ఎస్ అన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గత రెండు సంవత్సరాలుగా చేసిందేమీ లేదని అన్నారు. గత 76 సంవ త్సరాలుగా కాంగ్రెస్ పార్టీ బి.సి లను మోసం చేస్తూనే వస్తుందని అన్నారు అదే క్రమంలో ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సి.ఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో 42 శాతం రిజర్వేషన్లు పేరు తో కొత్త నాటకం ఆడి మరోసారి మోసం చేసిందని అన్నారు. ప్రస్తుతం మంచాల మండలంలో 23 గ్రామ పంచాయతీలో బిసి కేటగిరీలో రెండు గ్రామాలు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. అందులో రెండు చిన్న గ్రామాలకు కేటాయించడం మరి విడ్డూరంగా ఉందని అన్నారు. ఇలా రిజర్వేషన్ లు కేటాయించడం బి.సిల పై చిన్న చూపు చూడటం కాంగ్రెస్ పార్టీ నిదర్శనం అని అన్నారు గత బిఅర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సిఎం కేసిఆర్ ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా బతుకమ్మ సంబరాల్లో ప్రతి ఆడపడుచుకి చీరలు పంపిణీ చేస్తే ,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉదయం చీరలు పంపిణీ చేసి సాయంత్రం ఎన్నికల నోటిఫికేషన్ వేయడం ఏమిటని ప్రశ్నించారు ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అ మలు చేయక పోగా 42 శాతం రిజర్వేషన్లు పేరుతో మరోసారి బి.సి ల ను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ నీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం అని అన్నారు

# తల్లిదండ్రుల ఆశయ సాధనలో విద్యార్థులు ముందు ఉండాలి

- ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ పి. శ్రీనివాసరావు





**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 27 :**
సంగారెడ్డి జిల్లా :- ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు నిరంతరం విద్యా అధ్యయనం చేసి తల్లిదండ్రుల ఆశయ సాధనలో విద్యార్థులు ముందు ఉండాలి ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ పి. శ్రీనివాసరావు అన్నారు.. గురువారం నాడు జడ్పిహెచ్ఎస్ నారాయణ ఖేడ్ పాఠశాలలోని విద్యార్థులకు యుఎస్ లో ఉన్న తమ కూతురు బిందు సాహితి సంతోష్ ల సహకారంతో 80 మంది విద్యార్థులు నోటు పుస్తకాలు మరియు పెన్నులు ఇతర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద బడుగు బలహీన వర్గ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు సాంకేతిక విద్యను అందిస్తే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చు అన్నారు . తాను కూడా ఒక మారుమూల ప్రభుత్వ పాఠశాలలో చదివానని ప్రస్తుతం ఆర్టీసీ డిపో దీప్తి మేనేజర్ గా పనిచేస్తున్నానని తన పిల్లలను కూడా ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది విదేశాలలో ఉంటున్నారని అన్నారు . రాబోవు రోజులో ప్రతి విద్యార్థి కూడా తమలక్ష్య సాధన కోసం నిరంతరం చదవాలని వారు కోరారు... ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మన్మథ కిషోర్, కుటుంబ సభ్యులు ఝాన్సీ లక్ష్మి , ఉపాధ్యాయులు యాదగిరి, హమీద్, చంద్రశేఖర ఆచార్య ఆర్టీసీ సిబ్బంది భాస్కర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు..

# కోకో క్రీడల సంబరానికి సిద్ధమైన పటాన్ చెరువు

- నేటి నుండి పటాన్ చెరువు లో 44వ తెలంగాణ అండర్ 14 కోకో బాలబాలికల అంతర్ జిల్లాల ఛాంపియన్షిప్
- ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో క్రీడల నిర్వహణ




**పటాన్ చెరువు వెలుతురు నవంబర్ 27:**
రాష్ట్ర స్థాయి క్రీడలకు పటాన్ చెరువు పట్టణం మరోసారి వేదికగా నిలవనుంది. పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని మైత్రి మాదానం వేదికగా నేటి నుండి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు 44వ తెలంగాణ అండర్ 14 ఖో ఖో బాల%-%బాలికల అంతర్ జిల్లాల చాంపియన్షిప్%-%2025 పోటీలు జరగనున్నాయి. పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సౌజన్యంతో ఖో ఖో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్రీడ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు గురువారం ఉదయం పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మైత్రి మైదానంలో క్రీడల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. 33 జిల్లాల నుండి తరలివచ్చే క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతి సదుపాయంతో పాటు అల్పాహారం, భోజనం సదుపాయాలను సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పటాన్ చెరువు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఏడాది పొడుపున వివిధ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ పోటీలకు పటాన్చెరు మైత్రి మైదానాని వేదికగా నిలుపుతున్నామని తెలిపారు. కోకో క్రీడకు మరింత ప్రాచుర్యం అందించేలా రాష్ట్రస్థాయి పోటీలు దోహదపడతాయని తెలిపారు.

# హిందువులు, బజరంగ్ దళ్, అధికారులు పట్టించుకోని హనుమాన్ గుడి దేవాలయాన్ని నిర్మించి అభివృద్ధి చేయాలి

- ప్రజ్ఞాపూర్ గుండనపల్లి ప్రజలు

**ప్రజ్ఞాపూర్ వెలుతురు నవంబర్ 27:**
ప్రజ్ఞాపూర్ గుండన్నపల్లి శివారు పాతూరు రోడ్ దగ్గరలో పంట చేనులో 50 సంవత్సరాల నుంచి పట్టించుకోని హనుమంతుని విగ్రహం ధూప దీప నైవేద్యానికి అభిషేకానికి పూజకు నోచుకోని ఆరాధించే భక్తులే లేరు గత 50 సంవత్సరాల నుంచి చరిత్ర గల హనుమంతుని విగ్రహం పాతూరు రోడ్ బురుజు గడ్డ ప్రజ్ఞాపూర్ గుండన్నపల్లి శివారులో పాతూరు రోడ్ వైపున ఖాళీగా ఉన్న హనుమంతుని విగ్రహాన్ని 50 సంవత్సరాల చరిత్ర గల హనుమంతుని విగ్రహం ధూప దీప నైవేద్యానికి అభిషేకానికి నోచుకోని హనుమంతుని విగ్రహాన్ని ఇంత విశేషమైన విగ్రహాన్ని పట్టించుకునే నాధుడే లేక చికిలానికి చేరుకున్న హనుమంతుని విగ్రహం 50 సంవత్సరాలు గల విశేషమైన హనుమంతుని విగ్రాన్ని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ గుండన్న







పల్లి పాతూరు రోడ్డు వైపున బురుజు గడ్డ పంట చేనులో ఖాళీగా ఉన్న హనుమంతుని విగ్రహాన్ని అధికారులు పట్టించుకోని హనుమంతుని విగ్రహానికి గుడి లేని దైవానికి గుడి నిర్మించి ధూప దీప నైవేద్యానికి హనుమంతుని విగ్రహాన్ని అభిషేకించి ఆరాధించే విధంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ గుండునపల్లి మున్సిపాలిటీ పరిధిలో పాతూరు రోడ్ ప్రక్కన బురుజు గడ్డ దగ్గరలో ఖాళీగా ఉన్న 50 సంవత్సరాల చరిత్ర గల హనుమంతుని విగ్రహానికి అధికారులు పట్టించుకోని హనుమాన్ గుడి దేవాలయాన్ని నిర్మించి అభివృద్ధి చేయాలని హిందువులు బజరంగ్ దళ్ అండ్ అధికారులు పట్టించుకోని ఆలయాన్ని నిర్మించి డెవలప్ చేయాలని ప్రజ్ఞాపూర్ గుండనపల్లి ప్రజలు కోరుచున్నారు.

# మావి పండగ చీరలు...రేవంత్ వన్నీ ఓట్ల చీరలు

**- మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శలు**



**సిద్దిపేట,నవంబర్27( వెలుతురు):**
స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పేరుతో బీసీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేశారని మాజీమంత్రి హరీశ్‌రావు మరోమారు విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి.. కేవలం 17 శాతమే ఇచ్చారన్నారు. కేసీఆర్.. పండుగ కోసం చీరలిస్తే రేవంత్‌రెడ్డి మాత్రం ఓట్ల కోసమే చీరలు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రికి ఎంతసేపూ ఓట్ల రాజకీయమే తప్ప.. రాష్ట్ర ప్రయోజనాల మీద శ్రద్ధ లేదన్నారు. సిద్దిపేటలోని భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో గురువారం దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. నవంబరు 29.. చరిత్రను మలుపుతిప్పిన రోజన్నారు. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. రాష్ట్ర సాధనకు ఉద్యమగడ్డ అయిన సిద్దిపేటలో 1,531 రోజుల పాటు దీక్షలు కొనసాగటం చరిత్ర అన్నారు. నవంబరు 29 నుంచి డిసెంబరు 9 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించారు.

# పంచాయితీ ఎన్నికల నేపథ్యం

**- లీగల్ సెల్ ఏర్పాటు చేసిన పంచాయితీరాజ్ విభాగం**

**హైదరాబాద్,నవంబర్27( వెలుతురు):**
తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్ చర్యలు చేపట్టింది. సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల ఎన్నిక కోసం నామినేషన్ల పక్రియ ప్రారంభమైన నేపథ్యంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్‌లో ప్రత్యేక లీగల్ సెల్ ఏర్పాటు చేశారు. ఈ లీగల్ సెల్‌ను ముగ్గురు సూపరిండెంట్ స్థాయి అధికారులు పర్యవేక్షిస్తుంటారు. ఎన్నికల్లో రిజర్వేషన్లను సవాలు చేస్తూ కోర్టుల్లో పలు పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో లీగల్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికలు నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తిచేసే విధంగా, ఎన్నికల పక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా వెంటనే చర్యలు తీసుకునేలా జిల్లాలతో లీగల్ సెల్ సమన్వయం చేయనుంది. కేసులకు సంబంధించిన వివరాలు, సూచనలను 24 గంటల్లోపుగా అదనపు అడ్వొకేట్ జనరల్, గవర్నమెంట్ ప్లీడర్‌కి నివేదించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఎన్నికల పక్రియ నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయడంతో పాటూ కోర్టు కేసులు ఎన్నికలను ప్రభావితం చేయకుండా ఉండేందుకు ఈ ప్రత్యేక సెల్ అన్ని జిల్లాలను సమన్వయం చేస్తుంది. అలాగే ప్రతి జిల్లాలో కోర్టు కేసులను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారిని నియమించాలని, కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన లీగల్ సెల్‌తో సమన్వయం చేసుకోవాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన ఆదేశాలు జారీ చేశారు.

# మహబూబ్ పట్నం పంచాయతీ ఎన్నికపై స్టే

**మహబూబాబాద్,నవంబర్27( వెలుతురు):**
మహబూబాబాద్ జిల్లా మహబూబ్ పట్నం గ్రామ పంచాయతీ ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. ఆరుగురు ఓటర్లు ఉన్న ఎస్టీలకు ఒక సర్పంచ్, మూడు వార్డు స్థానాలు ఎలా రిజర్వ్ చేశారంటూ హైకోర్టు.. ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మహబూబ్ పట్నంలో మూడు ఎస్టీ కుటుంబాలకు చెందిన ఏడుగురు ఓటర్లు ఉన్నారు. వీరికి సర్పంచ్‌తో పాటు మూడు వార్డులు కూడా కేటాయించారు. ఈ రిజర్వేషన్లు మార్చాలని గ్రామానికి చెందిన యాకూబ్, శ్రీకాంతాచారి, లింగయ్య, విజయ్, వెంకటమల్లు, పోలు నాగయ్య తదితరులు బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. గతంలో మహమూద్‌పట్నం గ్రామ పంచాయతీ నుంచి తండాలను వేరు చేసి కొత్త పంచాయితీలు ఏర్పాటు చేశారని, దీంతో ఆ గ్రామంలో 576 ఓట్లు ఉన్నట్లు పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. 199 మంది ఎస్సీలు, 358 మంది బీసీలు, 13 మంది ఓసీలు, ఏడుగురు ఎస్టీలు ఓటు హక్కును కలిగి ఉన్నారని చెప్పారు. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కల్పించడంతో సర్పంచ్ స్థానంతో పాటు 3 వార్డులు దక్కాయి. దీనిపై హైకోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలను రద్దు చేస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కిష్టాపురం గ్రామ సర్పంచ్‌గా కొండం రంగారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ సర్పంచ్‌తో పాటు 8 మంది వార్డ్ మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొండం రంగారెడ్డి బ్రదర్స్ గ్రామానికి అనేక సేవా కార్యక్రమాలు చేశారు. దీంతో ఆ గ్రామస్తులంతా ఏకమై పార్టీలకతీతంగా సర్పంచ్‌గా రంగారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# పవన్ కల్యాణ్‌వి తెలివితక్కువ మాటలు

**- పవన్ వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి విమర్శలు**



**హైదరాబాద్,నవంబర్27( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన 'దిష్టి' వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల మధ్య రాజకీయ దుమారం రేపుతున్నాయి. కోనసీమ పచ్చదనానికి తెలంగాణ నేతల దిష్టి తగిలిందన్న పవన్ వ్యాఖ్యలపై తెలంగాణ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్‌వి తెలివితక్కువ మాటలని, మెదడుకు పనిచెప్పకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. "మా దిష్టి వాళ్లకు తగలడం కాదు, ఇన్నేళ్లుగా వాళ్ల దిష్టే మా తెలంగాణకు, హైదరాబాద్‌కు తగిలింది" అని జగదీశ్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ప్రతిరోజూ వందలాది మంది ఏపీ నుంచే హైదరాబాద్‌కు వస్తున్నారని, అలాంటప్పుడు తమ దిష్టి ఎలా తగులుతుందని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ దిష్టి తగులుతుందని అంత భయంగా ఉంటే, ఓ దిష్టిబొమ్మ పెట్టుకోవాలని, దాన్ని తామేమీ ఆపలేదని వ్యంగ్యంగా అన్నారు. "ఇంత తెలివిలేని వాళ్లు కూడా ఉప ముఖ్యమంత్రులు అవుతున్నారంటే ఆశ్చర్యంగా ఉంది" అంటూ జగదీశ్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. బుధవారం కోనసీమ జిల్లా రాజోలులో 'పల్లె పండుగ 2.0' కార్యక్రమంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పచ్చని కోనసీమకు తెలంగాణ నాయకుల దిష్టి తగిలింది. ఇక్కడి కొబ్బరి చెట్ల పచ్చదనాన్ని చూసే బహుశా వారికి ప్రత్యేక రాష్ట్రం ఆలోచన వచ్చిందేమో" అని వ్యాఖ్యానించారు. నరుడి దిష్టికి రాయి కూడా పగిలిపోతుందని ఆయన పేర్కొన్నారు. పవన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశం కాగా, జగదీశ్ రెడ్డి తాజా ప్రతిస్పందనతో రాజకీయ వేడి మరింత పెరిగింది. ఈ మాటల యుద్ధం రెండు రాష్ట్రాల మధ్య ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# చామనపల్లి గ్రామ బిజెపి సర్పంచ్ అభ్యర్థి గా నామినేషన్ దాఖలు చేసిన మునిగంటి కుమార్...





**కరీంనగర్ వెలుతురు నవంబర్ 27:**
కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామ బిజెపి సర్పంచ్ అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ యువ మోర్చా రాష్ట్ర నాయకులు మునిగంటి కుమార్ గురువారం రోజున నామినేషన్ దాఖలు చేశారు. కరీంనగర్ రూరల్ బిజెపి మండల నాయకులు , జిల్లా నాయకుల తో కలసి కరీంనగర్ రూరల్ ఎన్నికల కార్యాలయంలో మునిగంటి కుమార్ నామినేషన్ పత్రాలు ను ఎన్నికల అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా మునిగంటి కుమార్ మాట్లాడుతూ చామనపల్లి గ్రామ అభివృద్ధి కోసం బిజెపి అభ్యర్థి గా బరిలో నిలిచిన తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకొని ముందుకు కొనసాగుతున్నారన్నారు. సర్పంచిగా తనకు అవకాశం కల్పిస్తే చామనపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం శాయ శక్తుల కృషి చేస్తానని మునిగంటి కుమార్ ఈ సందర్భంగా చెప్పారు.

# కృషి విజ్ఞాన కేంద్రం సేవలు ప్రశంసనీయం

**- బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి**

**కరీంనగర్ వెలుతురు నవంబర్ 27:**



వ్యవసాయ పరిశోధనా ఫలాలు స్థానిక రైతుల పొలాలలో ఆచరించే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్న జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం సేవలు ప్రశంసనీయమని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి శ్లాఘించారు రైతు నాయకులు కృష్ణారెడ్డి చొప్పదండి మండల రైతులతో కలిసి జమ్మికుంట లోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి కేంద్రం నిర్వహిస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెవికె శాస్త్రవేత్తలు తాము పండిస్తున్న పలు పురాతన దేశీయ వరి వంగడాలను,జీవ వనరుల కేంద్రం చూపించారు. గడిచిన సంవత్సరం నుండి 1483 మంది రైతుల పొలాలలో సహజ వ్యవసాయం ఆచరింప చేస్తున్నామని రానున్న 2సంవత్సరాలలో కెవికె పరిధిలో పదివేల ఎకరాలలో సుమారు 6000 మంది రైతులతో ఎరువులు పురుగు మందులు లేకుండా పెట్టుబడి ఖర్చులు తగ్గిస్తూ రైతుల ఆదాయాన్ని వినియోగదారుల ఆరోగ్యాన్ని పెంచే విధంగా సహజ సిద్ధ వ్యవసాయాన్ని ఆచరించేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నట్టు ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు కృష్ణారెడ్డి బృందానికి వివరించారు. రసాయన ఆధారిత గ్రోత్ ప్రమోటర్లకు బదులుగా సహజ సిద్ధమైన చేపల వ్యర్థాలు మరియు మజ్జిగ తో బెల్లం కలగలిపి సహజమైన గ్రోత్ ప్రమోటర్ రూపొందించి ఉపయోగిస్తున్నట్లు క్షేత్ర స్థాయిలో అవి మంచి ఫలితాలు ఇస్తున్నట్టు శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా తెలియజేశారు. గోమూత్రం సులభంగా సేకరించేలా కెవికె ఆవరణలో నిర్మించిన పశువుల షెడ్డులో ఆవు మూత్రం ట్యాంక్ లోకి వెళ్లేలా అతి తక్కువ ఖర్చుతో



నిర్మించిన ట్యాంకును శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా రైతులకు చూపించారు. ఈ విధంగా సేకరించిన అవు మూత్రాన్ని గ్రోత్ ప్రమోటర్ల లోనూ మరో వైపు సహజ కీటక నాశిని గాను కేవికే ప్రయోగాల్లో విజయవంతంగా వినియోగిస్తున్నారు. ప్రతి సంవత్సరం రైతులకు, వ్యవసాయ విస్తరణ అధికారులకు, వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇస్తూ వ్యవసాయం లోని సమర్థ యాజమాన్య పద్ధతులు పాటించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని సీనియర్ శాస్త్రవేత్త వేంపటేశ్వర రావు రైతు బృందానికి తెలియచేసారు. కే వి కె పరిధిలోని అనేక మంది రైతులు వివిధ జాతీయ అవార్డులు గెలుచుకోవడం పట్ల సింగిరెడ్డి కృష్ణారెడ్డి కేవీకే శాస్త్రవేత్తలను అభినందించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర వ్యవసాయ బడ్జెట్ ను ఆరు రెట్లు పెంచిందని, రైతు ఆదాయాన్ని పెంచే విధంగా వ్యవసాయ విధానాలు రూపొందిస్తున్నదని, పంట సేకరణ ధరలు రెట్టింపు చేసిందని, అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ధరలు పెరిగినప్పటికీ ఆ భారం రైతు పై పడకుండా ఎరువుల సబ్సిడీ మూడింతలు పెంచిందని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రసాయన రహిత సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నదని రైతులు కూడా కే వి కే సేవలు వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కేవీకే మత్స్య విభాగం శాస్త్ర వేత్త జి. ప్రభాకర్, ప్రొగ్రాం అసిస్టెంట్ కే. సుప్రజ, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు కోర్డినేటర్ కుమార్ యాదవ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మిరెడ్డి, రైతులు మొగిలి మహేష్, రాపల్లి శ్రీనివాస్,గుండె వెంకటేష్, కాయిత సాయి తదితరులు పాల్గొన్నారు.

# జవాబుదారీతనం తప్పనిసరి

**- బాధ్యతారాహిత్యంగా ఉండటం ఏంటి?**
**- ఆన్‌లైన్ కంటెంట్‌పై బాధ్యత ఉండాల్సిందే**
**- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ,నవంబర్ 27( వెలుతురు):**
సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసే కంటెంట్‌కు ఎవరో ఒకరు తప్పనిసరిగా బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సొంతంగా ఛానల్ ప్రారంభించినంత మాత్రాన ఎవరికీ జవాబుదారీగా ఉండననుకోవడం సరికాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియాకు సంబంధించిన ఓ వివాదంపై గురువారం విచారణ సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఓ హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారంపై అభ్యంతరకర ప్రశ్నలు అడిగిన ఘటనలో రణ్‌వీర్ వివాదాస్పదుడయ్యారు. ఈ కేసు విచారణకు రాగా, ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది. "అసభ్యకరమైన కంటెంట్ అప్‌లోడ్ చేస్తే అది వైరల్ అవుతుంది, లక్షల మంది చూస్తారు. దీన్ని ఎలా నియంత్రిస్తారు? దేశ వ్యతిరేక కంటెంట్ పెట్టినప్పుడు దానికి సదరు క్రియేటర్ బాధ్యత వహిస్తారా?" అని కేంద్రాన్ని ప్రశ్నించింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, ఇది కేవలం అశ్లీలతకు సంబంధించిన అంశం కాదని, యూజర్లు సృష్టించే కంటెంట్‌లోని లోపాలను ఇది ఎత్తిచూపుతోందని అన్నారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను వక్రీకరించకూడదని ఆయన పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం, ఆన్‌లైన్ కంటెంట్‌ను పర్యవేక్షించే వ్యవస్థ ఉన్నప్పటికీ ఇలాంటివి ఎందుకు జరుగుతున్నాయని కేంద్రాన్ని నిలదీసింది. సోషల్ మీడియాలో వినియోగదారులు సృష్టించే కంటెంట్‌ను నియంత్రించేందుకు సరైన నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. ఇందుకు కేంద్రానికి నాలుగు వారాల సమయం ఇచ్చింది.

# ఆర్టీసీ బస్సులో నాటుబాంబులు

**- బస్సులో 1000 నాటుబాంబుల రవాణా**

**విజయనగరం,నవంబర్27( వెలుతురు):**
అది ప్రయాణికులతో కిటకిటలాడుతూ ఉండే బస్టాండ్. ఒక్కసారిగా భారీ శబ్దం. దట్టమైన పొగలు. కారణం, ఆర్టీసీ బస్సులో వచ్చిన ఓ పార్శిల్‌లో ఏకంగా 1000 నాటుబాంబులు ఉండటమే. అవును, మీరు విన్నది నిజమే. ఇటీవల పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జరిగిన నాటుబాంబుల పేలుడు ఘటన, ఆర్టీసీ కార్గో సేవల్లోని భద్రతా వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. బస్సులో వచ్చిన పార్శిల్‌ను దించే క్రమంలో జరిగిన ఈ పేలుడులో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అసలు ఆ మూటలో ఏముందో తెలియకుండానే బస్సులో ఎక్కించేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.ప్రయాణికులను చేరవేయడంతో పాటు, అదనపు ఆదాయం కోసం ఆర్టీసీ 2017లో కార్గో (పార్శిల్) సేవలను ప్రారంభించింది. తక్కువ ధరకే వస్తువులను పంపించే వెసులుబాటు ఉండటంతో దీనికి మంచి ఆదరణ లభించింది. రోజురోజుకూ ఆదాయం రెట్టింపు అవుతోంది. విజయనగరం జోన్ పరిధిలోనే రోజుకు సుమారు 250 వరకు బుకింగ్‌లు జరుగుతున్నాయి. దీని ద్వారా రోజుకు రూ.40 వేల వరకు, నెలకు రూ.12 లక్షల ఆదాయం సమకూరుతోంది.

నిత్యం ఈ సేవలను ఆశ్రయించేవారు 40 మంది వరకు రెగ్యులర్ కస్టమర్లు ఉన్నారు. అయితే, ఆదాయంపై పెట్టిన శ్రద్ధ, భద్రతపై పెట్టకపోవడమే ఇప్పుడు కొంప ముంచుతోంది.ప్రస్తుతం ఆర్టీసీ కార్గో బుకింగ్ వ్యవస్థను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. బుకింగ్ కౌంటర్లలో స్కానర్ పరికరాలు లేవు. లోపల ఏ వస్తువు ఉందో సాంకేతికంగా గుర్తించే వ్యవస్థ లేదు. పార్శిల్ పైన ఒక పేరు రాసి ఉంటే, లోపల మరో వస్తువు ఉంటోంది. కేవలం బరువును మాత్రమే చూసి, డబ్బులు తీసుకుని రశీదు ఇచ్చేస్తున్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గంజాయి, గుట్కా, ఇప్పుడు ఏకంగా నాటుబాంబులు వంటి నిషేధిత వస్తువులను దర్జాగా ఆర్టీసీ బస్సుల్లో తరలిస్తున్నారు.ప్రైవేట్ కొరియర్ సర్వీసులతో పోలిస్తే ఆర్టీసీలో ఛార్జీలు చాలా తక్కువ. పైగా ఆర్టీసీ బస్సులు మారుమూల గ్రామాల వరకు వెళ్తాయి. ఇదే అక్రమార్కులకు వరంగా మారింది. ఏజెన్సీ సిబ్బందిలో తెలిసిన వారు ఉంటే చాలు, ఎలాంటి తనిఖీలు లేకుండానే అనుమానాస్పద వస్తువులను పంపించేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు మూట కట్టి తెచ్చిన వస్తువును యథాతథంగా బస్సు ఎక్కించేస్తున్నారు. అది ప్రయాణికుల పాలిట యమపాశంగా మారుతున్నా పట్టించుకునే నాథుడే లేడు.లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా, పర్యవేక్షణ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. కార్గో విభాగానికి మూడు జిల్లాల పరిధిలో (విజయనగరం జోన్) కేవలం ఒక్కరే సూపర్‌వైజర్ ఉన్నారు. డిపోల పరిధిలో డిపో మేనేజర్లు (డీఎంలు) పర్యవేక్షించాల్సి ఉన్నా, పని ఒత్తిడి కారణంగా అది జరగడం లేదు. నిఘా కొరవడటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.ఈ పరిస్థితిపై విజయనగరం డిపో కమర్షియల్ విభాగం అసిస్టెంట్ మేనేజర్ హెచ్.

దివ్య స్పందించారు. స్కానర్లు వంటి ప్రత్యేక పరికరాలు కావాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. రూ.5 వేలు విలువ దాటిన వస్తువులకు తప్పనిసరిగా బిల్లు అడుగుతున్నామని, ఇకపై అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.ఏది ఏమైనా, పార్వతీపురం ఘటన ఒక హెచ్చరిక మాత్రమే. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు మేల్కొని, కార్గో కేంద్రాల్లో స్కానర్లు ఏర్పాటు చేసి, కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టకపోతే, సామాన్య ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం పొంచి ఉంది.

# జాతీయ తీర్మానం: బాల్య వివాహాలు లేని భారత్ ధ్యేయంగా కృషి చేస్తున్న యావత్ ప్రభుత్వం, సమాజం



**-అన్నపూర్ణా దేవి**

మహిళలు, పిల్లలు వంద కోట్లకు పైగా జీవితాలకు ఆధారంగా ఉన్న దేశంలో... వారి సాధికారత కేవలం విధానపరమైన ఎంపిక మాత్రమే కాదు - ఇది భారత గమ్యానికి మార్గం. గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక పాలనలో భారత్ ప్రపంచ ఆశయాలను మానవ-కేంద్రిత పురోగతితో అనుసంధానించే చరిత్రాత్మక పరివర్తనను సాధిస్తోంది. నవ భారత విజయ గాథ... ఆర్థిక పురోగతి, ప్రపంచ ఉనికి ద్వారా మాత్రమే కాకుండా యువ మనస్సులు వికసించే తరగతి గదుల్లో, మన పిల్లలను పెంచే అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆకాంక్షలు వేళ్లూనుకునే గృహాల్లో రూపుదిద్దుకుంటోంది.

'బేటీ బచావో బేటీ పడావో' పట్ల ప్రధానమంత్రి అచంచలమైన నిబద్ధత మహిళాశిశు సంక్షేమ మంత్రిత్వ శాఖకు మార్గదర్శక శక్తిగా మారింది. వికసిత్ భారత్‌ఏ2047 కోసం మా సమష్టి లక్ష్యాన్ని ఇది నిర్దేశిస్తుంది. గత సంవత్సరం నవంబర్ 27న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బాల్ వివాహ్ ముక్త్ భారత్ ప్రచారాన్ని ప్రారంభించడం ఈ ప్రయాణంలో ఒక ముఖ్యమైన ముందడుగు.

మా ధైర్యమైన, అచంచలమైన దృక్పథంతో మేం 2030 నాటికి బాల్య వివాహాలను అంతం చేయాలనే మా జాతీయ నిబద్ధతను పునరుద్ఘాటించాం. తద్వారా ప్రతి అమ్మాయి, అబ్బాయి సురక్షితంగా పెరగవచ్చు, వారి విద్యను కొనసాగించవచ్చు, వారి భవిష్యత్తును గర్వంగా, నమ్మకంగా రూపొందించుకోవచ్చు. మొదటి నుంచీ, 'మొత్తం ప్రభుత్వం, మొత్తం సమాజం' విధానాన్ని మేం అనుసరించాం. ఈ సవాలును విధానం ద్వారా మాత్రమే అధిగమించలేమని గుర్తించాం. దీనికి సమష్టి బలం అవసరం - కుటుంబాలు, సంఘాలు, ఫ్రంట్‌లైన్ కార్మికులు, సంస్థలు, ప్రభుత్వం శతాబ్దాల నాటి ఈ దురాచారాన్ని విచ్ఛిన్నం చేయడానికి, ప్రతి బిడ్డ ఆకాంక్షలను రక్షించడానికి భుజం భుజం కలిపి నిలబడాలి. మా ఉమ్మడి సంకల్పానికి శక్తిమంతమైన చేయూతగా గ్రామాలు, పట్టణాల్లోని కోట్లాది మంది బాల్య వివాహాల అంతం కోసం ప్రతిజ్ఞ చేయడానికి ముందుకు వచ్చారు.

**బాల్య వివాహాలు లేని భారత్ కోసం 'మొత్తం ప్రభుత్వం' కలిసి వస్తుంది**

మన దేశం తరతరాలుగా వారసత్వంగా పొందిన, సమాజంలో అత్యంత లోతుగా పాతుకుపోయిన సవాళ్లలో బాల్య వివాహం ఒకటి. విద్య, వనరులు, అవగాహన పరిమితంగా ఉన్న సమాజాల్లో ఇది తరచుగా కనిపిస్తుంది. కొరత, అసమాన అవకాశాల వల్ల ఏర్పడిన ఈ అంతరాలు ఈ ఆచారాన్ని కొనసాగించడానికి వీలు కల్పించాయి. దీని కారణంగా లెక్కలేనంత మంది పిల్లలు తమకు అర్హత గల ఉజ్వల భవిష్యత్తుకు దూరంగా ఉండిపోతున్నారు.

ఈ రోజు ఆ వాస్తవికత నిర్ణయాత్మకంగా, మెరుగ్గా మారుతోంది. ఒకప్పుడు ఈ ఆచారాన్ని పెంపొందించిన మూలాలను శ్రీ మోదీ ప్రభుత్వ హయంలో మేం పరిష్కరిస్తున్నాం. స్పష్టమైన విధాన దిశానిర్దేశం, చక్కగా రూపొందించిన పథకాలు, పాలనపై నమ్మకాన్ని పునరుద్ధరిస్తూ మహిళాశిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ విషయంలో ముందంజలో ఉంది. బాల్య వివాహాలు కొనసాగడానికి వీలు కల్పించిన పరిస్థితులను తొలగిస్తుంది. మనం చూస్తున్న పురోగతి ఉద్దేశపూర్వకంగా, నిశ్చయంగా రూపొందించినది. ఇది స్త్రీలు, పిల్లలను జాతీయ అభివృద్ధిలో కేంద్రంగా ఉంచే పాలనా నమూనా ద్వారా రూపొందించినది.

దుర్బలత్వానికి మూల కారణాలను పరిష్కరించేలా మేం కార్యక్రమాలను రూపొందించాం. ప్రతి హక్కు మారుమూల ప్రాంతాలకూ చేరేలా చూసుకోవడానికి మేం కట్టుబడి ఉన్నాం - మన దేశంలోని మారుమూల గ్రామం, కుగ్రామంలోనూ అత్యంత దుర్బలమైన పిల్లల జీవితాన్ని మేం మెరుగ్గా మార్చాలనుకుంటున్నాం. ప్రతి కార్యక్రమం స్త్రీలను, పిల్లలను ప్రతి దశలోని ప్రమాదాల నుంచి ఆదుకోవడానికి రూపొందించినదే. పుట్టబోయే బిడ్డ నుంచి కౌమారదశలో ఉన్న అమ్మాయి వరకు... జీవితంలోని ప్రతి దశలో వారిని రక్షించడం, తగిన ప్రాధాన్యం ఇవ్వడం, సాధికారత కల్పించడం కొనసాగుతుంది.

పోషణ్ ట్రాకర్, పోషణ్ భీ పడాయి భీ నుంచి సమగ్ర శిక్షా అభియాన్ వరకు... నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ నుంచి పీఎం విద్యాలక్ష్మి పథకం వరకు... ప్రతి కార్యక్రమం ప్రతి బిడ్డకు సురక్షితమైన, గౌరవప్రదమైన, సమానమైన భవిష్యత్తు కల్పించే రక్షణ కవచంగా, మార్గంగా పనిచేస్తుంది.

సమ్మిళితత్వానికి ఉత్ప్రేరకంగా సాంకేతికతను ఉపయోగించుకుంటూ... ది పోషన్ ట్రాకర్ - మంత్రిత్వ శాఖ ప్రధాన డిజిటల్ ప్లాట్‌ఫామ్ 14 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలను పాలిచ్చే తల్లులు, ఆరేళ్లలోపు పిల్లలు, కౌమార బాలికలతో సజావుగా అనుసంధానిస్తుంది. ఇది ఇప్పటికే దేశవ్యాప్తంగా 10.14 కోట్లకు పైగా లబ్ధిదారులకు బలమైన భద్రతా వలయాన్ని సృష్టించింది. ఈ డిజిటల్ సాధికారతకు అనుబంధంగా, పోషన్ భీ పడాయి భీ ఒక పరివర్తనాత్మక శిశు సంరక్షణ, విద్యా సంబంధిత కార్యక్రమంగా నిలుస్తుంది. ప్రాథమిక స్థాయికి ముందు దశలో ప్రతి బిడ్డ జీవితాంతం నేర్చుకోవడానికి పునాది వేసే సమగ్రమైన, అధిక-నాణ్యమైన విద్యను పొందేలా చేస్తుంది.

మా విధానాలు ఉద్దేశాన్ని మాత్రమే కాకుండా కార్యాచరణనూ ప్రతిబింబిస్తాయి. నిజమైన, స్థిరమైన బడ్జెట్ నిబద్ధతలు, లక్ష్య పెట్టుబడుల్లో సంస్కరణలను ప్రోత్సహించడం ద్వారా శ్రీ మోదీ ప్రభుత్వం... మన పిల్లలను ముఖ్యంగా బాల్యవివాహం వంటి మూఢాచారాల నుంచి రక్షించడం జాతీయ ప్రాధాన్యంగా భావిస్తున్నట్లు స్పష్టం చేసింది. 2025-26 సంవత్సరానికి రూ. 1,827 కోట్ల కేటాయింపుతో నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ కార్యక్రమం... బాల్యవివాహానికి అత్యంత ముఖ్య కారణాల్లో ఒకటైన సమస్యను పరిష్కరిస్తోంది. పేదరికం కారణంగా పిల్లలు ఎవరూ చదువు మానకుండా చూస్తుంది. ప్రధానమంత్రి విద్యాలక్ష్మి పథకం ఉన్నత విద్యను అభ్యసించే యువతులకు కీలకమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది.

ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన యువతను పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం ద్వారా... వారికి ఆర్థిక ప్రోత్సాహకాలు, ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలను అందిస్తూ ఈ భద్రతా వలయాన్ని మరింత బలోపేతం చేసింది. అదేవిధంగా పీఎం-దక్ష్ పథకం అణగారిన వర్గాలకు, ముఖ్యంగా బాల్యవివాహాలు ఎక్కువగా జరిగే ఎస్సీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ యువతకు సాధికారత కల్పిస్తుంది. వారికి నైపుణ్యాలు, అవకాశాలను అందించడం ద్వారా మేం సుసంపన్నమైన, స్వతంత్ర జీవితాలకు మార్గాలను సృష్టిస్తున్నాం. రాబోయే తరాలకు కొత్త ఉదాహరణను నిర్దేశిస్తున్నాం.

**ప్రభావం: బాల్య వివాహాలు లేని భారత్‌కు చేరువలో**

కొన్ని సంవత్సరాల కిందటి వరకు బాల్య వివాహాలను అంతం చేయాలనే ఆలోచన సుదూరంగా, అసాధ్యంగా అనిపించేది. ప్రస్తుతం భారత్ అది సుసాధ్యమేనని నిరూపించింది. స్పష్టమైన విధానాలు, స్థిరమైన చర్యలు, అట్టడుగు స్థాయి కేంద్రంగా సాగిన ప్రయత్నాలు, చెప్పుకోదగిన పురోగతి ద్వారా మేం ఆ నమ్మకాన్ని సవాలు చేశాం. మార్పు సాధ్యమనే కాకుండా... ఇప్పటికే ప్రారంభమైందనీ చూపించాం.

ఈ అపూర్వమైన మార్పు వేలాది చిన్న, పెద్ద దృఢ సంకల్ప ప్రయత్నాల ఫలితం. మా బాల్య వివాహ నిషేధ అధికారులు (సీఎంపీవోలు) ఈ మిషన్‌కు వెన్నెముకగా నిలిచారు. గత ఒక సంవత్సరంలోనే దేశవ్యాప్తంగా 37,000 కంటే ఎక్కువ సీఎంపీవోలను నియమించడం ద్వారా మేం మా ప్రయత్నాలను బలోపేతం చేశాం. అంగన్‌వాడీ కార్యకర్తలను సన్నద్ధం చేయడం, పంచాయతీలకు అధికారం ఇవ్వడం, జిల్లా పరిపాలన వ్యవస్థలను బాలల రక్షణ చట్టాల పరిజ్ఞానంతో బలోపేతం చేయడం ద్వారా... అత్యంత అణగారిన కుటుంబాలు కూడా ప్రభుత్వ పథకాలతో ముడిపడి ఉండేలా, పిల్లలను తిరిగి పాఠశాలకు తీసుకురావడానికి, బాల్య వివాహం వల్ల అనర్థాలను గురించి సమాజాలకు అవగాహన కలిగించడానికి మేం కృషి చేస్తున్నాం.

ఇప్పటివరకు బడి మానేసిన 6,30,000 మంది బాలికలను గుర్తించి, మేం వారిని తిరిగి తరగతి గదుల్లో చేర్చాం.

నిశ్శబ్దం నుంచి నివేదించడం వరకు... కళంకం నుంచి మద్దతు వరకు - దేశం మార్పును ఎంచుకుంటోంది. దీనిని మరింత కచ్చితత్వం, పారదర్శకత, ప్రభావంతో పరిష్కరించడానికి మేం తాజా సాంకేతిక పురోగతులను ఉపయోగించుకుంటున్నాం. బాల్ వివాహ్ ముక్త్ భారత్ పోర్టల్ ఈ పురోగతిని ప్రతిబింబిస్తుంది %-% ఇది దేశవ్యాప్తంగా బాల్య వివాహ నిషేధ అధికారుల సమాచారాన్ని ఒకచోట చేర్చే... కేసులను నివేదించడానికి సమర్థమైన యంత్రాంగాన్ని అందించే... సంబధిత వ్యక్తులందరికీ అవగాహనను బలోపేతం చేసే సమగ్ర వేదిక.

మొదటిసారిగా బాల్యవివాహాలు లేని భారత్ కల ఏకీకృత జాతీయ లక్ష్యంగా పరిణామం చెందింది. భారత ప్రభుత్వంలోని ప్రతి విభాగం, సమాజంలోని ప్రతి విభాగం సమష్టి లక్ష్యం, దృఢ సంకల్పంతో కలిసికట్టుగా కృషి చేస్తున్నాయి. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వం ద్వారా, ఈ రోజు మన పిల్లలను రక్షించడమే కాకుండా... వికసిత్ భారత్ సాకారం కోసం బలమైన, నమ్మకమైన, సాధికారత కలిగిన పునాదులు వేస్తున్నాం.

బాల్యవివాహాలకు వ్యతిరేకంగా దేశం తన సమష్టి పోరాటంలో నిర్ణయాత్మక మలుపును సమీపిస్తున్న తరుణంలో... ప్రతి బిడ్డను రక్షించడానికి, ప్రపంచవ్యాప్తంగా బాల్యవివాహాల ముప్పును అత్యవసరంగా, నిశ్చయంగా అంతం చేయడానికి పాలన, సమాజం ఎలా కలిసి పనిచేయవచ్చనే విషయంగా ప్రపంచానికి ఒక కొత్త నమూనాను అందిస్తున్నాం. ఈ పిల్లలు మనమంతా ఆకాంక్షిస్తున్న వికసిత్ భారత్ కోసం నిజమైన మార్గదర్శకులు, నిజమైన 'సారథులు'.

**(రచయిత భారత ప్రభుత్వ మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి).**

# రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి రాక్షస పాలన

**- చట్టాలను బేఖాతరు చేస్తున్న కాంగ్రెస్ నేతలు**
**- బిఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ ఆరోపణలు**



**హైదరాబాద్,నవంబర్27( వెలుతురు):**
రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి రాక్షస పాలన కొనసాగుతుందని, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ చట్టంలోని నిబంధనలను బేఖాతరు చేసి కాంగ్రెస్ నేతలు దుశ్చర్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొనసాగేది ప్రజా పాలన కాదని.. ప్రజా ప్రతీకార పాలన.. పోలీసు రాజ్యమని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి అనుచరులు మంత్రి సురేఖ ఓఎస్డీ సుమంత్ తో కలిసి దక్కన్ సిమెంట్ యజమానులను గన్నుతో బెదిరిస్తే వారిని కాపాడేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీపీకి లేఖ రాయగా రాత్రికి రాత్రే మంత్రి ఉత్తమ్, సీఎం రేవంత్‌లు టాస్క్‌ఫోర్స్ పోలీసులను మంత్రి సురేఖ ఇంటికి పంపించిన విషయం వాస్తవం కాదా ఆయన ప్రశ్నించారు. అయినప్పటికీ సుమంత్ ని అరెస్ట్ చేయలేదన్నారు. అలాంటప్పుడు చేయని నేరానికి అకారణంగా ఐదు రోజులు కర్ల రాజేశ్ పోలీసుల రిమాండ్‌లో ఉంటే ఈ నియోజకవర్గానికి బాధ్యత వహించే మంత్రి ఉత్తమ్ ఎందుకు లేఖ రాయలేదని ఆయన విమర్శించారు. ఆర్టికల్ 21 ప్రకారం రాజేశ్‌ని ఎందుకు కాపాడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో పేదల జీవితాలు లాకప్‌లోనే తెల్లారుతున్నాయన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ పేరు చెప్పాలని రాజేశ్‌ను పోలీసులు చిత్రహింసలు పెట్టారని అందువల్లే ఆయన మృతి చెందారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎత్తిపోతల పథకానికి రూ.5 కోట్ల ప్రాజెక్టును రాత్రికి రాత్రే రూ.50 కోట్లకు పెంచడం అవినీతి కాక మరేమిటన్నారు. ఏమాత్రం ప్రణాళిక లేకుండా కొడంగల్ నారాయణపేట ప్రాజెక్ట్‌కు రూ.4 వేల కోట్లు కేటాయించారని ఈ అంశంలో సీఎం రేవంత్ రెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయలేదన్నారు. ఎస్ఎల్‌బీసీ దుర్ఘటనలో 8 మంది సజీవ సమాధి అయ్యారని, ఇందుకు మంత్రి ఉత్తమ్‌పై కేసు పెట్టలేదన్నారు. రాజేశ్‌కు నేర చరిత్ర లేదని అతనొక్కడే కుటుంబానికి ఆధారమని, త్వరలో ఇల్లు నిర్మాణం చేయిస్తానని తెలిపారు. తన కుమారుడి ఆరోగ్యం బాగాలేదని రాజేశ్ తల్లి ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్తానని పోలీసుల ఎదుట నెత్తి నోరు బాదుకున్నప్పటికీ పోలీసులు వినలేదని, నాణ్యమైన వైద్యం అందించకుండా చంపారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆయనను అప్రూవర్‌గా తీసుకుని కేసును విచారించాల్సింది పోయి ఏకంగా చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని జీవించే హక్కును కాపాడుతానని చెబుతుంటే సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ప్రతిరోజు ప్రజా పాలన ఇందిరమ్మ పాలన అంటూ పేదలను చంపుతున్నారని, జీవించే హక్కును కాలరాస్తున్నారని మండిపడ్డారు. చేవెళ్ల సాక్షిగా దళితులను బాగా చూసుకుంటామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో వాగ్దానం చేయించి ఈరోజు ప్రాణాలు తీస్తున్నారన్నారు. ,292 ఎకరాల భూమిని ఆగమేఘాల మీద పాలసీ పేరుతో రూ.5 లక్షల కోట్ల కుంభకోణం చేసి ఆ భూమిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధికులకు కట్టబెట్టారన్నారు. కావాలనే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీకి చెందిన పేద వర్గాల అధికారులను ఏసీబీ అధికారులు అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేస్తున్నారని పేర్కొన్నారు. బడుగు వర్గాల అధికారులపై ఏసీబీ అధికారులు అక్రమ కేసులు బనాయిస్తుంటే ఆ సామాజిక వర్గాలకు చెందిన మంత్రులు అడ్లూరి భట్టి, వివేక్, రాజనర్సింహా ఏం చేస్తున్నారని దుయ్యబట్టారు.

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

**- సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ దిమ్మతిరగాలి**
**- మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి పిలుపు**



**నిజామాబాద్,నవంబర్27( వెలుతురు):**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి పిలుపునిచ్చారు. అలాగే 29న నిర్వహించే దీక్షా దివస్' ను విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అధికార పార్టీ తంటాలు పడుతోందని, బీసీ రిజర్వేషన్లు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. 42 శాతం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ చివరికి పంచాయతీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా లేకుండా చేసిందని ధ్వజమెత్తారు. ఇది ముమ్మాటికీ బీసీలకు ద్రోహం చేయడమేనని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలను అమలుచేయలేక, ఎన్నికలకు వెళ్లే ధైర్యంలేక న్యాయస్థానం చెప్పేవరకు చేసుకుందని విమర్శించారు. అందుకే పార్టీ గుర్తులు లేని పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తోందని, ఎవరు గెలిచినా తమవాళ్లే అని చెప్పుకోవడం కోసం ఈ తతంగం చేస్తోందని ధ్వజమెత్తారు. ఉమ్మడి జిల్లాలో గులాబీ పార్టీకి మంచి పట్టుందని, స్థానిక ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలొచ్చినా గులాబీ జెండా ఎగరడం ఖాయమని తేల్చిచెప్పారు. 29న జరిగే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రెండేళ్లలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన మోసపు హామీలను అలాగే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గత పదేండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో ఓట్లను అభ్యర్థించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయక పోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారన్నారు. రైతుల ధాన్యం కొనుగోలు చేయకుండా లారీకి 1.5 క్వింటాలు కోతలు పెట్టి వేధిస్తున్నారన్నారు. కేసీఆర్ 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారని, రేపంత్ ప్రభుత్వం మాత్రం సంఘబంద సభ్యులకే చీరెలు పంపిణీ చేస్తుండడంతో హహిళలు గ్రామాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు కాలయాపన చేయడంతో గ్రామాలు నిర్వీర్యం అయ్యాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సర్వేలో బీఆర్ఎస్ పార్టీకే ప్రజలు మొగ్గు చూపుతున్నట్లు తేలిందన్నారు. పార్టీ శ్రేణులంతా ఐక్యమత్యంగా పనిచేసి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించు కోవాలని పేర్కొన్నారు.

# మర్డర్‌ను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ

**- దర్యాప్తులో హత్యగా తేల్చిన పోలీసులు**
**- గద్వాల జిల్లాలో మాజీ సర్పంచ్ హత్య కేసు ఛేదన**

**గద్వాల,నవంబర్ 27( వెలుతురు):**
ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓ మాజీ సర్పంచ్ కేసును పోలీసులు ఛేదించారు. ఇది హత్యగా ధృవీకరించారు. ఓ పక్కా ప్లాన్ ప్రకారం మాజీ సర్పంచ్‌ను మట్టుపెట్టారని గుర్తించారు. బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ మాజీ సర్పంచి ఇటీవల ప్రాణాలు కోల్పోయారు. అంతా రోడ్డు ప్రమాదమని భావించారు. కుటుంబ సభ్యులు మాత్రం ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా అనుమానించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టి వారం రోజుల్లో కేసును ఛేదించారు. పైకి కనిపిస్తున్నట్లు అది ప్రమాదం కాదని.. రూ.25 లక్షలు సుపారీ ఒప్పందం కుదుర్చుకుని, నెల రోజులు రెక్కీ నిర్వహించి.. పక్కా ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా నిర్ధరించారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం నందిన్నె మాజీ సర్పంచి చిన్నభీమ రాయుడిని సుపారీ గ్యాంగ్‌తో హత్య చేయించడం జిల్లాలో సంచలనం రేపింది. కేసు వివరాలను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈనెల 21న నందిన్నె మాజీ సర్పంచి చిన్నభీమ రాయుడు ద్విచక్ర వాహనంపై గద్వాల నుంచి సొంతూరు నందిన్నెకు బయల్దేరారు. వెనుక నుంచి వచ్చిన బొలెరో ఆయన్ను బలంగా ఢీకొట్టింది. కొద్ది దూరం వాహనం సహా లాక్కెళ్లింది. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బొలెరో ముందు భాగంలో బైక్ ఇరుక్కు



పోయింది. దీంతో డ్రైవర్ సహా.. అందులో ఉన్నవారంతా పరారయ్యారు. ఈ ఘటనను తొలుత ప్రమాదంగా భావించారు. కానీ, కుటుంబ సభ్యులు మాత్రం ప్రమాదం జరిగిన తీరు చూసి ఉద్దేశ్య పూర్వకంగానే ఢీ కొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు వారం రోజుల్లో ప్రమాదం వెనక మిస్టరీని ఛేదించారు. రూ.25లక్షల సుపారీ కుదుర్చుకుని పక్కా ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా పోలీసులు నిర్ధరించారు. నందిన్నె గ్రామానికి చెందిన మిల్లు వీరన్న అలియాస్ కురువ వీరన్నకు.. మృతుడు చిన్నభీమ రాయుడికి మధ్య భూ వివాదాలు, రాజకీయ కక్షలు ఉన్నాయి. వీరన్న రైస్ మిల్లులో అక్రమాలపై అధికారులు సోదాలు నిర్వహించి కేసు నమోదు చేశారు. దీంతో చిన్నభీమ రాయుడిపై వీరన్న మరింత కక్ష పెంచుకున్నాడు.

ఆయన్ను హత్య చేయించేందుకు కర్నూలుకు చెందిన ఈశ్వరయ్య గౌడ్‌తో రూ.25 లక్షలు సుపారీ ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. హత్యచేసి దాన్ని ప్రమాదంగా చిత్రీకరిస్తే నేరం తమపైకి రాకుండా ఉంటుందని ప్రణాళిక రచించాడు. నెలరోజులు రెక్కీ నిర్వహించారు. నాలుగుసార్లు హత్యాయత్నం చేసినా.. పరిస్థితులు అనుకూలించలేదు. ఈ నెల 21న అదునుచూసి జాంపల్లి బస్టాండ్‌కు సమీపంలో చిన్నభీమ రాయుడు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. చనిపోయాడని నిర్ధరించుకునే వరకూ బైక్ సహా ఈడ్చుకెళ్లారు. బైక్ ముందు భాగంలో ఇరుక్కుపోవడంతో అక్కడే వదిలేసి పరారయ్యారు. ఈ కేసులో మిల్లు వీరన్న సహా 10మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.


# మాక్ అసెంబ్లీతో కనువిప్పు కావాలి

**- జగన్‌కు యనమల చురకలు**

**అమరావతి,నవంబర్27( వెలుతురు):**
విద్యార్థుల మాక్ అసెంబ్లీ జగన్‌కు కనువిప్పు కావాలని మాజీ స్పీకర్, టిడిపి నేత యనమల రామకృష్ణుడు అన్నారు. సభలో ప్రతిపక్షం ఎలా వ్యవహరించిందో చూసైనా వైకాపా అధినేత జగన్ నేర్చుకోవాలని యనమల రామకృష్ణుడు హితవు పలికారు. చిన్న పిల్లలైనా ఎలాంటి తాత్కాలిక, శాశ్వత బహిష్కరణలకు తావివ్వకుండా, ప్రజా సమస్యలను సభలోనే ప్రస్తావిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించారని గుర్తుచేశారు. కనీసం ఇప్పటికైనా జగన్ అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలన్నారు. సభ వెలుపల మాట్లాడటం కంటే, ప్రజాప్రతినిధిగా సభలో హాజరై చర్చించడం ముఖ్యమని ఇప్పటికైనా తెలుసుకోవాలని సూచించారు. లేదంటే త్వరలోనే అర్హత కోల్పోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. బుధవారం అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో విద్యార్థులే ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి సభ నడిపిన విషయం తెలిసిందే.

## శ్రీలంక తీరంలో కేంద్రీకృతమైన తుపాన్

- తుఫాన్‌కు దిత్వాహ్‌గా నామకరణం
- మత్స్యకారులను అప్రమత్తం చేసిన అధికారులు
- ఏపిలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక




**విశాఖపట్నం,నవంబర్ 27( వెలుతురు):**

నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో తీవ్ర వాయుగుండం.. తుపానుగా మారిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ తుపానుకు 'దిత్వాహ్'గా యెమన్ దేశం నామకరణం చేసినట్టు అధికారులు తెలిపారు. ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరికి ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా తీరం వైపు గడిచిన 6 గంటల్లో గంటకు 15 కి.మీ వేగంతో తుపాను కదులు తోందని పేర్కొన్నారు. దిత్వాహ్ తుపాను శ్రీలంక ట్రింకోమలీకి 200 కి.మీ, పుదుచ్చేరికి 610 కి.మీ, చెన్నైకి ఆగ్నేయంగా 700 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఆదివారం తెల్లవారుజామున నైరుతి బంగాళాఖాతం ఆనుకుని తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాలకు చేరే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీంతో రాష్ట్రంలోని అన్ని ఓడరేవుల్లో రెండో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈనెల 30న ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశముందని రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆయా జిల్లాల్లో 20 సెం.మీకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశముందని విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.శ్రీలంకను అనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడింది. ఈ మేరకు విశాఖపట్నంలోని తుఫాన్ హెచ్చరికల కేంద్రం ఉన్నతాధికారి జగన్నాథ కుమార్ వెల్లడించారు. ఈ తుఫాన్ కారణంగా రానున్న వారం రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురుస్తాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు.. మరికొన్ని ప్రదేశాల్లో భారీ వర్షాల నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమయంలో తీరం వెంబడి గరిష్టంగా 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. కాబట్టి సముద్రంలో వేటకు వెళ్ళ వద్దని మత్స్యకారులను హెచ్చరించారు. తీరం వెంబడి ఉన్న పోర్టులో రెండో నెంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశామని జగన్నాథ కుమార్ వివరించారు. ఇక దిత్వా తుఫాన్ కారణంగా.. శనివారం నుంచి సోమవారం వరకు అంటే.. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయిన అంచనా వేస్తున్నారు. 29వ తేదీన అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఇక 30వ తేదీన నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం, వైఎస్ఆర్ కడప జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. తెలంగాణలో పూర్తిగా భిన్న పరిస్థితులు ఉన్నాయి. మొన్నటి వరకు తెలంగాణలో చలి తీవ్రత అధికంగా ఉంది. కానీ గత నాలుగు రోజులుగా ఈ తీవ్రత తగ్గింది.

## మూడు కొత్త జిల్లాలు..ఐదు రెవెన్యూ డివిజన్లు

**- నోటిఫికేషన్ జారీ చేసిన ఎపి ప్రభుత్వం**




**అమరావతి, నవంబర్27 ( వెలుతురు):**

రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాలతోపాటు ఐదు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అందుకు సంబంధించిన నోటిఫికేషన్లను ప్రభుత్వం గురువారం జారీ చేసింది. రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు మంగళవారం ఆమోదం తెలిపారు. మార్కాపురం, మదనపల్లె, రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 26 నుంచి 29కి పెరిగింది. కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు, ఒక మండలం ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. జిల్లాల పునర్విభజనపై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించిన అనంతరం సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి కొత్తగా పెద్దహరివనం మండలాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక రాష్ట్రంలో ఏర్పాటు కానున్న మూడు జిల్లాలను పరిశీలిస్తే.. రంపచోడవరం నియోజకవర్గంలోని రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లతో కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటు కానుంది. రంపచోడవరం రెవెన్యూ డివిజన్‌లో రంపచోడవరం, దేవీపట్నం, వై రామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాలు ఉండనున్నాయి. ఇక చింతూరు డివిజన్‌లో యెటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం మండలాలను చేర్చారు. ఎర్రగొండుపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లోని మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లతో కొత్త జిల్లాగా మార్కాపురం ఏర్పాటు కానుంది. ఈ రెవెన్యూ డివిజన్‌లోని యర్రగొండుపాలెం, పుల్లల చెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు తుర్లుపాడు, మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల మండలాలు, అలాగే కనిగిరి డివిజన్‌లోని హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి, పెదచెర్లోపల్లి, చంద్రశేఖరపురం, పామూరు, గిద్దలూరు, బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు మండలాలు కొత్తజిల్లాలో ఉండనున్నాయి. అలాగే ఇతర జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేయనున్నారు.

## కృష్ణా జలాలపై హక్కును వదులుకునే ప్రశ్నే లేదు

**- కేటాయింపులపై పునఃసమీక్షకు అంగీకరించేది లేదు**

**- కేంద్రం ముందు బలమైన వాదనలు వినిపించాలి**

**- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం**

**- జలవనరుల శాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా**

**అమరావతి, నవంబర్27 ( వెలుతురు):**

కృష్ణా నదీ జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ హక్కులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకునే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. జలాల కేటాయింపులపై ట్రైబ్యునల్ చేపట్టిన పునఃసమీక్షను అంగీకరించబోమని ఆయన తేల్చిచెప్పారు. అమరావతిలో జలవనరుల శాఖ అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ అంశంపై కేంద్రం వద్ద రాష్ట్ర వాదనలను బలంగా వినిపించాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. అయితే, వరదల సమయంలో వచ్చే నీటిని మాత్రం సామరస్యపూర్వక వాతావరణంలో పంచుకోవడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇది తెలుగు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

# అమరావతిని అద్భుత రాజధానిగా నిర్మాణం

- భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను మరువలేం
- అమరావతిలో స్వామి ఆలయానికి చంద్రబాబు శంకుస్థాపన
- రెండుదశల్లో రూ.260 కోట్లతో నిర్మిస్తామని ప్రకటన





**అమరావతి,నవంబర్27( వెలుతురు):**

దేవతల రాజధాని అమరావతి అయితే... ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మనం నిర్మించుకుంటున్న రాజధాని అంతలా ఉంటుందని అన్నారు. అన్ని అడ్డంకులు అధిగమించి ముందుకు సాగుతున్నామని అన్నారు. రాజధానిలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు సీఎం చంద్రబాబు గురువారం భూమి పూజ చేశారు. అనంతరం ఓం నమో వేంకటేశాయ అంటూ సీఎం చంద్రబాబు ఉపన్యాసాన్ని ప్రారంభించారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఈ యుగంలో ఏపీలో అవతరించారన్నారు. 2019లో ఆలయాన్ని నిర్మించాలని సంకల్పం చేశామని గుర్తుచేశారు. ఈ ప్రాంతానికి పేరు పెట్టినప్పుడే వేంకటేశ్వర స్వామి తన ద్వారా సంకల్పించారని తెలిపారు. ఇక్కడి రైతాంగం 29 వేల మంది 33,000 ఎకరాల భూమిని స్వచ్ఛందం గా ఇచ్చారని.. వారిని అభినందిస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. వారికి ఆ సంకల్పాన్ని వేంకటేశ్వర స్వామి కల్పించారన్నారు. కృష్ణానది తీరాన పవిత్రమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్మితమైందని తెలిపారు. 1983లో తిరుమలలో అన్నదానాన్ని ఎన్టీఆర్ ప్రారంభిస్తే.. 2003లో ప్రాణదానం కార్యక్రమాన్ని స్విమ్స్‌లో ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 'మా ఇంటి దైవం వేంకటేశ్వర స్వామి... మా ఇంటి నుంచి చూస్తే ఆయన నామాలు కనిపిస్తాయి' అని చెప్పుకొచ్చారు. ఎప్పుడూ కూడా వేంకటేశ్వర స్వామికి అప్రతిష్ట పాలు తెచ్చే పనిని చెయ్యనని.... ఎవరినీ చేయనివ్వనని స్పష్టం చేశారు. వేంకటేశ్వర స్వామి వద్దకు ఎప్పుడు వెళ్ళినా క్యూ లైన్‌లోనే వెళతానని తెలిపారు. ముఖ్యమంత్రిగా కాదు... భక్తుడిగా వెళతానని సీఎం అన్నారు. కొందరు తప్పులు చేస్తారని.. తప్పు చేసిన వారికి ఇంకో జన్మలో శిక్ష ఉంటుందను కుంటారని.. అయితే తప్పు చేస్తే మాత్రం వేంకటేశ్వర స్వామి ఈ జన్మలోనే శిక్షిస్తారన్నారు. గడచిన ప్రభుత్వం విధ్వంసం తప్ప మంచి చేసిన పరిస్థితులు లేవని విమర్శించారు. ఐదేళ్లు ఇక్కడ రైతులకు నరకాన్ని చూపించారన్నారు. వేంకటేశ్వర స్వామిని రైతులు నమ్ముకున్నారని.. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు పాదయాత్ర చేసిన ఈ ప్రాంత రైతులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ దేవాలయాన్ని రూ.260 కోట్లతో పూర్తి చేస్తామన్నారు. తిరుపతి ప్రాంగణం తరహాలోనే ఇక్కడ గుడిని నిర్మిస్తామని.. రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. దేవాలయాల నిర్మాణానికి దాతలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యం, ఆనందం, సంపద ప్రతి ఒక్కరికి అందించాలని వేంకటేశ్వర స్వామి ప్రార్థిస్తున్నానని అన్నారు. దేవతల రాజధాని అమరావతి నమూనాగా ఈ అమరావతి ఉండాలని వేంకటేశ్వర స్వామిని కోరుతున్నట్లు తెలిపారు. రెండు దశల్లో రూ.260 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు జరుగనున్నాయి. ఆలయ ప్రాకారం, మహా రాజగోపురం, మండపాలు, ఆంజనేయస్వామి ఆలయాల నిర్మాణం జరుగనుంది. మాడ వీధులు, అన్నదాన కాంప్లెక్స్ తదితర నిర్మాణాలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. మొదటి దశలో రూ.140 కోట్లు వ్యయంతో వివిధ పనులు నిర్వహించనున్నారు. రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ మహాప్రాకారం నిర్మాణం జరుగనుంది. ఏడంతస్తుల మహా రాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయ స్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్‌ల నిర్మించనుండగా.. వీటి నిర్మాణాలకు రూ.48 కోట్లు ఖర్చు చేయనున్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రి నారాయణ, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, టీటీడీ బోర్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు. ఇందులో రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారాన్ని నిర్మిస్తారు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం శ్రీవారి ఆలయాన్ని రూ.185 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయగా 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా.. దానిని రూ.36 కోట్లకు కుదించింది. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి.. ఆలయాన్ని 2014-19 నాటి ప్రణాళికను మించి సకల హంగులతో అభివృద్ధి చేసేందుకు అడుగు ముందుకేసింది.

# రైతులపై మొసలి కన్నీరు ఆపండి

**- మీ ఐదేళ్ల పాలనలో ఎలా ఉండేదో తెలుసు**

**- రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాం**

**- 24గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తున్నాం**

**- వైసిపి నేతల విమర్శలను తిప్పికొట్టిన మంత్రి నాదెండ్ల**



**విజయవాడ,నవంబర్ 27( వెలుతురు):**

ఐదేళ్ల పాటు రైతులను కనీసంగా కూడా పట్టించుకోని వైకాపా ఇప్పుడు రైతుల గురించి మొసలి కన్నీరు కార్చడం వింతగా ఉందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. ధాన్యం సేకరణ మొదలు, వారికి వివిధ రకాల సాయం అందించడంలో గత ఐదేళ్లలో ఎలా ఉండేదో రైతులే చెబుతారని అన్నారు. రైతులకు రూపాయి నష్టం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ మంత్రి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 24 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని.. అయినా వైసీపీ నేతలు అన్యాయంగా అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.1674 కోట్లు బకాయిలు పెట్టి పారిపోయిన వైసీపీ నేతలా రైతుల పక్షాన మాట్లాడేది అంట్యూ ÷ర్ అయ్యారు. ఇప్పటి వరకు 8 లక్షల 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వెల్లడించారు. కృష్ణా జిల్లాలో లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం రికార్డ్ అని తెలిపారు. గోదావరి జిల్లాల నుంచి లక్ష టన్నుల పైనే ధాన్యం సేకరించామని చెప్పారు. అధికారులు రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్నారని.. వారి మనోధైర్యం దెబ్బ తీసేలా వైసీపీ నేతలు నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కృష్ణా జిల్లాలో 2022-23 ఖరీఫ్‌లో కేవలం 13వేల 560 మెట్రిక్ టన్నులు ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని.. 2023-24లో 16 వేల 978 మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారని తెలిపారు. తాము మాత్రం లక్షా 7 వేల 960 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని చెప్పుకొచ్చారు. ఖరీఫ్, రబీలో కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల్లో ట్రాన్స్ పోర్టు వాహనాల బకాయిలు నేడు రూ.9 కోట్లు చెల్లించామని మంత్రి చెప్పారు. 7 కోట్ల 53 లక్షల గోనె సంచులను ఏర్పాటు చేశామన్నారు. సీఎం సూచనలతో లక్ష సంచులు అదనంగా సిద్ధంగా ఉంచామని తెలిపారు. మూడు నెలల్లో జరగాల్సిన పక్రియ.. వాతవరణంలో వచ్చిన మార్పులతో ముందే ధాన్యం సేకరించామని చెప్పుకొచ్చారు. రైతుల ఆందోళనను గుర్తించి.. ప్రభుత్వం చాలా వేగంగా స్పందించిందన్నారు. రైతులు కూడా అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి ఇంత పెద్ద కార్యక్రమం చేస్తున్నామంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చే సూచనలు, ప్రోత్సాహం వల్లే అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కొంతమంది మాఫియాగా ఏర్పడి రైతులను ఇబ్బందులు పెట్టడానికి వారి స్వలాభం కోసం డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. తాము పూర్తి పారదర్శకత కోసం వాహనాలకు జీపీయస్ ఏర్పాటు చేస్తే.. దళారులు రైతులను మాయ మాటలతో మోసం చేస్తున్నారన్నారు.

# మతం కంటే మానవత్వమే గొప్పది

**- మతం ఏదైనా మానవత్వం మర్చిపోకూడదు**

**- ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్**

**- మంగళగిరిలో మసీద్‌ను ప్రారంభించిన మంత్రి**



**అమరావతి,నవంబర్27( వెలుతురు):**

మతం ఏదైనా మానవత్వాన్ని ఎన్నడూ మరవకూడదని, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సేవ అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. యువత భవిష్యత్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, రాష్ట్ర, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం మంగళగిరిలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న పావురాల కాలనీలో నూతనంగా నిర్మించిన 'నూర్ మసీద్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మస్జీద్‌ను ప్రారంభించి, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "మంగళగిరి ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం నాకు దక్కింది. నాకున్న శక్తి మేరకు సేవ చేస్తున్నాను. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి రాష్ట్ర ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. మనతో ఉన్నవారిని పైకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. సమాజంలో ఇంకా పేదరికం ఉంది, దానిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని అన్నారు. తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ, "2019లో దేవుడు నాకు ఒక కఠినమైన పరీక్ష పెట్టాడు. చాలామంది నన్ను ఎగతాళి చేశారు. కానీ, అదే దేవుడు నాకు శక్తిని, పట్టుదలని ఇచ్చాడు. క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తే విజయం తప్పక వరిస్తుంది. కష్టాలు అందరికీ వస్తాయి, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి" అని యువతకు స్ఫూర్తినిచ్చారు. కాలం మారిందని, యువత చదువుపై దృష్టి సారించి భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. 2047 నాటికి దేశాన్ని అగ్రస్థానంలో నిలపాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా అందరూ పనిచేయాలని లోకేశ్ కోరారు. "మెరుగైన సమాజ నిర్మాణం కోసం నైతిక విలువలు చాలా అవసరం. ముఖ్యంగా మహిళలను గౌరవించాలి. మన మధ్య విభేదాలు సృష్టించడానికి కొందరు ప్రయత్నిస్తుంటారు, అలాంటి వాటికి తావివ్వకుండా ప్రశాంతంగా ఉండాలి. ప్రజలు నా పనిని గుర్తించినప్పుడే నాకు కొండంత బలం. అందరికీ అండగా ఉంటూ, కలిసికట్టుగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేద్దాం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ నేత పోతినేని శ్రీనివాసరావు, మసీదు వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మహమ్మద్ అలీ, కమిటీ సభ్యులు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# ' ఛాంపియన్ ' భారీ అంచనాలు

హీరో శ్రీకాంత్ కుమారుడు రోషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఛాంపియన్' నుంచి ఫస్ట్ సింగిల్ 'గిరా గిరా' విడుదలైంది. మిక్కీ జే మేయర్ స్వరాలు, రామ్ మిరియాల గానం, కాసర్ల శ్యామ్ సాహిత్యం ఈ గ్రామీణ సాంగ్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిత్రంలో రోషన్ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా కనిపిస్తుండగా, హీరోయిన్ అనస్వర రాజన్ 'తాళ్లపూడి చంద్రకళ'గా పరిచయమవుతోంది. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదల కానుంది. సీనియర్ నటుడు శ్రీకాంత్ తనయుడిగా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి హీరోగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు మేక రోషన్ . 'పెళ్లిసందడి'తో మంచి గుర్తింపు తెచ్చుకున్న అతడు నటనలో మెరుగులు దిద్దుకుంటూ క్రమంగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇప్పుడు ఆయన కెరీర్‌లో కీలక అడుగుగా భావిస్తున్న పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా ' ఛాంపియన్ ' భారీ అంచనాల నడుమ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రోషన్ నటించడం ఆసక్తిగా మారింది. ప్రదీప్ అద్వైత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'ఛాంపియన్' చిత్రాన్ని స్వప్న సినిమాస్, జీ స్టూడియోస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీని రేపింది. పీరియాడిక్ వాతావరణం, గ్రామీణ నేపథ్యం, స్పోర్ట్స్ ఎమోషన్స్ అన్నీ కలిసి ఈ సినిమా యూత్ మరియు ఫ్యామిలీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకునేలా కనిపిస్తోంది. తాజాగా మూవీ టీమ్ ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసింది. 'గిర గిర గిరగింగిరా గిరే' అనే ఈ గ్రామీణ మట్టివాసనతో నిండిన పాట మట్టిలో పెరిగిన మనుషుల నైజం, వారి రోజువారీ జీవితాలను సహజంగా చూపిస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ ఈ సాంగ్‌కు స్వరాలు సమకూర్చగా, రామ్ మిరియాల తనదైన భిన్నమైన ఫోక్ స్టైల్‌తో పాటకు ప్రాణం పోశాడు. కాసర్ల శ్యామ్ రాసిన సాహిత్యం గ్రామీణ వాతావరణాన్ని అచ్చుగుద్దినట్టు ప్రతిబింబించింది.



# ఎల్లమ్మ సినిమా చేయడం లేదు

సౌత్ ఇండియన్ స్టార్ నటి కీర్తి సురేష్ చాలాకాలం తర్వాత మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆమె చివరిగా నటించిన పెద్ద తెలుగు సినిమా మెగాస్టార్ చిరంజీవితో చేసిన 'భోళా శంకర్'. ఆ తర్వాత 2025లో సుహాస్‌తో చేసిన ఉప్పు కప్పురంబు విడుదలైనప్పటికీ, ఆ చిత్రం వచ్చిన సంగతే చాలా మందికి తెలియకుండా పోయింది. అవకాశాలు తగ్గాయా? లేక ఆమెకే ఆసక్తి తగ్గిందా? అనేది స్పష్టంగా తెలియకపోయినా, కీర్తి సురేష్ కొంతకాలంగా తెలుగు సినిమాల్లో కనిపించలేదు. దాదాపు విరామం తర్వాత కీర్తి సురేష్ నటిస్తున్న తాజా చిత్రం 'రివాల్వర్ రీటా'. దర్శకుడు చంద్రు రూపొందించిన ఈ లేడీ ఓరియెంటెడ్ మూవీ తెలుగులో కూడా విడుదల కానుంది. డైరెక్ట్ తెలుగు సినిమాతో కాకుండా, డబ్బింగ్ వెర్షన్‌తో తెలుగువారిని ఆకట్టుకోవడానికి కీర్తి సిద్ధమవుతోంది. తాజాగా రివాల్వర్ రీటా ప్రమోషన్ కోసం తెలుగులో ప్రెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంలో సినిమా వివరాలతో పాటు రాబోయే ప్రాజెక్టుల గురించి కూడా కీర్తి సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఒక రిపోర్టర్ చాలా కాలంగా ప్రచారంలో ఉన్న 'ఎల్లమ్మ' సినిమా గురించి ప్రశ్నించాడు. 'ఎల్లమ్మ సినిమాలో హీరోయిన్‌గా మీరు నటిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయం నిజమేనా? అని అడిగాడు. దీనికి కీర్తి స్పష్టంగా స్పందిస్తూ లేదు... నేను 'ఎల్లమ్మ' సినిమా చేయడం లేదని స్పష్టం చేసింది. 'ఎల్లమ్మ' చిత్రానికి కేవలం హీరోయిన్ ఎంపికలోనే కాదు, హీరో విషయంలో కూడా ఇప్పటివరకు స్పష్టత రాలేదు. నాని, శర్వానంద్, నితిన్, బెల్లంకొండ శ్రీనివాస్ వంటి పలువురు నటుల పేర్లు వినిపించగా, తాజాగా సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ పేరు కూడా చర్చలోకి వచ్చింది. అయినప్పటికీ, ఈ ప్రాజెక్ట్‌లో నిజంగా ఎవరు హీరోగా నటిస్తారు, ఎవరు హీరోయిన్‌గా ఉంటారు అన్నది ఇంకా తెలియరాలేదు. హీరోయిన్‌గా కీర్తి సురేష్ లేదన్న సంగతి మాత్రం స్పష్టమైంది. ఇక ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుంది? నటీనటుల అధికారిక జాబితా ఎప్పుడెప్పుడు బయటకు వస్తుంది? అనేదానిపై మేకర్స్ నుంచి ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.




# ట్రోలర్స్‌కు ఇచ్చిపడేసింది

సెలబ్రెటీల లైఫ్ లో సోషల్ మీడియా పెద్ద పాత్ర పోషిస్తుంది. సినిమా సెలబ్రెటీలకు సోషల్ మీడియాలో ఎంత క్రేజ్ ఉంటుందో.. దాని వల్ల నష్టం కూడా అంతే ఉంటుంది. సోషల్ మీడియా ద్వారా చాలా మంది సెలబ్రెటీలు, ముఖ్యంగా హీరోయిన్స్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతే కాదు హీరోయిన్స్ చాలా మంది లేనిపోని వివాదాల్లో ఇరుక్కుంటూ ఉంటారు. దాంతో సోషల్ మీడియాలో నెటిజన్స్ ఓ రేంజ్‌లో ట్రోల్స్ చేస్తూ ఉంటారు. వివాదాస్పద కామెంట్స్ చేసో లేక, వింత డ్రస్సుల వల్లో ఎదో ఒకరకంగా ట్రోల్స్ కు గురవుతూ ఉంటారు. కొంతమంది హీరోయిన్స్ తమ డ్రస్సింగ్ కారణంగా ట్రోల్స్ బారిన పడుతూ ఉంటారు. మరికొంతమంది సర్జరీల విషయంలో ట్రోల్ చేస్తుంటారు తాజాగా ఓ హీరోయిన్ ను సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేశారు. సర్జరీల విషయంలో హీరోయిన్ పై ట్రోల్స్.. దానికి ఆ స్టార్ హీరోయిన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అందాల భామ శ్రుతీహాసన్ ఆచితూచి సినిమాలు చేస్తుంది. రీసెంట్ డేస్ లో వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ హిట్స్ అందుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. కెరీర్ బిగినింగ్‌లో సక్సెస్ కోసం ఎంతగానో ఎదురుచూసిన శ్రుతిహాసన్ ఆ తర్వాత వరుసగా విజయాలను అందుకుంది. తక్కువ సమయంలోనే ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది.



స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్‌కు అందుకుంటూ దూసుకుపోతుంది. తెలుగు తమిళ్ సినిమాల్లో హీరోయిన్‌గా రాణిస్తుంది శ్రుతిహాసన్.శ్రుతిహాసన్ అందం పై ట్రోల్స్ వినిపిస్తూ ఉంటాయి. ఆమె అందం కోసం సర్జరీ చేయించుకుందని.. అందుకే ఆమె ఇంత అందంగా ఉందని పలువురు ఆమె పై ట్రోల్స్ చేస్తున్నారు. తాజాగా ఆ ట్రోల్స్ పై స్పందించింది శ్రుతి.. రైనో ప్లాస్టి అనే సర్జరీ గురించి, అలాగే లిప్ ఫిల్లర్స్ గురించి మాట్లాడింది. ఇది నా శరీరం, నా ఇష్టం అలానే నాకు నచ్చిన నిర్ణయం నేను తీసుకుంటాను అని చెప్పుకొచ్చింది శృతిహాసన్.అలాగే రైనో ప్లాస్టి అనేది ముక్కుకు చేసే సర్జరీ.. అంది అందం కోసమే కాదు అంతకు ముందు నా ముక్కుకు గాయం అయ్యింది అనికోసమే సర్జరీ చేయించుకున్నా అని తెలిపింది శ్రుతి.




# వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదు

## కుటుంబ వివాదంపై స్పందించిన మంచు లక్ష్మి

తన కుటుంబంలో ఇలాంటి వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదని నటి మంచు లక్ష్మి స్పష్టం చేశారు. సినిమా ప్రచారాల కోసం ఇచ్చే ఇంటర్వ్యూలకు తప్ప, ప్రత్యేకంగా వ్యక్తిగత చర్చల కోసం మాట్లాడటానికి పెద్దగా ఆసక్తి చూపబోనని తెలిపారు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె, తల్లి–సోదరి–కుమార్తెగా తన పాత్రల గురించి మాట్లాడుతూ, తల్లిగా మాత్రం తనను తాను 10కి 10 మార్కులు వేసుకుంటానని చెప్పింది. మంచు కుటుంబంలో జరిగిన విభేదాలపై కూడా ఆమె స్పందించారు. 'దేవుడు ప్రత్యక్షమై ఒక వరం కోరుకోమంటే... మా కుటుంబం మళ్లీ మునుపటిలాగే ఒక్కటిగా మారాలని మాత్రమే అడుగుతానని అన్నారు. ప్రతి కుటుంబంలోనూ గొడవలు ఉండటం సహజమే అయినా, ఎంత విభేదాలు వచ్చినా చివరకు అందరూ కలిసే ఉండాలనే భావన మనసులో నిలిచి ఉండాలని ఆమె పేర్కొన్నారు. భారతీయ కుటుంబాల్లో మాత్రం కొన్ని సందర్భాల్లో కలహాలు జీవితాంతం విరిగిపోనివ్వాలని భావించే ధోరణి కనిపిస్తుందని, అది సరికాదని వ్యాఖ్యానించారు. 'చివరికి మనకుండేది రక్తసంబంధీకులే. కుటుంబాన్ని కలిసి ఉంచేందుకు అవసరమైన పోరాటం చేయాలిబీ దూరం పెంచుకోవడం మాత్రం ఎప్పుడూ సరైంది కాదని తెలిపారు. 'నేను ముంబయిలో ఉన్నాను. ఇక్కడి పరిస్థితులు తెలిసినా బాధపడలేదని కొందరు వార్తల్లో రాశారు. కానీ నేను పొందిన బాధను నాకు మాత్రమే తెలుసనని మంచు లక్ష్మి చెప్పారు. వివాదాలపై తాను మాట్లాడకపోవడంతో, కొందరు తమకు నచ్చినట్లుగా ఊహాగానాలు సృష్టించారని చెప్పారు. అది నా వ్యక్తిగత విషయం. ఇలాంటి సమస్యలు వస్తాయని నేను ఊహించలేదు. వాటిని చూసి షాక్ అయ్యాను. నా కుటుంబం గురించి నేను అనుకున్నది, ఆ పరిస్థితుల్లో నాకు కలిగిన బాధ బయటివాళ్లకు చెప్పాల్సిన అవసరం లేదని భావించానని ఆమె వ్యాఖ్యానించారు.



# విజయ్ దేవరకొండ సినిమాపై ఆసక్తి పెరుగుతోంది

విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ కాంబోలో వస్తున్న 'వీడీ 14' సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. బ్రిటీష్ ఇండియా నేపథ్యంలో, 19వ శతాబ్దపు యదార్థ సంఘటనల ఆధారంగా ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాని తెరకెక్కిస్తున్నారు. ఇందులో రష్మిక మందన హీరోయిన్ గా నటిస్తున్నట్లు సమాచారం. హాలీవుడ్ స్టార్ ఆర్నాల్డ్ వోస్లూ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఈ విషయాన్ని ధృవీకరించే ఓ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ కాంబోలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి 'వీడీ 14' అనే వర్కింగ్ టైటిల్ తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో భారీ బడ్జెట్ తో తీస్తున్నారు. ఇందులో స్టార్ కాస్టింగ్, టెక్నిషియన్స్ భాగం అవుతున్నారు. రెండున్నరేళ్లపాటు ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ మీద వర్క్ చేసిన రాహుల్.. సైలెంట్ గా షూటింగ్ కానిచ్చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఓ కీలక సమాచారం బయటకు వచ్చింది. 'వీడీ 14' అనేది బ్రిటీష్ ఇండియా నేపథ్యంలో రూపొందే పీరియాడిక్ యాక్షన్ డ్రామా అని తెలుస్తోంది. 19వ శతాబ్దంలో 1854 నుంచి 1878 మధ్య కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో విజయ్ దేవరకొండ క్యారెక్టరైజేషన్, ఆయన గెటప్ చాలా కొత్తగా ఉంటాయని టాక్. ఇక ఈ సినిమాలో 'మమ్మీ' విలన్ ఆర్నాల్డ్ వోస్లూ నటిస్తున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. కనే మేకర్స్ అధికారికంగా ప్రకటించలేదు. అయితే ఇప్పుడు ఈ విషయాన్ని ధృవీకరించే ఓ ఫోటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. విజయ్ దేవరకొండ సినిమాలో సౌత్ ఆఫ్రికన్ స్టార్ ఆర్నాల్డ్ వోస్లూ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఆయన ఇప్పటికే 'వీడీ 14' షూటింగ్ లో జాయిన్ అయినట్లు తెలుస్తోంది. సెట్స్ లో తమిళ యాక్టర్ వినోద్ సాగర్, ఆర్నాల్డ్ కలిసి దిగిన ఓ ఫోటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. దీంతో హాలీవుడ్ స్టార్ ఈ సినిమాలో నటిస్తున్నారనే విషయం కన్ఫార్మ్ అయింది. ఆయన ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నారో అనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరిగిపోయింది.

# ఢిల్లీలో ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్

**- డ్రగ్ కార్టెల్‌లో ఉన్న 50మంది నైజీరియన్ల అరెస్ట్**



**హైదరాబాద్,నవంబర్ 27( వెలుతురు):**
దేశరాజధాని ఢిల్లీ తెలంగాణ ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టి డ్రగ్ కార్టెల్‌లో కీలక సభ్యులుగా ఉన్న 50 నైజీరియన్లను పట్టుకుంది. వీరంతా వీసా గడువు ముగిసినా మనదేశంలో తిష్టవేసి కూర్చుకున్నారు. మాదకద్రవ్యాలను అరికట్టేందుకు కృషిచేస్తున్న ఈగల్ పోలీసులు ఈ భారీ ఆపరేషన్లు పూర్తి చేశారు. ఢిల్లీ, గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఢిల్లీలో అక్కడి క్రైమ్ బ్రాంచ్ సమన్వయంతో ఈగల్ ఫోర్స్ మెగా ఆపరేషన్‌ను చేపట్టింది. ఈ సంయుక్త బృందంలో ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ నుంచి వందమంది అధికారులు, ఈగల్ ఫోర్స్ నుంచి 124 మంది అధికారులు పాల్గొన్నారు. మెహ్రౌలి, సంత్ నగర్, ప్రతాప్ ఎన్‌క్లేవ్, పృథ్వీ పార్క్, చంద్ర నగర్ తదితర 20కి పైగా ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. గడువు ముగిసిన వీసాలతో నివసిస్తున్న 50 మందికి పైగా నైజీరియన్లను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారంతా ఒక పెద్ద నైజీరియన్ డ్రగ్ కార్టెల్‌లో కీలక సభ్యులుగా ఉన్నట్లు గుర్తించారు. పలు ప్రాంతాల్లో భారీగా మాదకద్రవ్యాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నంలోనూ ఈగల్ ఫోర్స్ స్థానిక పోలీసుల సహకారంతో కీలక ఆపరేషన్లు చేపట్టింది. ఆయా ప్రాంతాల్లో డ్రగ్ కింగ్‌పిన్‌లను, సెక్స్ వర్కర్లుగా వ్యవహరిస్తూ డ్రగ్స్ విక్రయించే మహిళలు, మ్యూల్ ఖాతాదారులను గుర్తించింది. ముందస్తు పక్కా సమాచారంతో ఈగిల్ బృందం అక్కడి పోలీసుల సహకారంతో దీనిని చేపట్టింది. నైజీరియన్లను విచారిస్తే మరిన్ని వివరాలు రాబట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# ఐపిఎస్ అధికారి సంజయ్ సస్పెన్షన్ మరో ఆరు నెలలు పొడిగింపు

**అమరావతి,నవంబర్27( వెలుతురు):**
సీనియర్ ఐపీఎస్ అధికారి సంజయ్ సస్పెన్షన్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన సస్పెన్షన్‌ను మరో ఆరు నెలల పాటు పొడిగించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు గురువారం జారీ చేసింది. దీంతో వచ్చే ఏడాది మే నెలాఖరు వరకు సంజయ్‌పై సస్పెన్షన్ విధించినట్లు అయింది. సంజయ్ సస్పెన్షన్‌కు సంబంధించి గతంలో ఇచ్చిన ఉత్తర్వులు నవంబర్ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ÷ర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ ఎన్ సంజయ్ పని చేశారు. ఆ సమయంలో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక అందింది. దాంతో ఈ వ్యవహారంపై ఏసీబీ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఆ కొద్ది రోజులకే సంజయ్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ కేసులో అరెస్టయిన సంజయ్.. ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే.

# ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో అక్రమ దందాలు

**- ఏకకాలంలో ఇడి అధికారుల దాడులు**

**అమరావతి,నవంబర్27( వెలుతురు):**
మెడికల్ కాలేజీల్లో అవినీతి, అక్రమాలు భారీ ఎత్తున చోటు చేసుకుంటున్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీలపై ఈడీ అధికారులు గురువారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. గతంలో కొన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) పీజీ సీట్లు కేటాయింపులో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దాంతో ఇటీవల మెడికల్ కౌన్సిల్ సభ్యులతోపాటు మెడికల్ కాలేజీల ప్రతినిధులను సీబీఐ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. అనంతరం తాజాగా ఈడీ అధికారులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగి ఈ దాడులు నిర్వహించారు. మరో వైపు దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో సోదాలను ఈడీ అధికారులు చేపట్టారు. ఏపీ, తెలంగాణతో సహా 10 రాష్ట్రాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ తనిఖీల చేసే సమయంలో తాత్కాలిక ఏర్పాట్లతో మెడికల్ కాలేజీలు మాయ చేస్తున్నట్లు సీబీఐ తన సోదాల్లో గుర్తించింది. అలాగే ఎన్‌ఎంసీ ప్రమాణాలు పాటించకుండానే అనుమతులు పొందినట్లు ఈ సోదాల్లో కనుగొంది. దీంతో మెడికల్ కాలేజీలపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు.

# పార్లమెంట్ సమావేశాలపై టిడిపి వ్యూహం

**- పార్టీ ముఖ్యులతో సిఎం చంద్రబాబు సమీక్ష**

**అమరావతి,నవంబర్27( వెలుతురు):**
పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశమైంది. గురువారం రాజధాని అమరావతిలోని ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో పార్టీ ఎంపీలు, ముఖ్యనేతలతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, కేంద్రం నుంచి రావాల్సిన ప్రయోజనాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సందర్భంగా చర్చించారు. మరోవైపు ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోంది. దీంతో ఏపీలో అభివృద్ధికి కేంద్రం తన వంతు సహాయ సహకారాలు అందిస్తుంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. ఇవి డిసెంబర్ 19వ తేదీతో ముగుస్తాయి. 2014లో ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ తొలిసారి బాధ్యతలు చేపట్టారు. ఆయన అధికారం చేపట్టిన తర్వాత జరుగుతున్న శీతాకాల సమావేశాల్లో ఇది అత్యంత తక్కువ కాలం. అంటే కేవలం 19 రోజులు మాత్రమే ఈ సమావేశాలు జరగనున్నాయి.

# విద్యార్థుల మాక్ అసెంబ్లీపై యనమల ప్రశంసలు

**అమరావతి,నవంబర్27( వెలుతురు):**
చిన్న పిల్లలైనా చక్కగా అసెంబ్లీ నడిపారంటూ విద్యార్థుల మాక్ అసెంబ్లీపై టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ప్రశంసలు కురిపించారు. వాళ్లను చూసైనా మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ప్రజా సమస్యలపై ఎలా వ్యవహరించాలో నేర్చుకోవాలంటూ హితవు పలికారు. ఇప్పటికైనా అసెంబ్లీకి హాజరై ప్రజాసమస్యలపై చర్చించాలని జగన్ కు సూచించారు.ప్రజలకు ప్రతినిధిగా జనం సమస్యలపై బయటకన్నా సభలో మాట్లాడడం వల్ల ప్రయోజనం కలుగుతుందనే విషయాన్ని ఆయన గుర్తించాలన్నారు. లేదంటే త్వరలోనే అర్హత కోల్పోయే పరిస్థితి వస్తుందని జగన్ ను ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాక్ అసెంబ్లీ నడిపిన తీరును యనమల కొనియాడారు. ఎలాంటి బహిష్కరణలకు తావివ్వకుండా, ప్రజా సమస్యలను సభలోనే ప్రస్తావిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించారని మెచ్చుకున్నారు.

# తెలంగాణ ఉద్యమసత్తా చాటుదాం

**- దీక్షా దివస్‌తో రేవంత్‌కు బుద్ధి చెబుదాం**

**- మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపు**

**నిజామాబాద్,నవంబర్27( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్రం ఉనికిలో ఉన్నదని అంటే అది 29 నవంవర్ 2009 నాడు కేసీఆర్ చేసిన దీక్ష ఫలితమేనని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈసందర్భంగా దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు జీవన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిగలా గణెశిష్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ విజిగౌడ్, అయేషా,జిల్లా నాయకులు నూడా ప్రభాకర్, సిర్ప రాజు, సత్య ప్రకాష్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ... తనకున్న అన్ని పదవులను త్యాగం చేసి ,14 ఏండ్లు సుదీర్ఘ పొరటము చేసి చివరకు చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. తెలంగాణ అస్తిత్వానికి భంగం కలిగించే విధంగా ఆంధ్ర పెత్తందారిల మోచేతి నీళ్లు త్రాగుతూ



తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని మంట కలిపే విధంగా రేవంత్ రెడ్డి పరిపాలన సాగుతున్నదని మండిపడ్డారు. 20 సంవత్సరాలుగా తెలంగాణ సమాజం యావత్తు దేవత గా పూజించినటువంటి తెలంగాణ తల్లి రూపాన్ని మార్చుడం,తెలంగాణ తల్లి చేతిలోని బతుకమ్మ ను మాయం చేయడం, తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన తెలంగాణ అమరవీరులను స్మరించుకొనేందుకు కేసీఆర్ కట్టించిన తెలంగాణ అమరుల స్మారక జ్యోతి ప్రాంగణానికి తాళం వేయడం వంటివన్నీ రేవంత్ దుష్టపాలనకు నిదర్శనమని అన్నారు. గోదావరి మరియు కృష్ణలో మన నీళ్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దొంగలించుకపోతుంటే మన నీళ్ల కోసం మనం కొట్లాడే సందర్భంలో చంద్రబాబు నాయుడు దగ్గర బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇరిగేషన్ సెక్రటరీ గా పని చేసిన ఆదిత్యనాతన్ అనే ఐఏఎస్ ఆఫీసర్ ని ఇప్పుడు మన తెలంగాణ ఇరిగేషన్ శాఖ కు సలహాదారుడిగా నియమించడం లాంటి ఎన్నో రేవంత్ రెడ్డి నిర్ణయాలు తెలంగాణ అస్థిత్వానికి ఉనికికి భంగం కలిగించేవే అన్నారు. అందుకే తెలంగాణ అస్థిత్వాన్ని తెలంగాణ ఉనికిని కాపాడుకోవడం కోసం తిరిగి మళ్ళీ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఉద్యమ స్ఫూర్తితో పోరాడవలసిన సందర్భం ఇదని అన్నారు. ఇప్పుడు తెలంగాణ సమాజంలో మళ్ళీ ఆ ఉద్యమ స్ఫూర్తిని రగిలించడానికి తెలంగాణ ఉద్యమ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించినటువంటి కేసీఆర్దీక్ష ను తెలంగాణ సమాజానికి మళ్ళీ ఒకసారి గుర్తు చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ నెల 29 న జరిగే దీక్ష దివస్ కార్యక్రమానికి జిల్లాలోని ప్రతి మండలం నుండి 100 మంది కార్యకర్తలు, నిజామాబాద్ కార్పొరేషన్ ప్రతి డివిజన్ నుండి 50 మంది కార్యకర్తల చొప్పున 5000 పై చిలుకు తరలివచ్చి తెలంగాణ ఆస్థిత్వానికి భంగం కలిగిస్తున్నటు వంటి రేవంత్ రెడ్డి కి చెమటలు పట్టే విధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ వేముల కోరారు.

# ఉప్పల్ కురుమనగర్‌లో సీవరేజ్ ప్లాంట్

**- ప్రభుత్వ నిర్ణయంపై మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ ఫైర్**

**- అవసరం లేని చోట ప్లాంట్ పెట్టడంపై ఆగ్రహం**

**- కాలనీ వాసులతో కలసి ఆందోళన కార్యక్రమం**

**హైదరాబాద్,నవంబర్27( వెలుతురు):**
ఉప్పల్ నియోజకవర్గం ప్రజలకు సంబంధంలేని ఎస్ టి పి ప్లాంట్‌ను ఉప్పల్ కురుమనగర్ లో పెట్టడాన్ని బిజెపి నేత, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్. వి.ఎస్.ఎస్. ప్రభాకర్ తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ఇక్కడి ప్రజలకు ఏమి ఉపయోగమని నిలదీసారు. ఉప్పల్ హిల్స్, కురు నగర్‌లో ప్రభుత్వం తలపెట్టిన ఎస్ టి పి సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ కు వ్యతిరేకంగా ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం ఛలో కురుమ నగర్ కార్యక్రమం నిర్వహించారు. కురుమ నగర్, ఉప్పల్ హిల్స్, లక్ష్మి నగర్ ల ప్రజల అభిష్టానికి వ్యతిరేకంగా ప్రజా ఆరోగ్యలతో ఆటలాడుతున్నారని ప్రభాకర్ మండిపడ్డారు. కురుమ నగర్‌లో కాలనీ వాసులతో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రభాకర్



మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వంతో నిర్మాణం చేపట్టేందుకు నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. మురికి నీటిని శుద్ధి చేసి కాలువలు చెరువుల్లోకి పంపే విధంగా అనువైన స్థలాన్ని కేటాయించాల్సిన అధికారులు, కాంట్రాక్టర్లు కమిషన్ల కోసం కక్కుర్తి పడి సహజ సూత్రాలకు విరుద్ధంగా కురుమ నగర్ లో ప్లాంటును నిర్మిస్తున్నారని ఆయన ఆరోపించారు. అవినీతిపరులైన అధికారుల కారణంగా ప్లాంట్ నిర్మాణ వ్యయం సైతం 20 కోట్ల అదనపు భారం పెరుగుతుందని ఆయన ఆరోపించారు. అధికారుల తీరును దుయ్యబడుతూ ఆయన కురుమ నగర్ ప్రజలను చైతన్యం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాంటును వేరే చోటికి తరలించాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ ఉద్యమాన్ని నిరంతరం కొనసాగిస్తామని వెల్లడించారు. త్వరలో ఉన్నతాధికారులకు వాస్తవ విషయాలను వివరిస్తామని అయినప్పటికీ చర్యలు తీసుకొని పక్షంలో పోరాటానికి సిద్ధమవుతామని ప్రభాకర్ హెచ్చరించారు. ఉప్పల్ హిల్స్ లో ఎంపిక చేసిన స్థలం కింద చెరువు గాని పైన కాలువ గాను లేదని ఇది కేవలం ప్రాజెక్టు వ్యయం పెంచి తద్వారా కాంట్రాక్టుల ద్వారా డబ్బులు దండుకునే కార్యక్రమం తప్ప మరోటి కాదని పేర్కొన్నారు. ఎస్ టి పి స్థలాన్ని మాత్రమే మార్చాలని వేరేచోట ఈ ట్రీట్మెంట్ ప్లాంట్ ను పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహంకాళి లక్ష్మణ్ ముదిరాజ్, రావుల బాలకృష్ణ గౌడ్, రెడ్డిగారి దేవేందర్ రెడ్డి, దేవసాని బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com